
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 355
శుక్రవారం 17-3-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



నిఖత్ శుభారంభం
ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్‌కు చేరిన భారత బాక్సర్ - 13లో



అయిదు రోజుల నష్టాలకు చెక్!
కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు ఇంట్రాడేలో తీవ్ర ఊగిసలాట - 13లో



నాలుగో రోజూ ప్రతిష్టంభన
రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, అదానీ వ్యవహారంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నాలుగో రోజు కూడా స్తంభించాయి.
- వివరాలు 6లో▶



అమెరికా 'రక్షణ'లో రవిచౌదరి
అమెరికా రక్షణ శాఖలో ఎయిర్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్రటరీగా భారతీయ అమెరికన్ ఫ్లైట్ టెస్ట్ ఇంజినీర్ రవి చౌధరి నియమితులయ్యారు.
- వివరాలు 6లో▶



ఇమ్రాన్ అరెస్ట్‌కు రంగం సిద్ధం
నాన్‌బెయిలబుల్ వారెంట్లను రద్దు చేయాలంటూ ఇమ్రాన్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చడంతో అరెస్టు తప్పనిసరైంది.
- వివరాలు 6లో▶



ఎట్టకేలకు గార్సెట్టి ఎంపిక ఖరారు
అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సిఫారసుతో భారత్‌లో అమెరికా రాయబారిగా గార్సెట్టి త్వరలో నియామకం కానున్నారు.
- వివరాలు 6లో▶

పొగ మింగిన బతుకులు

స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు బలి

- భవనం మొత్తం చుట్టుముట్టిన మంటలు, పొగ..
- చిక్కుకుపోయిన 14 మందిని రెస్క్యూ చేసిన అగ్నిమాపక సిబ్బంది..
- పొగ ప్రభావంతో కన్నుమూసిన నలుగురు యువతులు, ఇద్దరు యువకులు..
- ఇంకా లోపల ఎవరైనా ఉన్నారా అనే ఆందోళన
- కొనసాగుతున్న సహాయక చర్యలు.. మరొకరి పరిస్థితి విషమం
- ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్

సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్‌లోని ప్రముఖ వ్యాపార సముదాయం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదం ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సాయంత్రం అయిదో అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రారంభమైన మంటలు భవనంలోని మిగతా అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లో మొత్తం 14 మంది చిక్కుకుపోయారు. వీరిని అగ్నిమాపక, డీఆర్‌ఎఫ్ అధికారులు బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్‌తో రెస్క్యూ చేశారు. పొగ పీల్చిన ఆరుగురు అసువులు బాశారు.

సాయంత్రం 6.30– 6.45 గంటలు..
బీ బ్లాక్ అయిదో అంతస్తులోని ఓ గోదాములో మంటలు చెలరేగాయి. తొలుత దట్టమైన పొగ వ్యాపించింది. కొద్దిసేపటకు అగ్నికీలలు పెరిగి ఆరు, ఏడు, ఎనిమిది అంతస్తులతో పాటు నాలుగో అంతస్తుకూ పాకాయి. పొగ, మంటల్ని గమనించిన కొందరు కాంప్లెక్స్ వదిలి బయటకు వచ్చేశారు. కాంప్లెక్స్ మొత్తానికి ఒకే మెట్ల మార్గం ఉండటం, అది ఇరుకు రావడంతో పాటు పొగ కారణంగా అయిదు నుంచి ఎనిమిదో అంతస్తుల్లో ఉన్న వాళ్లు బయటకు రాలేకపోయారు. ఇలా మొత్తం 14 మంది కాంప్లెక్స్‌లో చిక్కుకుపోయారు. అయిదో అంతస్తులోని బీఎం5 అనే ఈ-కామర్స్ కార్యాలయంలో పది మంది, ఎనిమిదో అంతస్తులోని తుకారాంగేట్ కానిస్టేబుల్ రవి ఇంట్లో అతడితో పాటు తల్లి భారతమ్మ, తండ్రి చిక్కుకుపోయారు. వీరిలో కొందరు టాయిలెట్స్ వైపునకు వచ్చి తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేయడంతో పాటు తమ సెల్‌ఫోన్లలోని లైట్లు ఆన్‌చేసి చూపిస్తూ తాము ప్రమాదంలో ఉన్నట్లు, రక్షించాలంటూ సైగలు చేశారు.

రాత్రి 7.30 గంటలు..
పది ఫైరింజన్లు, మరో అరగంటకు బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. డీఆర్‌ఎఫ్ చీఫ్ ప్రకాశ్‌రెడ్డి తన బృందంతో మిగతా 3వ పేజీలో ▶



మంటల్లో చిక్కుకున్న సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్



స్పృహకోల్పోయిన వారిని ఆస్పత్రులకు తరలిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



ఘటనాస్థలంలో బాధితులకు సీపీఆర్ చికిత్స



వికారాబాద్ మర్పల్లిలో ఓ పంటపొలంలో పేరుకుపోయిన వడగండ్లు

రాష్ట్రంలో అకాల వర్షం

- ఉపరితల ద్రోణి కారణంగా ఈదురుగాలులతో కూడిన వాన
- వికారాబాద్ జిల్లా సహా పలుచోట్ల వడగళ్ల బీభత్సం
- వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం.. పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- మరో మూడు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి - 5లో

ఇంటి వద్దే విచారించండి

ఈ దర్యాప్తును విశ్వసించలేని పరిస్థితి ఉంది.. ఈడీకి ఎమ్మెల్సీ కవిత లేఖ

గురువారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు గైర్హాజరు

తన ప్రతినిధిగా న్యాయవాదితో పలు డాక్యుమెంట్లు, లేఖ పంపిన కవిత

11వ తేదీనే ఇతరులతో కలిపి విచారిస్తామన్నారు కానీ అలా చేయలేదు..

ఫోన్ కావాలని సమన్లలో చెప్పలేదు

అయినా ఫోన్ తెప్పించి సీజ్ చేశారు

నా ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయి

దీనిపై సుప్రీంకు వెళ్లా.. అప్పటిదాకా విచారణ వాయిదా వేయాలని విజ్ఞప్తి

కానీ 20న విచారణకు రావాలంటూ కవితకు మళ్లీ ఈడీ నోటీసులు

ఈ కేసులో కవిత అనుమానితురాలు

ప్రత్యేక కోర్టుకు ఈడీ వెల్లడి

ఆమెతో కలిపి ప్రశ్నించేందుకు పిళ్లై కస్టడీ పొడిగించాలని విన్నపం



సాక్షి, న్యూఢిల్లీ: తాను నేరుగా విచారణకు హాజరుకాలేనని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటి నుంచే విచారణ చేయాలని ఈడీని ఎమ్మెల్సీ కవిత అభ్యర్థించారు. ఈడీ వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే.. దర్యాప్తును విశ్వసించడానికి కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు కవిత గైర్హాజరు అయ్యారు. ఈ మేరకు తాను ఈడీ కార్యాలయానికి ఎందుకు రావడం లేదనే అంశాలతోపాటు మహిళగా తనకున్న హక్కులను వివరిస్తూ ఆరు పేజీల లేఖ రాశారు. ఈడీ కోరిన మేర అన్ని ధ్రువపత్రాలను తన న్యాయవాది భరత్‌కుమార్‌తో పంపుతున్నానని.. ఇంకా ఏమైనా అవసరమైతే తనకు ఈ-మెయిల్ చేస్తే, వెంటనే స్పందిస్తానని తెలిపారు. ఈడీకి కవిత రాసిన లేఖ సారాంశమిదీ..

"ఈ ఏడాది మార్చి 11న ఢిల్లీ కార్యాలయంలో విచారణకు రావాలని ఈడీ మార్చి 7న సమన్లు ఇచ్చింది. అయితే చట్టాల ద్వారా రక్షణ కలిగిన మహిళగా తనను ఈడీ కార్యాలయానికి పిలవాల్సిన అవసరం లేదని, ఆడియో/వీడియో పద్ధతిలో కనిపించడానికి సిద్ధంగా ఉంటూ ఈడీ అధికారులను నా నివాసానికి ఆహ్వానించాను. కానీ కస్టడీలో ఉన్న మరో వ్యక్తితో కలిపి భౌతికంగా విచారించాల్సి ఉందని, విచారణ వాయిదాగానీ, నివాసంలో స్టేట్‌మెంట్ రికార్డు చేయడం కుదరదని అధికారులు అభ్యంతరం తెలిపారు. దీనితో దర్యాప్తునకు సహకరించడానికి మార్చి 11న ఈడీ కార్యాలయానికి హాజరయ్యాను. తెలిసిన వివరాలన్నీ అందించి మిగతా 3వ పేజీలో ▶

తుగ్లక్ రోడ్‌లో హైడ్రామా
- ఈడీ ముందు హాజరు విషయంలో ఎమ్మెల్సీ కవిత మల్లగుల్లాలు
- మంత్రులు కేటీఆర్, హరీశ్ సహా న్యాయ నిపుణులతో విస్తృత చర్చలు
- సీఎం కేసీఆర్ నివాసం, ఈడీ కార్యాలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం - వివరాలు 3లో▶

మిగతా పేపర్లు పెన్‌డ్రైవ్ దాటలేదు

- ఏఈ పరీక్ష ప్రశ్నపత్రాలు మాత్రమే లీక్
- సిట్‌కు సైబర్ ఫోరెన్సిక్ నిపుణుల ప్రాథమిక నివేదిక
- ఫిబ్రవరి 27న ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లోకి గ్రూప్–1 సహా ఇతర ప్రశ్నపత్రాలు
- అక్టోబర్‌లోనే పూర్తయిపోయిన గ్రూప్–1 పరీక్ష

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంపై సాంకేతిక దర్యాప్తు చేస్తున్న సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు తమ ప్రాథమిక నివేదికను గురువారం ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అందించారు. కేవలం అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పరీక్ష పత్రాలు మాత్రమే లీక్ అయ్యాయని, గ్రూప్–1 పేపర్లు పరీక్ష పూర్తయిన తర్వాతే ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లోకి చేరాయని, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించినవి పెన్‌డ్రైవ్ దాటి బయటకు రాలేదని తేల్చారు. కమిషన్ కంప్యూటర్లలో అక్రమ చొరబాట్లు, నెట్‌వర్క్ మార్పు చేర్పులను గుర్తించడానికి ఉన్న ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఓపెన్ కాకపోవడంతో దర్యాప్తు ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

ఫిబ్రవరి 27న ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లోకి ప్రశ్నపత్రాలు
ఏఈ పరీక్షకు సంబంధించిన జనరల్ స్టడీస్, సివిల్ పేపర్లకు డిమాండ్ ఉండటంతో ముందుగా అవి కావాలని రేణుక కోరింది. దీంతో రాజశేఖర్ సాయంతో కమిషన్ కస్టోడియన్ శంకరలక్ష్మి కంప్యూటర్‌లోకి చొరబడిన ప్రవీణ్ అందులోని ప్రశ్నపత్రాల ఫోల్డర్‌ను తన పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నాడు. ఈ పెన్‌డ్రైవ్‌ను అందులోని సమాచారం, ఆధారాలు ధ్వంసం కాకుండా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిపుణులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల సాయంతో విశ్లేషించారు. ఫోల్డర్ ఎప్పుడు క్రియేట్ అయ్యింది? ఎప్పుడు మోడిఫై అయ్యింది? మిగతా 2వ పేజీలో ▶

ఆధారాల మేరకే చర్యలు
పరీక్షల రద్దు డిమాండ్‌పై టీఎస్‌పీఎస్సీ వర్గాల స్పష్టీకరణ

రాజశేఖర్ ఆర్థిక పరిస్థితిపై సిట్ ఆరా
సుమారు 2.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉందంటున్న గ్రామస్తులు

2లో

గెలుపుబాటలో ఏవీఎన్ రెడ్డి!

- 19వ రౌండ్ ముగిసేసరికి 1,312 ఓట్ల ఆధిక్యం
- కొనసాగుతున్న 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు

- వివరాలు 14లో▶

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఓట్ల లెక్కింపు

- వివరాలు 10లో▶



కూలిన చీతా హెలికాప్టర్

ఇద్దరు సైన్యాధికారుల దుర్మరణం
మృతిచెందిన యాదాద్రి భువనగిరి జిల్లావాసి



- ఇద్దరు సైన్యాధికారులతో ప్రయాణిస్తున్న సైనిక చీతా హెలికాప్టర్ అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల మండల కొండల్లో గురువారం ఉదయం ప్రమాదవశాత్తు కూలింది. ఈ ఘటనలో హెలికాప్టర్ పైలెట్‌గా విధుల్లో ఉన్న లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి, కోపైలట్‌గా ఉన్న మేజర్ ఏ.జయంత్ ప్రాణాలు కోల్పోయారు. దట్టంగా మంచు కమ్ముకున్న హెలికాప్టర్ కూలింది. ప్రమాదంలో అసువులు బాసిన ఉప్పల వినయ్ భానురెడ్డి(వీవీబీ) స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం. వినయ్ భానురెడ్డికి చిన్ననాటి నుంచి అమితమైన దేశ భక్తి. 21 ఏళ్లుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తూ లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు.

- వివరాలు 6లో▶

సంక్షేమంతో కూడిన పురోగతే లక్ష్యం
ఐదవసారీ.. అభివృద్ధి దారే

రూ.2,79,279.27 కోట్లతో 2023-24 ఏపీ వార్షిక బడ్జెట్



- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళలు, పిల్లల పథకాలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట

- వివరాలు 10లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Venkobb CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు
గుడ్ల రిటైల్ ధర ₹ 57 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 90
రిటైల్ లైవ్ బర్డ్ 112
డ్రెస్డ్ స్కిన్‌తో 162
స్కిన్‌లెస్ 185



పెండింగ్ ఫైల్స్ గురించి అడిగినప్పుడల్లా యోగా చేస్తున్నాడ్సార్!

రాష్ట్రం యాభై ఏళ్ల వెనక్కి వెళ్లింది

బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను బంగాళాఖాతంలో పడేద్దాం

- ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దలున్నారు
- 2024లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెసే..
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రారంభం



గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎల్పీనేత భట్టి విక్రమార్క

సాక్షి, ఆదిలాబాద్: కేసీఆర్ పాలనతో రాష్ట్రం యాభై ఏళ్ల వెనక్కి వెళ్లిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారని, ఆయా పార్టీలను వచ్చే ఎన్నికల్లో బంగాళాఖాతంలో పడేద్దామని పిలుపునిచ్చారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ కొనసాగింపుగా మల్లుభట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర మండలం పిప్రి నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్రను తలపెట్టారు. గురువారం మొదటిరోజు పిప్రి నుంచి ఇచ్చోడ వరకు 4 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఇచ్చోడలో కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఇక కేసీఆర్ ఆటలు సాగవన్నారు. లక్షల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టామని చెబుతున్న కేసీఆర్‌వి అన్నీ కల్లబొల్లి మాటలేనని ధ్వజమెత్తారు. లక్షల కోట్లు నిధులు పోయినవి.. నీళ్లు రాలేదు.. ఉద్యోగాలు రాలేదు.. నోటిఫికేషన్లు జారీ చేసి ప్రశ్నపత్రాలను లీక్ చేసిన వ్యవహారంలోనూ ఈ ప్రభుత్వ పెద్ద మనుషులే ఉన్నారని ఆరోపించారు. లక్షలాది నిరుద్యోగుల మానసిక క్షోభకు ఈ ప్రభుత్వం కారణమన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు మూడు నెలల పాటు తాను పాదయాత్ర చేపట్టి ప్రజలకు ఈ ప్రభుత్వాల వల్ల జరుగుతున్న మోసాలను తెలియజేస్తానని చెప్పారు.

భట్టికి గద్దర్ సంఘీభావం
ఇచ్చోడ సభలో ప్రజా గాయకుడు గద్దర్ పాల్గొని భట్టికి సంఘీభావం తెలిపారు. పాదయాత్రకు తన మద్దతు ఉంటుందని తెలియజేశారు. కాగా, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో భట్టి పాదయాత్ర ప్రారంభించారు. ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావెద్, రోహిత్ చౌదరి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్ హన్మంత్‌రావు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత సంస్థల్లోకి మళ్లిస్తున్నారు



- మార్గదర్శి.. మరో అగ్రిగోల్డ్, సహారా కాకముందే చర్యలు చేపట్టాం
- విచారణ 'పరిధి' అంశం పెండింగ్‌లో ఉండగా క్వాష్ పిటిషనా?
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

- వివరాలు 10లో▶

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ పరీక్షల రీషెడ్యూల్ అనివార్యమే..!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న పరీక్షల తేదీలు మారక తప్పేలా లేదు. ఈనెల 5న నిర్వహించిన ఏఈ పరీక్ష రద్దు కాగా.. ఈనెల 12, 15, 16 తేదీల్లో నిర్వహించాల్సిన టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలు రద్దయ్యాయి. ఇదే సమయంలో వచ్చే నెలలో జరగాల్సిన హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పరీక్షల నిర్వహణపైనా అనుమానాలు నెలకొన్నాయి. కొత్తగా ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్ష నిర్వహించేందుకు మరింత సమయం పట్టనుంది. ఈ క్రమంలో పరీక్ష తేదీల్లో మార్పులు తప్పవని టీఎస్‌పీఎస్సీ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రం ఇప్పటికీ వెలువడలేదు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ తప్పుకోవాలి

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేయకుంటే నేటి నుంచి ఆమరణ దీక్ష: ప్రవీణ్‌కుమార్



తెలకపల్లి: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే శుక్రవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు అయోమయంలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని ప్రవీణ్ మండిపడ్డారు. అంబేడ్కర్, కాన్షీరాం అడుగుజాడల్లో నడిచి రాజ్యాధికారం సాధించుకోవాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు.

అసమర్థత, నిర్లక్ష్యంతోనే పేపర్ లీకేజీ: తరుణ్‌ఛుగ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో తలెత్తిన సంక్షోభానికి సీఎం కేసీఆర్ అసమర్థత, నిర్లక్ష్యమే కారణమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ విమర్శించారు. దీనికి కేసీఆరే పూర్తి బాధ్యత వహించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో నిరాశలో కూరుకుపోయిన నిరుద్యోగుల తరఫున న్యాయం కోసం పోరాడుతున్న వారిని అరెస్ట్ చేసి దోషులను కాపాడేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తరుణ్‌ఛుగ్ ఆరోపించారు. ఈ స్కాంపై కేసీఆర్ నోరువిప్పలేదని, దాపరికం లేకపోతే మౌనంతో ఎవరిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీజేవైఎం నాయకులు ధర్నా చేస్తే వారిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాగా, పేపర్ లీకేజీ వ్యవహారానికి సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే ఈటల ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

తెలంగాణను దర్జాగా దోచుకుంటున్నారు

ట్విట్టర్‌లో వైఎస్ షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను దొంగలు దర్జాగా దోచుకుంటున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దుయ్యబట్టారు. ఇక్కడి ప్రతిపక్షాలు మాత్రం గుడ్డి గుర్రాలకు పళ్ల తోముతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల పేరుతో లక్ష కోట్లు దోచుకుంటూ.. తమ అక్రమాలను అడ్డుకున్నవారిని, ప్రశ్నించిన వారిని ప్రభుత్వం చావగొడుతోందని ఆమె ఆరోపించారు. తల్లిలాంటి తెలంగాణను చంపుతున్న అసలు గూండాలు బీఆర్‌ఎస్ నేతలేనని మండిపడ్డారు. ఈసారి ఓటు కోసం కాలు బయటపెట్టి చూడండి.. తండ్రి, కొడుకులకు రోకలి బండే సమాధానమవుతుందన్నారు.

ఆన్‌లైన్‌లో రాష్ట్రపతి నిలయం సందర్శన టికెట్లు

సాక్షి, హైదరాబాద్: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం ముస్తాబవుతోంది. ఈ నిలయాన్ని సందర్శించాలనుకున్న వారికి ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసే వీలు ప్రభుత్వం కల్పించింది. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఈనెల 23 నుంచి రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించవచ్చు. ఈనెల 22న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్రపతి భవన్ సందర్శన కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారు. మరుసటి రోజు నుంచి సందర్శకులకు అనుమతి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు విజిట్.రాష్ట్రపతిభవన్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. భారతీయ పౌరులకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున, విదేశీయులకు రూ.250 చొప్పున టికెట్ ధరను నిర్దేశించారు. 8 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం ఉచితం. ప్రతి సోమవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో సందర్శకులకు ప్రవేశం ఉండదు.

లీక్‌పై గవర్నర్‌కు రేపు ఫిర్యాదు

బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయం

- ఐటీ మంత్రి కేటీఆర్ బర్తరఫ్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు డిమాండ్



గురువారం హైదరాబాద్‌లో సమావేశమైన బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై శనివారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఫిర్యాదు చేయాలని బీజేపీ నిర్ణయించింది. తొలుత శుక్రవారమే కలిసి వినతిపత్రం సమర్పించాలని భావించినా, గవర్నర్ అందుబాటులో ఉండటం లేదన్న సమాచారంతో కార్యక్రమాన్ని 18వ తేదీకి మార్చారు. మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇతర నేతలు శుక్రవారం నిరసన దీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాల లీకేజీకి ఐటీ శాఖ వైఫల్యమే ప్రధాన కారణమని పార్టీ అభిప్రాయపడింది. ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది. లీకేజీ వ్యవహారంపై బీజేపీ నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ అధ్యక్షతన సమావేశమైంది. టీఎస్‌పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేయాలని, కమిషన్ చైర్మన్ సహా సభ్యులందరినీ తొలగించాలని కమిటీ డిమాండ్ చేసింది. గ్రూప్–1, ఏఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకైనట్లు ప్రాథమికంగా అంచనా వేసిన కమిటీ.. మిగిలిన పేపర్ల లీకేజీ సంబంధిత అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

ప్రగతి భవన్‌కు లింకులున్నాయా?

లీకేజీకి సంబంధించిన పలు అంశాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ చర్చించింది. ప్రశ్నపత్రాలు ఎలా లీక్ అయ్యాయి? దీని వెనుక ఎవరున్నారు? చైర్మన్‌పై ఏమైనా ఒత్తిడి ఉందా? కింది స్థాయి సిబ్బందికి నేరుగా ప్రగతి భవన్‌తో లింకులున్నాయా? తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. కాగా కేంద్రం 2011లో చేసిన ఐటీ చట్ట సవరణ ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో నడిచే అన్ని శాఖల్లోని ఐటీ విభాగాలు తప్పనిసరిగా కేంద్రం నియమించిన థర్డ్ పార్టీ నిర్వహించే సెక్యూరిటీ ఆడిట్ సర్టిఫికెట్ పొంది ఉండాలి. కానీ తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రభుత్వ శాఖ వెబ్‌సైట్‌కూ ఆడిట్ సర్టిఫికెట్ లేదనే విషయం పలువురు సభ్యులు ప్రస్తావించారు.

నష్టపోయే విద్యార్థులకు పరిహారంపై ఒత్తిడి

పరీక్షల రద్దుతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదమున్న నేపథ్యంలో వారందరికీ రూ. లక్ష చొప్పున పరిహారం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కమిటీ నిర్ణయించింది. అయితే గత షెడ్యూల్ మేరకు ఆయా పరీక్షలన్నీ నిర్వహించి ఉద్యోగ నియామకాలను పూర్తి చేసేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని కూడా తీర్మానించింది. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ కన్వీనర్ సీహెచ్.విఠల్, సభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, చంద్రవదన్, టి.క్రిష్ణప్రసాద్, దుగ్యాల ప్రదీప్‌కుమార్, ఎస్.కుమార్, కరుణాగోపాల్ పాల్గొన్నారు.

అక్రమాలపై న్యాయపోరాటం

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతోపాటు ధరణి స్కాం, జీహెచ్‌ఎంసీ నకిలీ సర్టిఫికెట్ల స్కాం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చెల్లింపుల స్కాం సహా ఇరిగేషన్ శాఖలో భారీగా కుంభకోణాలు జరుగుతున్నాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. దీనికంతటికీ ఐటీ శాఖ పరిధిలో ఉద్దేశపూర్వకంగా కొనసాగిస్తున్న లోపాలే కారణమని అంచనాకు వచ్చారు. టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై విచారణ కోసం న్యాయపోరాటం చేయాలని టాస్క్ ఫోర్స్ కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.

'లీకేజీ'లకు నిరసనగా నేడు సంజయ్ దీక్ష

సాక్షి, హైదరాబాద్/చంచల్‌గూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్న పత్రాల లీకేజీలను నిరసిస్తూ శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇతరనేతలు పార్టీ కార్యాలయంలో నిరసన దీక్ష చేపట్టనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల దాకా నిరసన తెలపనున్నారు. పేపర్ లీకేజీలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ, ఐటీమంత్రి కేటీఆర్ బర్తరఫ్, నష్టపోయిన నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం వంటి డిమాండ్లతో ఈ దీక్ష నిర్వహిస్తున్నారు. బండి సంజయ్ తొలుత పార్టీ నేతలతో కలసి గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. అనంతరం రాష్ట్ర కార్యాలయంలో నిరసన దీక్షలో పాల్గొంటారు.

లీకేజీలో కేటీఆర్ ప్రమేయం: బండి సంజయ్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ ప్రమేయం ఉందని బండి సంజయ్ ఆరోపించారు. లీకేజీ వ్యవహారానికి నిరసనగా ధర్నా చేసిన బీజేవైఎం నాయకులు భానుప్రకాశ్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. గురువారం వారిని ములాఖాత్‌లో పరామర్శించేందుకు బండి సంజయ్ జైలుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. దీనికి సూత్రధారి రేణుక బీఆర్‌ఎస్‌కే చెందినవారని ఆరోపించారు. లీకేజీలతో బీజేపీకి సంబంధం ఉందన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించారు.

ఆధారాల మేరకే చర్యలు

- పరీక్షల రద్దు డిమాండ్‌పై టీఎస్‌పీఎస్సీ వర్గాల స్పష్టీకరణ
- హడావుడిగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ఇంజనీర్ అర్హత పరీక్షను రద్దు చేస్తూ టీఎస్‌పీఎస్సీ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మిగతా పరీక్షలను కూడా రద్దు చేయాలనే డిమాండ్ తీవ్రమవుతోంది. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షతో పాటు ఆ తర్వాత నిర్వహించిన పలు పరీక్షల ప్రశ్నపత్రాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయంటూ అభ్యర్థులతో పాటు విద్యార్థి సంఘాలు ఆందోళనలు ఉధృతం చేస్తున్నాయి. ఈ దిశగా కమిషన్ కార్యాలయం వద్ద, జిల్లాల్లోనూ తీవ్రస్థాయిలో నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. అయితే టీఎస్‌పీఎస్సీ మాత్రం దీనిపై స్పష్టమైన వైఖరితోనే ఉంది. సరైన ఆధారాలు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆదరబాదరా నిర్ణయం తీసుకోలేమని, తొందరపడి, ఒత్తిడికి గురై నిర్ణయాలు తీసుకుంటే అభ్యర్థుల భవిష్యత్తు తీవ్ర గందరగోళంలో పడుతుందని చెబుతున్నాయి. ఇప్పటివరకు కేవలం అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష ప్రశ్నపత్రం మాత్రమే లీకైనట్లు తేలడంతో, లోతుగా చర్చించి అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆ పరీక్షను రద్దు చేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

సిట్ విచారణలో తేలాకే..

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ, కంప్యూటర్ల నుంచి సమాచారం తస్కరణపై నమోదైన కేసులపై సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) దర్యాప్తు ముమ్మరం చేసింది. గత రెండ్రోజులుగా సిట్ సభ్యులు కమిషన్ కార్యాలయంలోని అధికారులను, ఉద్యోగులు, సిబ్బందిని పలు దఫాలుగా విచారిస్తూ సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ విచారణ అత్యంత వేగవంతంగా కొనసాగుతున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సిట్ పరిశీలనలో తేలిన అంశాలు, నిందితుల ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లోని సమాచారం తదితరాలపై పూర్తి స్థాయి ఫోరెన్సిక్ నివేదిక అందిన తర్వాతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు భావిస్తున్నారు. ఏఈ పరీక్షను రద్దు చేసిన అధికారులు..మిగతా పరీక్షలకు సంబంధించిన వ్యవహారాన్ని పూర్తిగా నిగ్గుతేల్చిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నారు.

రాజశేఖర్ ఆర్థిక పరిస్థితిపై సిట్ ఆరా

- 2017లో కాంట్రాక్టు ఉద్యోగిగా టీఎస్‌పీఎస్సీలో చేరిక
- స్వల్పకాలంలోనే స్వగ్రామం తాటిపల్లిలో ఆధునిక భవనం
- సుమారు 2.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉందంటున్న గ్రామస్తులు



జగిత్యాల క్రైం: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్ కేసులో ఏ–2గా ఉన్న రాజశేఖర్ ఆర్థిక మూలాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. వాస్తవానికి ఈ కుటుంబం గతంలో ఆర్థికంగా అంత ఉన్నదేమీ కాదు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన రాజశేఖర్ తండ్రి ఉపాధి కోసం దుబాయ్, సౌదీ, మస్కట్, లిబియా లాంటి దేశాలకు వలస వెళ్లారు. అంతోఇంతో సంపాదించి ఆ సొమ్ముతో తన కుమారుడు, కుమార్తెను చదివించారు. తల్లి అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం చేస్తూ పిల్లల ఆలనాపాలనా చూసుకుంది. చదువు పూర్తయ్యాక రాజశేఖర్ టీఎస్‌పీఎస్సీలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరాడు. అయితే 'ఉద్యోగంలో చేరిన కొద్దికాలంలోనే తాటిపల్లిలో ఆధునిక హంగులతో రూ.25 లక్షలు – రూ.30 లక్షల విలువైన భవనం నిర్మించాడు. తన ఇద్దరు స్నేహితులకు ఉద్యోగాలు ఇప్పించాడు. సోదరికి కరీంనగర్‌కు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారు న్యూజిలాండ్‌లో స్థిరపడగా..తల్లిదండ్రులు స్వగ్రామంలోనే ఉంటున్నారు. వారికి గ్రామ శివారులో సుమారు రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఉంది..'అని గ్రామస్తులు చెబుతున్నారు. వీటన్నిటిపైనా సిట్ దృష్టి సారించినట్లు తెలిసింది.

బంధువుల సాయంతో కాంట్రాక్టు ఉద్యోగం..

కరీంనగర్‌లో డిగ్రీ పూర్తిచేసిన రాజశేఖర్ కొన్నాళ్లు హైదరాబాద్‌లో ఉండి కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులో శిక్షణ పొందాడు. తర్వాత అఫ్గానిస్తాన్ వెళ్లి అక్కడ మూడేళ్ల పాటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. తిరిగి స్వదేశానికి వచ్చి లంబాడిపల్లికి చెందిన సుచరితను వివాహం చేసుకున్నాడు. వీరికి ప్రస్తుతం ఐదేళ్ల బాబు ఉన్నాడు. కాగా రాజశేఖర్‌కు కరీంనగర్‌లోని అతని సమీప బంధువులు 2017లో టీఎస్‌పీఎస్సీలో కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించినట్లు తెలుస్తోంది. తమ కొడుకు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడని, నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వేతనం పొందుతున్నాడని తల్లిదండ్రులు గ్రామస్తులకు చెబుతూ వచ్చినట్లు సమాచారం.

సన్నిహితులు ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు

రాజశేఖర్ తనకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు స్నేహితులకు 2018లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిసింది. ఒకరు విద్యాశాఖలో, మరొకరు వేరే శాఖలో పని చేస్తున్నట్లు సమాచారం. కాగా రాజశేఖర్ మరికొందరికి కూడా ఈ విధంగా ఉద్యోగాలు ఇప్పించాడని తెలుస్తోంది.

మిగతా పేపర్లు పెన్‌డ్రైవ్ దాటలేదు

▶ మొదటి పేజీ తరువాయి

చివరిసారిగా ఎప్పుడు యాక్సెస్ అయ్యింది? తదితర వివరాలు పరిశీలించారు. పెన్‌డ్రైవ్‌లో ఫిబ్రవరి 27న ఈ 'క్వశ్చన్ పేపర్స్'ఫోల్డర్ క్రియేట్ అయినట్లు తేల్చారు.

అక్టోబర్‌లోనే పూర్తయిపోయిన గ్రూప్–1..

ఈ ఫోల్డర్‌లో ఉన్న ఏఈ ప్రశ్నపత్రాల ప్రింట్‌ఔట్ తీసిన ప్రవీణ్ మరుసటి రోజు (ఫిబ్రవరి 28న) రేణుక, ఆమె భర్త లవడ్యావత్ డాక్యాలకు అందించాడు. అదే సమయంలో తన వద్ద టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ), గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన పరీక్షల పేపర్లు కూడా ఉన్నాయని, అభ్యర్థులను చూడాలని రేణుకకు చెప్పాడు. అయితే ఏఎంవీఐ, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ పరీక్షలకు తేదీ ఖరారు కాకపోవడంతో వాటిపై ఆమె ఆసక్తి చూపలేదు. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం తమ సామాజిక వర్గంలోనే వెతికే ప్రయత్నాల్లో ఉండగా పట్టుబడింది. మరోవైపు గ్రూప్–1 పరీక్షలు గతేడాది అక్టోబర్‌లోనే పూర్తయిపోయినా.. శంకరలక్ష్మి ఆ పేపర్లను ఫోల్డర్‌లోనే ఉంచడంతో అవి కూడా ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లోకి చేరాయని సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రవీణ్ పెన్‌డ్రైవ్ నుంచి ఈ ఫైల్స్ మరో కంప్యూటర్‌లోకి కాపీ అయినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని వారు చెప్పారు. అయితే లీకేజీ జరిగిందనే కోణంలోనే, వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషణ కొనసాగిస్తున్నామని సిట్ అధికారులకు తెలిపారు.

బిట్ లాకర్ 'కీ'ని మర్చిపోయారు...

లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షలను నిర్వహించే టీఎస్‌పీఎస్సీ లోని సాంకేతిక అంశాల్లో ఉన్న మరో నిర్లక్ష్యాన్ని సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు గురువారం గుర్తించారు. అక్రమ చొరబాట్లను గుర్తించడానికి కంప్యూటర్లలో సాధారణంగా బిట్ లాకర్ అనే సాఫ్ట్‌వేర్ పొందుపరుస్తారు. దీన్ని ఓపెన్ చేసి, సమగ్రంగా విశ్లేషించడం ద్వారా ల్యాన్‌లో కనెక్ట్ అయి ఉన్న ఏఏ కంప్యూటర్లు, ఎప్పుడెప్పుడు అక్రమ చొరబాట్లకు గురయ్యాయనేది గుర్తించవచ్చు. ఈ బిట్ లాకర్‌ను విశ్లేషించడానికి తెరవాలంటే దాన్ని ఇన్‌స్టాల్ చేస్తున్న సమయంలో వాడిన 'కీ'తెలిసి ఉండాలి. కానీ టీఎస్‌పీఎస్సీ కంప్యూటర్లలో అది ఇన్‌స్టాల్ అయి ఏళ్లు గడిచి పోవడం, నాటి 'కీ'ప్రస్తుత అడ్మిన్లకు తెలియకపోవడంతో బిట్ లాకర్ ఓపెన్ కావట్లేదు. ప్రత్యామ్నాయ సాఫ్ట్‌వేర్ల ద్వారా దానిని తెరవడానికి ప్రయత్నిస్తుండటంతో దర్యాప్తు ఆలస్యమవుతోంది.

రాష్ట్రంలో ఆర్‌ఎస్సెస్‌కు పెరిగిన ఆదరణ

మీడియాతో ఆ సంఘం తెలంగాణ కార్యవాహ కాచం రమేశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆరెస్సెస్) కార్యకలాపాలు తెలంగాణలో బాగా విస్తరించాయని, సంఘంపట్ల రాష్ట్ర ప్రజల సహకారం, ఆదరణ పెరుగుతోందని ఆరెస్సెస్ రాష్ట్ర కార్యవాహ కాచం రమేశ్ అన్నారు. గతేడాదితో పోల్చితే పట్టణాల్లో 9, గ్రామాల్లో 8 శాతం ఆరెస్సెస్ శాఖలు వృద్ధి చెందాయని చెప్పారు. గతంలో 36 స్థలాల్లో శిక్షణా కార్యక్రమాలు జరిగితే, ఈ ఏడాది 60 స్థలాల్లో జరిగాయని, 2,166 గ్రామాల నుంచి 7,346 మంది (గతం కంటే రెండున్నర వేల మంది అధికం) ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. గురువారం ఇక్కడి కేశవ నిలయంలో రమేశ్ మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కొత్తతరం, ముఖ్యంగా యువత, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర వర్గాలు ఆరెస్సెస్ పట్ల ఆకర్షితులవుతున్నారని తెలిపారు. సంఘ్ పూర్తికాలం కార్యకర్త, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కనిపించడంలేదంటూ పలుచోట్ల పోస్టర్లు వేయడం హాస్యాస్పదమని, ప్రస్తుతం ఆయన బీజేపీలో పనిచేస్తున్నందున చట్టం, న్యాయపరంగా ఏమి చేయాలనేది ఆ పార్టీ చూసుకోవాలని ఒక ప్రశ్నకు రమేశ్ బదులిచ్చారు. ఇటీవల హరియాణలోని సమల్ఖాలో జరిగిన ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రతినిధిసభ సమావేశాల్లో చేసిన తీర్మానాలు, వచ్చే ఏడాదికి చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆరెస్సెస్ ఏర్పడి 98 ఏళ్లు గడిచాయని, మరో రెండేళ్లలో వందో ఆవిర్భావ దినోత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు.

బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా ఆర్‌జీఐఏ

సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాదికి (2023) దక్షిణాసియాలో ఉత్తమ ప్రాంతీయ విమానాశ్రయంగా నిలిచింది. ప్రయాణికులు అందజేసే సమాచారం ఆధారంగా ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ విమానాశ్రయాలను గుర్తించి అవార్డులను అందజేసే స్కైట్రాక్స్ వరల్డ్ ఈ మేరకు ఆర్‌జీఐ విమానాశ్రయాన్ని ఉత్తమ ప్రాంతీయ ఎయిర్‌పోర్టుగా ఎంపిక చేసింది. అదే విధంగా 'బెస్ట్ ఎయిర్ పోర్ట్ స్టాఫ్'అవార్డును కూడా అందించింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు కోవిడ్ సంక్షోభం నుంచి బయటపడడమే కాకుండా ప్రయాణికుల సేవల్లో ఉన్నత స్థితికి చేరుకుందని స్కైట్రాక్స్ సీఈఓ ఎడ్వర్డ్ ప్లాస్టెడ్ పేర్కొన్నారు. విమానాశ్రయ రంగంలో స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డులు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. 550కు పైగా విమానాశ్రయాలలో వినియోగదారుల సేవలు, సౌకర్యాలను అంచనా వేస్తూ అందించే ఈ అవార్డులను ప్రపంచ విమానాశ్రయ రంగానికి నాణ్యమైన బెంచ్‌మార్క్‌గా పరిగణిస్తారు. స్కైట్రాక్స్ 1999 నుంచి ఈ అవార్డులను అందజేస్తోంది.

పెళ్లి.. పుస్తకం

పెళ్లిళ్లలో పుస్తక ప్రదర్శనలు

ఫంక్షన్‌హాల్‌లో మహనీయుల పుస్తకాలు

సంగారెడ్డి జిల్లాలో కొత్త సాంప్రదాయం

పుస్తకపఠనంపై మళ్లీ ఆసక్తి పెంచడమే లక్ష్యం



జహీరాబాద్‌లో జరిగిన ఓ వివాహంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

వివాహ వేడుకల్లో హంగు, ఆర్భాటాలు ప్రదర్శించడం చూస్తుంటాం.. కానీ సంగారెడ్డి జిల్లాలో ఇటీవల వివాహ వేడుకల్లో సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పెళ్లి మండపంలో మహనీయుల పుస్తక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంబేద్కర్, జ్యోతి బాపూలే, సావిత్రిబాయిపూలే, భగత్‌సింగ్ వంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, ప్రముఖుల సాహిత్య రచనలకు సంబంధించిన పుస్తకాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నారు. వివాహ వేడుకలకు హాజరయ్యే బంధుమిత్రులు ఈ పుస్తక ప్రదర్శనను వీక్షించి, తమకు నచ్చిన పుస్తకాలను కొనుక్కుంటున్నారు. కొందరు ఈ పుస్తకాలను వధూవరులకు బహుమతులుగా కూడా ఇస్తున్నారు. ఫంక్షన్‌హాలులోకి ప్రవేశించే ప్రదేశంలో ఈ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తుండటంతో ప్రతి ఒక్కరూ ఆసక్తిగా పుస్తకాలను వీక్షిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

ఆదర్శంగా నిలుస్తూ..

అందోల్ పట్టణానికి చెందిన తలారి లక్ష్మణ్ రెవెన్యూ శాఖలో ఆర్‌ఐగా పనిచేస్తున్నారు. తన కూతురు వివాహాన్ని బౌద్ధమత ఆచారం ప్రకారం ఘనంగా నిర్వహించిన లక్ష్మణ్, ఈ వివాహ వేడుకలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సమతా సైనిక్ సేవాదళ్‌లో పని చేస్తున్న జహీరాబాద్‌కు చెందిన ఎర్రోళ్ల విష్ణు తన వివాహ వేడుకలో కూడా ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. అందోల్‌కు చెందిన ఆది తక్షక్ తన తండ్రి వర్ధంతి సందర్భంగా కూడా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయించారు.

ఆసక్తి పెరిగేలా..

సోషల్ మీడియా ప్రభావంతో చాలా మందిలో పుస్తక పఠనాసక్తి తగ్గిపోతోంది. పుస్తక ప్రదర్శనలకు గానీ, బుక్ స్టాల్‌కు గానీ వెళ్లి పుస్తకాలు కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య చాలా వరకు తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో కొందరు ఆదర్శభావాలు ఉన్న వారు వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో పుస్తకాలను అందరికీ అందుబాటులో ఉంచడం ద్వారా పుస్తకాలపై మళ్లీ ఆసక్తి పెరిగేలా చేస్తున్నారు. వివాహ వేడుకలకు వందలు, కొన్ని చోట్ల వేలల్లో హాజరవుతుంటారు. ఈ ప్రదర్శనలతో కొందరిలోనైనా పుస్తకాల పట్ల ఆసక్తి కలిగేలా చేసినా చాలని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

పుస్తకం ఆయుధం లాంటిది..



పుస్తకం జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఒక ఆయుధం లాంటిది. వివాహ వేడుకలకు బంధుమిత్రులు, సన్నిహితులు.. అందరూ హాజరవుతారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా వారిలో మహనీయుల పుస్తకాలను చదవాలనే ఆసక్తి పెరుగుతుంది. అందుకే నా కూతురు వివాహంలో ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయించాను.

– తలారి లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అందోల్, సంగారెడ్డి జిల్లా

నా మ్యారేజీ నుంచే మార్పురావాలని



సోషల్ మీడియా ప్రభావంతో చాలా మంది సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా యువత పుస్తకాలు చదవడం మానేశారు. మహనీయుల పుస్తకాలను చదవడం ద్వారా ఆలోచన శక్తిని పెంచుకోవచ్చు. సన్మార్గంలో నడిచేందుకు ఉపయోగపడతాయి. ఇలాంటి పుస్తక ప్రదర్శన కల్చర్ పెరగాలని కోరుకుంటున్నాను. నా మ్యారేజీ నుంచే ఈ మార్పు రావాలని భావించి పెళ్లిలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయించాను.

– ఎర్రోళ్ల విష్ణు, జహీరాబాద్, సంగారెడ్డి జిల్లా

ఫోన్ చేస్తే వెళ్లి స్టాల్ ఏర్పాటు చేస్తున్నాం



బుక్‌స్టాల్ ఏర్పాటు చేయాలని ఎవరైనా 9848397857 నంబర్‌కు ఫోన్ చేసి చెబితే అక్కడికి వెళ్లి ఏర్పాటు చేస్తున్నాము. మహనీయుల జీవిత చరిత్రలు, సాహిత్య రచనలు.. ఇలా అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతాము. వివాహాలతోపాటు, ఇతర శుభకార్యాలకు చెప్పినా వెళ్లి పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నాం.

– నగేశ్, పుస్తక ప్రదర్శన నిర్వాహకులు, సంగారెడ్డి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ బీజేపీ కుట్రగా అనుమానం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని ఓర్వలేక బీజేపీ నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ విషయంలో రెండో నిందితుడిగా ఉన్న జగిత్యాల వాసి రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త కావడం అందుకు బలం చేకూరుస్తోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీకి ఉన్న నిబద్ధత దేశంలో ఏ నియామక బోర్డుకు లేదని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తోందని కేంద్ర కమిషన్ సభ్యులే ప్రశంసించిన విషయాన్ని తలసాని గుర్తుచేశారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామక ప్రక్రియ జరుగుతోందని, ఈ పరిస్థితుల్లో బీజేపీ కుట్రతోనే పేపర్ లీక్ అయినట్లుగా అనుమానం కలుగుతోందని తెలిపారు. ప్రవీణ్ అనే వ్యక్తి గ్రూప్–1కు సెలెక్ట్ కాలేదని చెప్పారు. యూత్ ఉద్యోగాలు చేయొద్దని, ఆరునెలలు బీజేపీ కోసం పనిచేయాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యానాల మర్మం ఏంటో తెలియాలని తలసాని డిమాండ్ చేశారు.

ఈడీ.. పరిధి మించి ప్రవర్తిస్తోంది

మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత విషయంలో ఈడీ పరిధి మించి ప్రవర్తిస్తోందని, చట్టప్రకారం విచారణ జరగడం లేదని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళను రాత్రి వరకు విచారిస్తామంటే అది ముమ్మాటికీ వేధించడమే, రాజకీయ కక్ష సాధింపు చర్యేనని చెప్పారు. బీజేపీ పార్టీ నాయకుల ఆలోచనలు, స్టేట్‌మెంట్ ఆధారంగానే ఈడీ పనిచేస్తోందని, విచారణ సంస్థల పేరుతో బీజేపీ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సిగ్గు చేటని దుయ్యబట్టారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులను బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ వచ్చాక ఇలాంటి దుర్మార్గాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా విచారణ పేరుతో కవితను వేధిస్తున్నారన్నారు. కవిత ఎక్కడికి పారిపోవడం లేదని, విచారణకు సహకరిస్తానని చెప్పినా కూడా రాత్రి సమయం వరకు విచారించడం వేధించడమేనని జగదీశ్‌రెడ్డి అన్నారు. మహిళల హక్కులను గౌరవించాల్సింది పోయి చట్టంలో ఉన్న లొసుగులను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడుతున్న బీజేపీ దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టి దేశాన్ని రక్షిస్తామన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణానికి సహకరించండి

- భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తిచేయండి
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి సహకరించాలని సీఎం కేసీఆర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. తెలంగాణ ఏర్పడక ముందు 66 ఏళ్లలో ఈ ప్రాంతంలో గత కేంద్ర ప్రభుత్వాలు 2,500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మిస్తే గత ఎనిమిదిన్నరేళ్లలోనే తమ ప్రభుత్వం దాదాపు రూ. లక్ష కోట్లతో తెలంగాణలో 2,500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను నిర్మించిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మంజూరైన, బిడ్డింగ్ దశలో ఉన్న 11 జాతీయ రహదారులకోసం భూసేకరణను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 11 జాతీయ రహదారులకు 4,332 హెక్టార్ల భూమిని సేకరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పటి వరకు కేవలం 284 హెక్టార్ల భూమిని మాత్రమే సేకరించి జాతీయ రహదారుల సంస్థకు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం రూ.32,383 కోట్లతో 751 కిలోమీటర్ల మేర 11 జాతీయ రహదారులను కేంద్రం నిర్మించనుందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

నేటి నుంచి సీపీఎం జన చైతన్య బస్సు యాత్రలు

సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిద్దాం. సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదాం' అంటూ శుక్రవారం నుంచి సీపీఎం జన చైతన్య బస్సు యాత్రలు నిర్వహించనుంది. వరంగల్ జిల్లాలో ప్రారంభమై ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బహిరంగ సభతో ముగింపు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రను సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని, 23న రెండో యాత్ర ఆదిలాబాద్‌లో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రారంభిస్తారని, 24న మూడో యాత్ర నిజామాబాద్‌లో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ విజయరాఘవన్ ప్రారంభిస్తారని, 29న ముగింపు సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కారత్ హాజరవుతారని తమ్మినేని వివరించారు.

క్లుప్తంగా...

'సువిద్య'పై క్రిమినల్ కేసు పెట్టాలి

కళాశాల ఎదుట మృతురాలు నాగజ్యోతి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నిరసన



బోర్డు తొలగిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హనుమకొండ/విద్యారణ్యపురి: ఇంటర్ విద్యార్థిని నాగజ్యోతి ఆత్మహత్య ఘటనలో కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశా యి. హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ఫస్టియర్ విద్యార్థిని మురారిశెట్టి నాగజ్యోతి బుధవారంరాత్రి ఉరేసుకుంది. దీంతో గురువారం మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు, బీఎస్పీ నేతలు కళాశాల వద్ద ఆందోళన చేశారు. కళాశాల బోర్డును తొలగించి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. సమా చారం అందుకున్న పోలీసులు కాలేజీకి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. నాగజ్యోతి ఆత్మహత్య చేసుకొనేంత పిరికిది కాదని ఆమె తల్లిదండ్రులు పేర్కొన్నారు. కాగా, నాగజ్యోతిని ఒత్తిడికి గురి చేయ లేదని కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు నాగజ్యోతి ఆత్మహత్య ఘటనపై కళాశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు.

మిర్చి ధర దూకుడు

ఖమ్మం: మిర్చి ధర దూకుడు కొనసాగుతోంది. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం మిర్చి క్వింటా ధర రూ.23 వేలు పలికింది. బుధవారం రూ.22,501 పలికిన ధర.. గురువారం ఏకంగా రూ.499 పెరిగి రికార్డు సృష్టించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన రైతు వి.సమ్మయ్య 57 బస్తాల మిర్చి తీసుకురాగా, క్వింటాకు రూ.23 వేల చొప్పున చెల్లించారు.

మేస్త్రీ ఛాతీలో దిగిన ఇనుప సలాక


ఛాతిలో గుచ్చుకున్న ఇనుప సలాక

సిరికొండ: ఇనుప సలాకలు కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ సలాక మేస్త్రీ ఛాతిలోకి దిగింది. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం న్యావనంది ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా మేస్త్రీ ఓబయ్య గురువారం యంత్రంతో సలాకలు కట్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఒక సలాక ముక్క ఆయన ఎడమ వైపు భాగంలో గుచ్చుకుంది. వెంటనే ఓబయ్యను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. శస్త్రచికిత్స చేసి సలాకను తొలగించారు.

వర్షాలపై ఇంటర్ అధికారులు అలెర్ట్

సాక్షి, హైదరాబాద్: రానున్న మూడు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఇంటర్ బోర్డు అధికారులు అప్రమత్తమయ్యారు. పరీక్షలకు ఆటంకాలు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై గురువారం చర్చించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా గురువారం సెకండియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. 4,34,862 మంది పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 4,20,195 మంది రాశారు.

స్క్రైబ్‌గా చెల్లి సాయం...

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ విద్యార్థి గుగులోత్ జయంత్‌కు ఇటీవల ప్రమాదంలో కుడిచేయి విరగడంతో తన చెల్లి అశ్వినిని స్క్రైబ్‌గా తెచ్చుకొని పరీక్ష రాశాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన దివ్యాంగురాలు గుర్రాల రోజారాణి తన సోదరి నాగరాణి ద్వారా పరీక్షలు రాసేందుకు సిద్ధమైనప్పటికీ జ్వరం కారణంగా సోదరి పరీక్ష కేంద్రానికి రాకపోవడంతో రోజారాణి పరీక్ష రాయలేకపోయింది

నీళ్ల హౌజ్ గోడ కూలి విద్యార్థి మృతి

- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలో ఘటన

చివ్వెంల(సూర్యాపేట): పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఈ ఘటన జరిగింది. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మోతె మండలం అప్పన్నగూడెం గ్రామానికి చెందిన రావుట్ల పవన్ (11), మద్దిరాల మండలం ఎం.చందుపట్లకి చెందిన జిల్లోజు సుశాంత్, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన కొప్పుల యశ్వంత్‌లు సాయంత్రం 5 గంటల సమయంలో పాఠశాల ఆవరణలో ఉన్న నీళ్ల హౌస్ వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా, హౌస్ గోడ ఒక్కసారి కూలి విద్యార్థులపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పవన్ మృతి చెందగా, యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. కాగా, పవన్ కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్రూం ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగంతోపాటు, మృతుని సోదరికి గురుకులాల్లో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు.

తుగ్లక్ రోడ్‌లో హైడ్రామా

ఈడీ ముందు హాజరు విషయంలో ఎమ్మెల్సీ కవిత మల్లగుల్లాలు

- మంత్రులు కేటీఆర్, హరీశ్ సహా న్యాయ నిపుణులతో విస్తృత చర్చలు
- ఉదయం 10 గంటలకు మీడియాతో మాట్లాడతారని తొలుత సమాచారం
- కానీ 11 దాటినా బయటికి రాని కవిత.. వ్యూహంలో మార్పు
- విచారణకు రాలేనంటూ న్యాయవాది ద్వారా ఈడీకి సమాచారం
- దీనితో ఈడీ ఏం చర్యలు తీసుకుంటుందనేదానిపై రోజంతా ఉత్కంఠ
- సీఎం కేసీఆర్ నివాసం, ఈడీ కార్యాలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం



గురువారం ఢిల్లీలో కవిత నివాసం వద్ద మీడియా హడావుడి...

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రెండోసారి హాజరయ్యే విషయంలో హైడ్రామా చోటు చేసుకుంది. గురువారం విచారణలో ఆమెను అరెస్టు చేస్తారన్న ఊహాగానాలతో ఢిల్లీలో సీఎం కేసీఆర్ నివాసం ఉన్న తుగ్లక్ రోడ్ ప్రాంతం, ఈడీ కార్యాలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెండు చోట్లా కవితకు సంఘీభావంగా వచ్చిన నేతలు, కార్యకర్తల హడావుడి, అదే సమయంలో కేంద్ర బలగాల మోహరింపు, జాతీయ మీడియా హడావుడితో రోజంతా ఉత్కంఠ కొనసాగింది.

మంత్రులు, న్యాయ నిపుణులతో భేటీ

బుధవారం రాత్రే ఢిల్లీకి చేరుకున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు గురువారం ఉదయం ఏడున్నరకే తుగ్లక్‌రోడ్‌లోని సీఎం నివాసానికి చేరుకొని కవితతో భేటీ అయ్యారు. విచారణ అంశాలపై వారితో మాట్లాడుతున్న సమయంలోనే.. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సోమ భరత్, మరికొందరు కూడా కలిసి మాట్లాడారు. ఈడీ విచారణను ఎదుర్కొనే అంశమై వీరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ క్రమంలోనే ఉదయం 10 గంటలకు కవిత మీడియాతో మాట్లాడతారని సమాచారం ఇచ్చారు. ఇందుకోసం గేటు బయట ఏర్పాట్లు కూడా చేశారు. కానీ పదకొండు గంటలైనా కవిత బయటికి రాలేదు. అప్పటికే చాలామంది పార్టీ నేతలు, కార్యకర్తలు తుగ్లక్ రోడ్ ప్రాంతానికి చేరుకోవడంతో పోలీసులు భద్రత పెంచారు. ఐదారు పోలీస్ బస్సులను రప్పించారు. కవిత భద్రత కోసం ఎస్కార్ట్ వాహనం కూడా సిద్ధం చేయడంతో.. ఆమె ఈడీ విచారణకు వెళతారని అంతా భావించారు.

ఈడీ కార్యాలయానికి కవిత న్యాయవాది

పదకొండున్నర గంటలకు కూడా నివాసం నుంచి కవిత బయటికి రాలేదు. దీనితో ఆమె ఈడీ విచారణకు హాజరవుతారా? లేదా? అన్నదానిపై చర్చలు మొదలయ్యాయి. కాసేపటికే సోమ భరత్ తోపాటు మరికొందరు న్యాయవాదులు తుగ్లక్ రోడ్ నివాసం నుంచి బయటికి వచ్చి.. ఈడీ కార్యాలయానికి వెళ్లారు. ఈడీకి కవిత రాసిన లేఖను, ఇతర డాక్యుమెంట్లను అధికారులకు అందించారు. విచారణకు ఆమె రాలేకపోతున్న అంశాన్ని వివరించారు. అనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటికి వచ్చిన సోమ భరత్.. సుప్రీం పిటిషన్, మహిళను విచారించే అంశాలపై ఈడీకి వివరణ ఇచ్చామని, దీనిపై ఈడీ ఎలాంటి స్పందన తెలపలేదని మీడియాకు వెల్లడించారు. కవితపై కేంద్రం కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టిందని ఆరోపించారు. సోమభరత్ మాట్లాడిన కొంతసేపటి తర్వాత.. కవిత భద్రత కోసం సీఎం నివాసానికి వచ్చిన పోలీస్ ఎస్కార్ట్ వాహనం బయటికి వెళ్లిపోయింది. ఢిల్లీ పోలీసులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనితో కవిత ఈడీ విచారణకు హాజరుకావడం లేదని స్పష్టత వచ్చింది. అయితే 20న విచారణకు రావాలంటూ ఈడీ మరోమారు కవితకు నోటీసులు ఇచ్చింది. దీనిపై కవిత, ఇతర మంత్రులు న్యాయ నిపుణులతో చర్చించారు. మళ్లీ సుప్రీం తలుపు తట్టే అంశంపై వారితో చర్చించినట్టు సమాచారం.

ఇంటి వద్దే విచారించండి

▶ మొదటి పేజీ తరువాయి

సహకరించాను. నా ఫోన్ తేవాలని సమన్లలో పేర్కొనకపోయినా.. నా ఫోన్ తెప్పించి, స్వాధీనం చేసుకుంటానంటే అప్పగించాను. ఇలా ఫోన్ తీసుకోవడం చట్టబద్ధం కాదు. అంతేగాక సూర్యాస్తమయం అయినా రాత్రి 8.30 గంటల వరకు కార్యాలయంలో కూర్చోబెట్టారు.

నా హక్కులకు ఉల్లంఘన జరిగింది

మళ్లీ మార్చి 16న రావాలని ఈడీ అధికారులు సమన్లు ఇచ్చారు. కేవలం వ్యక్తిగతంగా హాజరుకావాలని పేర్కొన్నారు. కానీ నేను అధీకృత ప్రతినిధి ద్వారా హాజరవుతాను. ఈ క్రమంలో నా తరఫున బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్‌ను ఆథరైజ్ చేస్తున్నాను. అధికారులు కోరిన ధ్రువపత్రాలు ఆయనతో పంపుతున్నాను. విచారణలో పాల్గొనడానికి, విచారణకు సహకరించడానికి ఎలాంటి నాకు ఇబ్బందీ లేదు. అయితే అరెస్టయిన కొందరు నిందితులతో కలిపి మార్చి 11న విచారణ చేస్తామని స్పష్టంగా చెప్పి.. ఆ విధంగా చేయలేదు. ఇదే విషయాన్ని అధికారి భానుప్రియ మీనాను అడగగా.. ప్రణాళిక మార్చుకున్నామని తెలిపారు. అందుకే దర్యాప్తును విశ్వసించడానికి కారణాలు కనిపించడం లేదు. ఈ తీరుతో నా ప్రాథమిక హక్కులకు ఉల్లంఘన జరిగినట్లే. ఈ నేపథ్యంలోనే ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నాను. మార్చి 7, 11 నాటి సమన్లను రద్దు చేయాలని, నాపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోర్టును అభ్యర్థించాను. ఈ నెల 24న విచారణ జాబితాలో నా పిటిషన్ చేర్చాలని సీజేఐ ఆదేశాలు ఇచ్చారు. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ వరకూ ఈడీ విచారణ ఆపాలని కోరుతున్నా.

మహిళగా నా హక్కులను గుర్తించాలి

ఈడీ కార్యాలయానికి ఒక మహిళను పిలవడానికి సంబంధించిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. నేను కూడా మహిళనే కాబట్టి ఆ కేసు నా కేసు వేర్వేరు కాదు. నా జీవితాన్ని సమాజానికి అంకితం చేశా. చట్టానికి లోబడి ఉంటాను. నా హక్కులు ఉల్లంఘనకు గురైనా.. చట్టాలను ఉల్లంఘించకపోవడం నా బాధ్యత. నా బ్యాంకు స్టేట్‌మెంట్లు అందజేయడానికి నా ప్రతినిధిగా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌ను పంపుతున్నా. దీన్ని రికార్డుల్లోకి తీసుకోవచ్చు. ఇతర పత్రాలు ఏమైనా అవసరమైతే ఈ–మెయిల్ ద్వారా తెలియజేయండి. నేను కట్టుబడి ఉంటాను'' అని కవిత తన లేఖలో పేర్కొన్నారు.

20న విచారణకు రండి

ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసులు

తాను విచారణకు రాలేనని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని కవిత చేసిన విజ్ఞప్తి పట్ల ఈడీ కొన్ని గంటల తర్వాత స్పందించింది. అయితే ఇంటివద్ద విచారణ, వీడియో కాన్ఫరెన్స్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నెల 20న ఈడీ కార్యాలయంలోనే విచారణకు హాజరుకావాలంటూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కవితకు ఈ–మెయిల్ పంపింది.

కవిత కూడా అనుమానితురాలే..

- ఆమెతో కలిపి పిళ్లైని విచారించాలి.. కస్టడీ పొడిగించండి
- ప్రత్యేక కోర్టుకు ఈడీ విజ్ఞప్తి.. 20 వరకు కస్టడీకి అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు అరుణ్ పిళ్లైని ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. సౌత్ గ్రూపులోని ఇతర వ్యక్తులతో కలిపి పిళ్లైని విచారించాల్సి ఉందని, అందువల్ల కస్టడీ పొడిగించాలని కోర్టును కోరారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తు పురోగతి ఏమిటి? బుచ్చిబాబు, అరుణ్ పిళ్లైను కలిపి విచారించడం పూర్తయిందా? కవిత విచారణకు హాజరయ్యారా? అని న్యాయమూర్తి పలు ప్రశ్నలు వేశారు. దీనికి ఈడీ న్యాయవాదులు బదులిస్తూ.. బుచ్చిబాబును శుక్రవారం విచారించనున్నామని తెలిపారు. సౌత్ గ్రూపులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతరులతో కలిపి పిళ్లైను విచారించాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా అనుమానితురాలేనని, పిళ్లైతో కలిపి ఆమెను విచారించాల్సి ఉందని వివరించారు. తాను మహిళను కాబట్టి ఇంటి వద్దే విచారించేలా ఆదేశించాలని కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన అంశాన్ని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి తెలిపారు. ఆమెను ఈ నెల 11న విచారించామని.. మళ్లీ ఈ నెల 20న విచారణకు రావాలని తాజాగా సమన్లు జారీ చేశామని చెప్పారు. పలు అంశాలపై పిళ్లైతో కలిపి కవితను విచారించాల్సి ఉందన్నారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి.. పిళ్లైకు ఈ నెల 20 వరకు ఈడీ కస్టడీ పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ ఎంపీ మాగుంటకు ఈడీ సమన్లు

ఇక ఏపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఈ నెల 18న విచారణకు రావాలంటూ ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ విషయాన్ని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి ఈడీ అధికారులు వివరించారు.

రెండోరోజూ 'బాలవికాస'పై ఐటీ దాడులు

- కాజీపేట, హనుమకొండలోని కార్యాలయాల్లో తనిఖీలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: బాలవికాస స్వచ్ఛంద సంస్థ, దాని అనుబంధ సంస్థలపై వరంగల్‌వ్యాప్తంగా రెండు రోజులుగా కొనసాగుతున్న ఐటీ తనిఖీలు కలకలం రేపుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున హనుమకొండకు చేరుకున్న ఐటీ అధికారులు.. సీఆర్పీఎఫ్ భద్రత మధ్య తనిఖీలు మొదలుపెట్టారు. కాజీపేట ఫాతిమానగర్, హనుమకొండ సిద్ధార్థనగర్‌లలోని కార్యాలయాలు, నిర్వాహకుల ఇళ్లలో గురువారంరాత్రి వరకు 15 బృందాలుగా ఏర్పడిన అధికారులు సోదాలు నిర్వహించారు. తొలిరోజు తనిఖీల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్‌లతోపాటు కీలక ఉద్యోగులు, వలంటీర్లకు చెందిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు నాలుగైదేళ్లకు సంబంధించిన బాలవికాస ఆదాయ వ్యయాల పత్రాలు, వార్షిక నివేదికలపై ఆరా తీసినట్లు తెలిసింది. కాగా, బాలవికాస సంస్థపై ఐటీ దాడులను జిల్లాకు చెందిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, కుడా చైర్మన్ సుందర్‌రాజు తదతరులు ఖండించారు.

9 రాష్ట్రాలు, 7 వేల గ్రామాలకు సేవలు...

భారత్‌లో సమాజాభివృద్ధి సేవల కోసం ఫ్రెంచ్–కెనడా జాతీయుడైన ఆండ్రే గింగ్రాస్, ఆయన సతీమణి బాలథెరిసా గింగ్రాస్ 1977లో కెనడాలో సోపర్ సంస్థను ప్రారంభించారు. సేవా కార్యకలాపాలను మరింత సమర్థంగా చేపట్టేందుకు వీలుగా సోపర్‌కు అనుబంధంగా కాజీపేట లోని ఫాతిమానగర్‌లో 1991లో బాలవికాస సంస్థను ప్రారంభించారు. ప్రస్తుతం బాలవికాసకు అనుబంధంగా 9 సంస్థలు పనిచేస్తున్నాయి. తెలంగాణ, ఏపీతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లలోని 7 వేల గ్రామాలు, పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి బాలవికాస సంస్థ తన సేవలు అందిస్తోంది. బాలవికాసలో సుమారు 300 మంది సిబ్బంది ఉండగా, క్షేత్రస్థాయిలో మరో 500 మంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో నాణ్యమైన విద్య, సురక్షిత తాగునీరు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, మహిళా సాధికారత, ఆదర్శగ్రామాల ఏర్పాటు తదితర అంశాలు ప్రధాన లక్ష్యాలుగా 30 వేల మంది వలంటీర్లు బాలవికాస ద్వారా నిరంతరం పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 60 లక్షల మంది పేదలకు మేలు కలిగేలా కార్యక్రమాలు నిర్వహించారు.

పెళ్లి విషయమై ఇద్దరు యువతుల మధ్య ఘర్షణ

ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

మందమర్రి రూరల్: సాన్నిహిత్యంగా ఉంటున్న ఇద్దరు యువతుల మధ్య పెళ్లి ప్రస్తావనతో తలెత్తిన ఘర్షణ ఓ యువతి ప్రాణాలను బలి తీసుకుంది. మామిడిగట్టుకు చెందిన అంజలి(22), నెన్నెల మండలం మన్నెగూడెంకు చెందిన మహేశ్వరి, ఆమె చెల్లెలు పరమేశ్వరి, వీరి బంధువు విఘ్నేష్ అక్కడే ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సాన్నిహిత్యం పెరిగి దగ్గర కావడంతో మహేశ్వరి అంజలిని పెళ్లి చేసుకోవాలని అడిగేది. కాగా, అజ్మీర శ్రీనివాస్ అనే వ్యక్తితో అంజలి చనువుగా ఉండటం మహేశ్వరికి ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి, కలిసి చనిపోదామని నిర్ణయించుకుని మోటార్‌సైకిల్‌పై వెంకటాపూర్ వైపు వెళ్లారు. విషయం తెలుసుకున్న విఘ్నేష్, శ్రీనివాస్, పరమేశ్వరి ఘటనాస్థలికి వెళ్లేసరికి అంజలి గొంతుకు తీవ్ర గాయమై కనిపించింది. మహేశ్వరి శరీరంపై కూడా పలు చోట్ల గాయాలున్నాయి. వెంటనే వారిని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంజలి మృతిచెందగా మహేశ్వరి చికిత్స పొందుతోంది. కాగా, అంజలి తండ్రి ఫిర్యాదు మేరకు మహేశ్వరి, శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వేదవిద్యలో అక్కాచెల్లెళ్లకు డాక్టరేట్లు


వేద విద్యను అభ్యసిస్తున్న అక్కాచెల్లెళ్లు

కొందుర్గు: రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు రజిత, సరిత వేదవిద్యలో డాక్టరేట్లు సాధించారు. సాంకేతికయుగంలోనూ వీరు సంస్కృతంపై ఆసక్తి చూపడం గమనార్హం. ఎదిర గ్రామానికి చెందిన ఆంచ సుమిత్ర, జంగారెడ్డి దంపతులకు లక్ష్మి, కవిత, రజిత, సరిత నలుగురు సంతానం. కాశీలోని గురుకుల విద్యాభ్యాసం అనంతరం పానిని కన్యా మహా విద్యాలయంలో వేదవిద్యలో రజిత, సరిత పీజీ పూర్తి చేశారు. అనంతరం తిరుపతిలోని నేషనల్ సంస్కృత వ్యాకరణంలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం సరిత శంషాబాద్ ముచ్చింతల్ చినజీయర్ స్వామి ఆశ్రమంలో విద్యార్థులకు వేద విద్యా బోధన చేస్తున్నారు. పురుషులకు దీటుగా వీరు వేద విద్యలో పీహెచ్‌డీ అందుకోవడంపట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పొగ మింగిన బతుకులు

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు.

రాత్రి 8.45 గంటలు

అయిదో ఫ్లోర్ నుంచి ముగ్గురు యువకులను రెస్క్యూ చేశారు. ఇలా కిందికి వచ్చిన వాళ్లు తమ కార్యాలయంలోని స్టోర్ రూంలో ఆరుగురు చిక్కుకుపోయారని, వీరిలో శివ, ప్రశాంత్, ప్రమీల, త్రివేణి, శ్రావణి, వెన్నెల కూడా ఉన్నారని చెప్పారు.

రాత్రి 9.06 గంటలు..

భారతమ్మ, రవి, ఇతడి తండ్రి దయాకర్‌తో పాటు మరో మహిళ, ప్రశాంత్‌ను రెస్క్యూ చేసి ఆస్పత్రికి తరించారు. ఓ యువకుడు అయిదో అంతస్తులోని కార్యాలయంలో చిక్కుకున్న వారికి ఊపిరి ఆడట్లేదని, వాళ్లు బయటకు రావడానికి ఇనుప గ్రిల్ అడ్డంగా ఉందని చెప్పి ఆక్సిజన్ ఆవశ్యకతను అధికారులకు వివరించాడు. దీంతో గ్రిల్స్ కట్ చేసే సామగ్రితో బ్రోంటో స్కైలిఫ్ట్ వెహికిల్‌లో పైకి వెళ్లారు.

రాత్రి 9.19 గంటలు.. :డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు ఆక్సిజన్ సిలిండర్లు ధరించి, తీసుకుని మెట్ల మార్గంలో కాంప్లెక్స్‌లోకి వెళ్లే ప్రయత్నాలు మొదలెట్టారు. భవనంలోనే ఉండిపోయిన ఆరుగురి కోసం గాలింపు ముమ్మరం చేశారు.

రాత్రి 9.45 గంటలు : అయిదో అంతస్తులోని ఓమెగా సంస్థ కార్యాలయంలో చిక్కుకుపోయిన దాని యజమాని సుధీర్‌ను కిందికి తీసుకువచ్చారు. అదే అంతస్తులోని ఈ–కామర్స్ కార్యాలయంలో పని చేస్తున్న శివ, ప్రమీల, త్రివేణి, శ్రావణి, వెన్నెల స్పృహ తప్పి పడిపోయారని తోటి ఉద్యోగులు చెప్పడంలో అధికారులు అప్రమత్తమయ్యారు. డీఆర్ఎఫ్ చీఫ్ ప్రకాష్‌రెడ్డి హ్యాండ్ మైక్ చేతపట్టుకుని భవనంలో ఉన్న వాళ్లు తమ ఉనికి తెలిసేలా చేయాలని, వీలున్నంత వరకు బాత్‌రూమ్స్ వైపు వస్తే తాము రక్షిస్తామని పదే పదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. తొలుత బీ బ్లాక్‌కు కుడి వైపున అగ్ని కీలకు ఉన్నాయి. దీంతో చిక్కుకున్న వారికి వెనుక వైపునకు రమ్మని అధికారులు చెబుతూ వచ్చారు. రెస్క్యూ కూడా ఆ వైపున ఉన్న బాత్‌రూమ్స్ సమీపం నుంచే ఎక్కువ చేశారు.

రాత్రి 10.15 గంటలు.. : భవనం వెనుక వైపునకూ మంటలు వ్యాపించి తీవ్రత పెరిగింది. దీంతో ఎటు నుంచి రెస్క్యూ ఆపరేషన్ చేయాలి, లోపల చిక్కుకున్న అయిదుగురి విషయంలో ఎటూ తేలని పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు ఆక్సిజన్ ధరించి నేరుగా అయిదో అంతస్తుకు వెళ్లి గాలించారు.

రాత్రి 10.20 గంటలు.. : గ్రౌండ్ ఫ్లోర్, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిదో అంతస్తుల్లో మళ్లీ మంటలు


స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో దట్టంగా కమ్ముకున్న పొగ

పెరిగాయి. ఒకటి, రెండో అంతస్తుల్లో వస్త్ర దుకాణాలు, పాదరక్షల దుకాణాలు ఉండడంతో మంటలు అటువైపూ వ్యాపించాయి. దీంతో భవనం పటిష్టత దెబ్బతిన్నదని భావించిన పోలీసులు రెండు వైపులా ఉన్న అపార్ట్‌మెంట్లు, వెనకవైపు ఉన్న బస్తీవాసులను ఇళ్లలోంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు పంపించారు.

రాత్రి 10.35 గంటలు.. : మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి, డీసీపీ చందనా దీప్తి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అతికష్టమ్మీద గ్రిల్స్ తొలగించి అయిదో అంతస్తులోకి వెళ్లిన అగ్నిమాపక శాఖ అధికారులు అపస్మారక స్థితిలో ఉన్న ఆ అయిదుగురిని బయటికి తీసుకువచ్చారు. వీరికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. వీరు అప్పటికే మృతి చెందినట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. అదే సమయంలో మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్ సైతం కన్నుమూశాడు. ఈ ఆరుగురికి కాలిన గాయాలు లేవు. ఊపిరితిత్తుల్లో పొగ చేరడంతోనే చనిపోయారు. మంటలను అదుపు చేసి భవనంలో ఇంకెవరైనా ఉన్నారా? అనే అనుమానంతో గాలిస్తున్నారు.

200 దుకాణాలు.. 160 కార్యాలయాలు.. : ఎనిమిది అంతస్తులు, నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో 200 దుకాణాలు, 160 కార్యాలయాలు, కొన్ని గోదాములు ఉన్నాయి. సాధారణంగా సాయంత్రం వేళల్లో ఈ కాంప్లెక్స్ వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. గురువారం ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై ఉండటం, సాయంత్రం వర్షం కురవడంతో దాదాపుగా రద్దీ లేదు. కొన్ని కార్యాలయాలు మూతపడగా మరికొన్నింటితో పాటు గోదాములు, ఎనిమిదో అంతస్తులో ఉన్న ఇంటిలో కొందరు ఉన్నారు.

జీడిమెట్లలో భారీ పేలుడు

మూసేసిన కొపల్లి ఫార్మా పరిశ్రమలో అగ్నికీలలు

జీడిమెట్ల: భారీ పేలుడు.. అతిభారీగా చెలరేగిన మంటలతో పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలను అరచేతిలో పట్టుకుని బతుకుజీవుడా అంటూ ఇళ్లలోంచి పరుగులు తీశారు. గురువారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో జీడిమెట్లలో ఇటీవలే మూసివేసిన కొపల్లి ఫార్మా పరిశ్రమ ఆవరణలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మోడీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్ వద్ద బాంబుల మోతతో సమానంగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించడంతో ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆర్తనాదాలు చేస్తూ ఫ్లాట్లలోంచి కిందికి పరుగులు తీశారు. దాదాపు రెండు గంటలపాటు ఫైర్ ఇంజిన్‌ల శబ్దాలు, పోలీసు వ్యాన్‌ల సైరన్‌లతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. అపార్ట్‌మెంట్ కిటికీల అద్దాలు పగిలిపోయాయి. గురువారం ఈ ప్రాంతంలో కూరగాయల సంత ఉండటంతో అక్కడ ఉన్న కొనుగోలుదారులు కూడా పరుగులు తీశారు.

పేలుళ్లకు కారణమేమిటి?

జీడిమెట్ల ఫేజ్–3లో నాలుగు నెలల క్రితం వరకు కోపల్లి ఫార్మా పరిశ్రమ ఉండేది. ఇటీవలే సదరు పరిశ్రమను యాజమాన్యం వేరే వ్యక్తికి అమ్మేసింది. కొనుగోలు చేసిన వ్యక్తి ఫార్మా పరిశ్రమను కూల్చివేసి యంత్రాల న్నింటినీ వేరేచోటుకు తరలించారు. రసాయన సాల్వెంట్ డ్రమ్ములను అక్కడే ఉంచి వెళ్లారు. సదరు రసాయనాలు అంటుకోవడంతోనే భారీ శబ్దంతో డ్రమ్ములు పేలి 200 మీటర్ల ఎత్తులో గాల్లోకి ఎగిరిపడ్డాయి. ఘటనా స్థలికి బాలానగర్ ఏసీపీ గంగారాం, జీడిమెట్ల సీఐ పవన్, ఎస్సైలు, సిబ్బంది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.


కొపల్లి పరిశ్రమ ఆవరణలో ఎగిసిపడుతున్న మంటలు

సాక్షి ఉద్యోగ అవకాశాలు

ST. JOSEPH'S DEGREE & PG COLLEGE
H No 5-9-1106, King Koti Road, Hyderabad - 500 029
Autonomous, Affiliated to Osmania University,
Approved by AICTE – Reaccredited by NAAC (3rd Cycle)
A Catholic Christian Minority Institution - Managed by Hyderabad Archdiocese Educational Society
FACULTY RECRUITMENT NOTIFICATION 2023-24
Applications are invited for the following positions in various Departments of our College
Positions Open: Professors, Associate Professors, Assistant Professors
DEPARTMENTS

1. Commerce	5. Computer Science	10. English
2. Business Management	6. Physics	11. Library & Information Science
3. Mass Communication & Journalism	7. Electronics	12. Physical Education
4. Psychology	8. Mathematics	
	9. Statistics	

Qualification & Experience: As per UGC / Osmania University norms
NET/SET/ Ph. D. candidates are preferred.
Attractive salary will be offered to the selected candidates as per the qualification & experience in teaching, research & administrative responsibilities
Eligible & enthusiastic candidates are asked to mail their application, resume, scanned copies of certificates to our college mail: info@josephscollege.ac.in
Latest by 31.03.2023
Sd/-
Principal / Correspondent

AIR INDIA sats
ఎయిర్ ఇండియా SATS ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, శంషాబాద్, హైదరాబాద్ వద్ద ఇంటిగ్రేటెడ్ గ్రౌండ్ హ్యాండ్లింగ్ సర్వీసెస్‌లో ప్రముఖ ప్రొవైడర్ దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతుంది.
1. హెల్పర్స్ (100 ఖాళీలు)
బ్యాగేజ్ లోడింగ్ & ఫ్లైట్ ఇంటీరియర్ క్లీనింగ్ కోసం
(X (పాస్ లేదా ఫెయిల్) 40 సం॥ లోపు పురుషులు)
2. డ్రైవర్లు (60 ఖాళీలు)
(బ్యాడ్జి నం.తో HMV లేదా LMV)
(10వ తరగతి (పాస్) 40 సం॥ లోపు పురుషులు)
గమనిక:
2019న లేదా ఆ తర్వాత జారీ చేసిన ఆధార్, PAN & పాస్‌పోర్ట్ తప్పనిసరి.
ఇంటర్వ్యూ తరువాత వెంటనే పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసిన లేదా దరఖాస్తు చేయుటకు సిద్ధంగా ఉన్న అభ్యర్థి ఇంటర్వ్యూకి హాజరు కావచ్చును.
వాక్–ఇన్ ఇంటర్వ్యూ సమయం: ఉ.11:00 గం.ల నుండి సా.5:00 గం.లు
తేది: 17, 20, 21, 22, 23, 24 మార్చి 2023
ప్రదేశం: ఎయిర్ ఇండియా SATS ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
గేట్ నం.2, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, శంషాబాద్, హైదరాబాద్.
సంప్రదించండి: 040-66564621 (ల్యాండ్ మార్క్: అమెజాన్ కంపెనీ దగ్గర)

APPOINTMENTS
ప్రతి మంగళ, శుక్రవారాలలో ప్రత్యేక ఫుటంశ సాక్షిలో ఉద్యోగ ప్రకటనలు
SAKSHI

ప్రతి రాత్రి నిద్రపోయే ముందు అందరినీ క్షమించి.
స్వచ్ఛమైన హృదయంతో నిద్రించండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 17

గాలిలోనూ గరళమేనా?

సంవత్సరాలు మారుతున్నా దేశంలో కాలుష్య పరిస్థితులు మాత్రం మెరుగుపడుతున్నట్టు లేదు. ప్రభుత్వాలు చర్యలు చేపట్టామంటున్నా, వాయు కాలుష్య స్థాయి ఆందోళనకరంగానే కొనసాగుతోంది. భారతదేశ వాయు నాణ్యతా సూచి ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. ప్రపంచంలోని వివిధ రాజధానుల్లోకెల్లా రెండో అత్యంత కలుషిత రాజధానిగా, మొత్తం నగరాల లెక్కలో నాలుగో స్థానంలో నిలిచి ఢిల్లీ అప్రతిష్ఠ మూటగట్టుకుంది. ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి కాలుష్య నగరాల్లో 39 భారత్‌లోవే. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యతా టెక్నాలజీ సంస్థ 'ఐక్యూ ఎయిర్' మార్చి 14న విడుదల చేసిన అయిదో వార్షిక 'ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక–2022'లోని సంగతులివి. ఇవన్నీ మనల్ని అప్రమత్తం చేస్తున్నాయి. పౌరులు స్వచ్ఛమైన గాలి పీల్చి, ఆరోగ్యంగా జీవించాలంటే కాలుష్య నివారణకు తక్షణ చర్యలే శరణ్యమని పాలకులకు గుర్తు చేస్తున్నాయి.

ప్రపంచంలోని 131 దేశాల్లో 7,327 ప్రాంతాల్లో 30 వేలకు పైగా వాయునాణ్యతా పరిశీలక కేంద్రాలు పెట్టి, డేటా సేకరించి, ఈ నివేదికను సిద్ధం చేశారు. దీన్నిబట్టి గడచిన 2022లో అత్యధిక కాలుష్య దేశాల్లో అగ్రభాగాన నిలిచినవి... ఉత్తర – మధ్య ఆఫ్రికాలోని ఛాడ్, ఇరాక్, బహ్రెయిన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్. భారత్ 8వ స్థానంలో నిలిచింది. వాయుకాలుష్యం దారుణంగా ఉన్న ప్రపంచంలోని 10 నగరాల్లో ఏకంగా 8 మధ్య, దక్షిణాసియా ప్రాంతాల్లోవే! మన దేశంలో దాదాపు 60 శాతం నగరాల్లో ఈ సర్వే సాగింది. మనం పీల్చే గాలి నాణ్యత ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కన్నా ఏడు రెట్లు అధమంగా ఉందని ఇందులో తేలింది. పైకి చూస్తే, నిరుటి సర్వేలో కాలుష్యంలో ప్రపంచంలో 5వ స్థానంలో ఉన్న మనం ఈసారి 8వ స్థానానికి రావడం శుభవార్తే. కానీ, నిరుడు ప్రపంచంలోని 100 కాలుష్యనగరాల్లో 61 మనవైతే, ఈసారి ఆ సంఖ్య 65కు పెరగడం గమనార్హం.

చిత్రం ఏమిటంటే, ప్రపంచ నగరాల్లో ఢిల్లీ నాలుగో స్థానంలో ఉన్నా, మన దేశంలో అత్యంత కలుషిత నగరం మాత్రం ఢిల్లీ శివార్లలో రాజస్థాన్ పరిధిలోకి వచ్చే భివాడీ! ఆ తరువాతే ఢిల్లీ. వాయుకాలుష్యం ఎక్కువైన దేశ రాజధానిలో సహజమైన నేలను సైతం కాంక్రీట్ కాలిబాటలతో మార్చేసరికి, చెట్ల నరికివేత పెరిగి, జీవం పోతోంది. సహజమైన స్థానిక మొక్కలను కాక, వేరెక్కడివో నాటడం లాంటి సమస్యలూ ఉన్నాయి. అలాగే, వాహన ఉద్గారాలు కాలుష్యానికి మరో ప్రధాన కారణం. ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు అధిక స్థాయిలో ఉద్గారాలను వెలువరిస్తూ, మరింత వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయి. ఇవన్నీ ఆరుబయట పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, వీధి వర్తకులు సహా పలువురిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శరవేగపు పట్టణీకరణతో, 2020 నుంచి 2030 మధ్య మన పట్టణ ప్రాంత జనాభా 48.3 కోట్ల నుంచి 67.5 కోట్లకు, అంటే 40 శాతం పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని స్థాయుల్లో గట్టి చర్యలు చేపట్టక తప్పదు.

అనూహ్యంగా ఇటీవల గ్రామీణ భారతావనిలోనూ వాయు నాణ్యతలో తేడాలొస్తున్నాయి. గ్రామాల్లో నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌ఓ2) స్థాయులు, దరిమిలా వాయు కాలుష్యం పెరుగుతున్నట్టు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల అధ్యయనం గత నెలలో వెల్లడించింది. భారత్‌లో మొత్తం ఎన్‌ఓ2 కాలుష్యంలో 41 శాతం గ్రామీణ ప్రాంతాల్లో అదీ అధికంగా రవాణా తదితర రంగాల ద్వారా జరుగుతోంది. పెరుగుతున్న పట్టణీకరణ, శివార్లకు పరిశ్రమలు మారడం, జనాభా పెరుగుదల లాంటి అనేక కారణాల వల్ల ప్రబలుతున్న ఈ ధోరణి ఆందోళనకరం. నిజానికి, గాలిలో పార్టిక్యులేట్ మేటర్ 2.5 (పీఎం 2.5) సాంద్రతల్ని వచ్చే 2026 కల్లా 40 శాతం మేర తగ్గించడం లక్ష్యమని భారత్ 2022లో ప్రకటించింది. అందుకు తగ్గట్టు 2019లో పర్యావరణ శాఖ ఆరంభించిన 'జాతీయ స్వచ్ఛ వాయు పథకా'న్ని (ఎన్సీఏపీ) పునర్నిర్వచిస్తామనీ హామీ ఇచ్చింది. కానీ, లక్ష్యసాధనలో వెనుకడుగు వేసింది. బొగ్గు గనులకు పర్యావరణ నిబంధనల్లో సడలింపులు ఇవ్వడం, గాలిలో ధూళి కణాలకు కారణమయ్యే ఉత్పత్తుల పెంపునకు అనుమతులివ్వడం లాంటి అనేక ప్రభుత్వ నిర్ణయాలు సమస్యను పెంచిపోషించాయి. భారత లక్ష్యానికి అవన్నీ ప్రతిబంధకాలయ్యాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్య నివారణకు సత్వర కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. పరిశ్రమలు, వాహనాలపై కఠిన నిబంధనలు విధించాలి. రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గేలా అసలు సిసలు ప్రజా రవాణా వ్యవస్థలపై దృష్టి పెట్టాలి. పునరుత్పాదక శక్తిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలి. అలాగే, పర్యావరణ, కాలుష్య సంక్షోభాల నుంచి బయటపడాలంటే, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్ని మెరుగుపరుచుకొనే కృషి చేయాలి. కేవలం వ్యక్తిగత కృషి సరిపోదు. వ్యక్తివాదం నుంచి సమష్టివాదం వైపు మళ్ళాలి. అందరూ కలసికట్టుగా సుస్థిర విధానాలను అనుసరించడం కీలకమని గుర్తించాలి. సాముదాయక కృషి సత్ఫలితాలిస్తుంది.

కోవిడ్ కాలంలో దేశంలో కాలుష్యం కట్టడి అయినట్టు కనిపించినా, తిరిగి మళ్ళీ కోవిడ్ ముందు స్థాయికి చేరిపోయిందని గత ఏడాది ఇదే 'ఐక్యూ ఎయిర్' నివేదిక తేల్చింది. అనారోగ్యానికి రెండో అతి పెద్ద కారణంగా దేశ ప్రజానీకంపై పెను ప్రభావం చూపుతున్న గాలి కాలుష్యంతో ఏటా 15 వేల కోట్ల డాలర్ల పైగా ఆర్థికంగా నష్టపోతున్నట్టు లెక్క. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు ఆరోగ్యాన్ని దెబ్బతీసే వాయుకాలుష్య ప్రాంతంలో నివసిస్తున్న వేళ భావితరాల బాగు కోసమైనా దేశాలు నిద్ర లేవాలి. పీల్చే గాలిలోనూ ధనిక, పేద దేశాల మధ్య తేడాలు దుర్భరం.

పొలం నుంచి వైఫల్యం వరకు...

విశ్లేషణ



దేవీందర్ శర్మ

దేశ వ్యవసాయదారుల వ్యథలను ఎవరూ గుర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. లేదా వారి గురించి కనీసంగానైనా సరే ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. 'నేను దాన్ని పెంచాను. నేనే దాన్ని ధ్వంసం చేస్తున్నాను. ఇలా చేయడం చాలా కష్టంగా ఉంది కానీ నేను ఏం చేయగలను? గిట్టుబాటు ధరైనా రాకుంటే..' అని కూరగాయలు, పండ్లు పండించే రైతు ఆవేదన చెందుతున్నాడు. పంట ఉత్పత్తికి ఎకరాకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టిన తర్వాత ఆ పంట మొత్తాన్ని నాశనం చేయడమనేది రైతుల జీవితాలను దారుణంగా దెబ్బతీస్తుంది. 'పొలం నుంచి వైఫల్యం వరకు' అనే ఈ పునరావృత రైతు గాథ దేశంలో ప్రతిచోటా కనిపిస్తున్నదే. అంతేకాదు... కొన్ని సంవత్సరాలుగా ఈ విఫలగాథ మరింతగా విస్తృతమవుతూ వస్తోంది!

ఈ సంవత్సరం క్వింటాల్ బంగాళా దుంపల ధర రూ. 500లకు పడిపోయినప్పుడు (గత సంవత్సరం రూ. 1,200లు సగటు ధర పలికింది) ఒక రైతు మీడియాతో ఏం చెప్పాడంటే... ''క్వింటాల్ బంగాళా దుంపలను 900 నుంచి 1000 రూపాయల ధరకు తక్కువ అస్సలు అమ్మలేము. ఎందుకంటే ఈ రేటు వద్ద అయితేనే మాకు దిగుబడి ఖర్చులు రావడమే కాకుండా కాస్త లాభం కళ్ల చూడగలం'' అని. అయితే ఇప్పుడు బంగాళాదుంపల ధర ఏమాత్రం పెరిగే సూచనలు కనిపించకపోవడంతో రానున్న కాలంలో బంగాళా దుంపల ఉత్పత్తిదారులు గడ్డు కాలాన్నే ఎదుర్కోనున్నారు. పంజాబ్‌లోనే కాదు, బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో కూడా బంగాళాదుంపల ధర ఘోరంగా పతనం కానుంది. క్యాలిఫ్లవర్, క్యాబేజి, టమోటా ధరలు కూడా పడిపోయాయి. కేజీకి 3 రూపాయల ధర కూడా పలకదని గుర్తించక ముందే పంజాబ్‌లో రైతులు తమ పంటను ఇప్పటికే ధ్వంసం చేయడం ప్రారంభించారు. 'నేను దాన్ని పెంచాను. నేను దాన్ని ధ్వంసం చేస్తున్నాను. ఇలా చేయడం చాలా కష్టంగా ఉంది. కానీ నేను ఏం చేయగలను..' అని కూరగాయలు పండించే రైతు ఒకరు అన్నారు. వీటి ఉత్పత్తికి ఎకరాకు రూ. 30 వేలు ఖర్చు పెట్టిన తర్వాత ఆ పంట మొత్తాన్నీ నాశనం చేయడమనేది ఈ రైతుల జీవితాలను దారుణంగా దెబ్బతీయకుండా ఉంటుందా?!

ఇటీవల తెలంగాణలోని జహీరాబాద్ జిల్లా ప్రాంతాల గుండా నేను ప్రయాణిస్తున్నప్పుడు, అక్కడ విరివిగా పండిన టమోటాకి కూడా ఇదే గతి పట్టడం చూశాను. టమోటా పంటను ఎందుకు పండించడం లేదని అడిగాను. నిరాశతో కనిపించిన టమోటా రైతు ఒకరు నాతో మాట్లాడుతూ, మార్కెట్ ధర కిలో టమోటాకు 2 రూపాయలు పలుకుతున్నప్పుడు టమోటాలను బుట్టల్లో సర్దడం, వాటిని రవాణా చేయడం వంటివాటికి అదనపు ఖర్చు పెట్టాలని తాననుకోవడం లేదని చెప్పాడు. 'మీకు ఎన్ని టమోటాలు కావాలంటే అన్నీ తీసుకోండి' అని అతను నిస్పృహతో అన్నాడు. 'పొలం నుంచి వైఫల్యానికి' సంబంధించిన ఈ గాథను నేను ప్రతి చోటా చూస్తున్నాను.

దేశ వ్యవసాయదారుల వ్యథలను ఎవరూ గుర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. లేదా వారి గురించి కనీసంగానైనా సరే ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. నేను ఎందుకిలా చెబుతున్నానంటే, ఛత్తీస్‌గఢ్ నుంచి పక్షం రోజుల క్రితం ఒక నివేదిక వచ్చింది. మహాసముండ్‌కి చెందిన ఒక రైతు రాయపూర్ మండీకి వంకాయ పంటను తీసుకెళితే అతడికి రూ. 1,475 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చిందనీ, రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల కింద అదనంగా 121 రూపాయలను రైతే చెల్లించాల్సి వచ్చిందనీ ఆ వార్త తెలిపింది. అంతకు ముందు నెల రోజుల క్రితం వెల్లుల్లి రైతులు తమ పంట మొత్తాన్ని స్థానిక నదుల్లో



కలిపేశారన్న వార్తలు మీడియాలో రాజ్యమేలాయి. తర్వాత ఉల్లిపాయల సాగుదార్ల వ్యథలకు సంబంధించిన వార్తలు కూడా బయటికి వచ్చాయి. మరో మాటలో చెప్పాలంటే, దేశంలో ఈ పరిస్థితి రోజువారీ కార్యక్రమంలా సాగుతోంది. కొన్ని సంవత్సరాలుగా, పొలం నుంచి వైఫల్యానికి సంబంధించిన గాథ మరింతగా విస్తృతమవుతూ వచ్చింది. పొలంలో రైతు చిందిస్తున్న రక్తం మీడియాలో పేజీలకు మాత్రమే పరిమితమవుతోంది. స్టాక్ మార్కెట్‌లో రక్తపాతాన్ని దేశం చూస్తున్నప్పుడు కలుగుతున్నటువంటి తీవ్ర స్పందన రైతుల వ్యథల పట్ల కలగడం లేదు.

ఇది చాలదన్నట్లుగా, మార్కెట్‌లో జోక్యం చేసుకునే వ్యవస్థ (ఎమ్ఐఎస్)ను మరింతగా బలోపేతం చేయడంలో ఎలాంటి ప్రయోజనాన్నీ మన ఆర్థిక మంత్రి చూడడం లేదు! సమృద్ధిగా పంటలు పండి ధరలు పడిపోయినప్పుడు లేదా పంటలు చేతికొచ్చిన సమయంలో ఉత్పత్తి ధరకంటే తక్కువ ధరకు పడిపోయినప్పుడు ఎమ్ఐఎస్ రంగంలోకి దిగుతుందన్నది తెలిసిందే. 2023 బడ్జెట్ ఖర్చుల కింద, ధర మద్దతు పథకం (పీఎస్ఎస్), ఎమ్ఐఎస్‌లకు కేటాయింపులను బాగా తగ్గించినట్లు కనిపిస్తోంది. గత ఏడాది ఎమ్ఐఎస్‌కి బడ్జెట్‌లో రూ. 1,500 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం దాన్ని కేవలం లక్ష రూపాయలకు కోసిపడేశారు. బడ్జెట్‌లో పొందుపర్చిన ఈ కేటాయింపు, కొద్దిమంది వెల్లుల్లి ఉత్పత్తిదారులకు కలిగిన నష్టాలను పూరించడానికైనా సరిపోతుందని నేను భావించడం లేదు.

2018–19 బడ్జెట్‌లో రూ. 500 కోట్ల కేటాయింపుతో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్‌ను గుర్తుంచుకోండి. టమోటో, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు మామూలుగా ఎదుర్కొంటున్న అస్థిర ధరల నియంత్రణకు ఉద్దేశించినట్లు చూపించినప్పటికీ అవసరమైన దానికంటే తక్కువగా బడ్జెటరీ కేటాయింపులు చేశారు. ఆపరేషన్ ఫ్లడ్ ప్రాతిపదికన, కనీసం ఈ మొత్తాన్నయినా ప్రకటించారు. ఈ పథకాన్ని అన్ని పండ్లు, కూరగాయలకు వర్తింపచేస్తూ, ఆత్మనిర్భర్ అభియాన్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ స్కీమ్‌ని మరింతగా విస్తరించింది. కానీ 2023 నాటికి ఈ పథకాన్ని దాదాపుగా విస్మరించేశారు. కూరగాయల ధరలు (పండ్ల విషయంలో కూడా) పడిపోయిన ప్రతి సందర్భంలోనూ నేను ట్వీట్ చేసినప్పుడు, ఇవి పాడైపోయే సరకులు అని సాధారణ పల్లవి పాడుతూ వచ్చేవారు. సాధారణ ప్రజానీకం నుంచి ఈ మాటలు వింటే వాటిని సులువుగా పక్కనపెట్టేయవచ్చు కానీ విధాన నిర్ణేతలు ఇంత భిన్నంగా ఉండ టానికి ఇది కారణం కాకూడదు.

అమెరికాలో కూడా, ధరలు పడిపోయినప్పుడు రైతులు నష్టపోకుండా ఒక యంత్రాంగాన్ని ఏర్పర్చారు. పాలధరలు పడిపోయిన సమయాల్లో స్కూల్ ఫీడింగ్ ప్రోగ్రామ్‌లలో పొందుపరిచేలా రైతులు మరింత చీజ్‌ని తయారు చేయాలని రైతులను కోరే యంత్రాంగాన్ని అమెరికా రూపొందించింది. అలాగే స్ట్రాబెర్రీ ధరలు పతనం అయే సమయాల్లో ఇదే విధమైన కార్యక్రమాలు ఉంటున్నాయి. ప్రతిదీ సజావుగా ఉంటుందని చెప్పలేం కానీ, వ్యవసాయ క్షేత్రాల నష్టాలను తగ్గించడానికి ఇప్పటికీ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారత్‌లో తగిన ఉష్ణోగ్రతా నియంత్రిత నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్‌పై ఆధారపడి ఉండే వాల్యూ చెయిన్‌ని పునర్నిర్మించడానికి, స్థానికంగా అందుబాటులో ఉంచేందుకు చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు చేపట్టాలి. ధరల క్షీణత పథకాన్ని అమలు చేసే యంత్రాంగం ద్వారా దీన్ని అమలు చేయాలి. కానీ మధ్యప్రదేశ్‌లో గతంలో స్కీమ్ పైఫల్యం చెందడం అనేది పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. అయితే మరింత ముఖ్యంగా ధరల అస్థిరత్వాన్ని అధిగమించడానికి రైతుల కోసం గ్యారంటీ ధరకు హామీ పడటం మార్గదర్శక స్ఫూర్తిగా ఉండాలి. కూరగాయల పెంపకందార్లకు గ్యారంటీ ధరను అందిస్తున్న కేరళ స్కీమ్ నుంచి వెలికివచ్చిన పాఠాలను నేర్చుకోవలసి ఉంటుంది.

రైతుల కోసం భవిష్యత్తులో పండ్లు, కూరగాయల ధరలను స్థిరీకరించడంలోనే కాదు.. వైవిధ్యభరితమైన పంటల వైపు మారే విషయంలో వారికి సహకారం అందివ్వడంలో ఆపరేషన్ గ్రీన్స్‌కి అతి పెద్ద సవాలు ఎదురవుతోంది. వినియోగదారులు ఇప్పటికే అత్యధిక మార్కెట్ ధరను చెల్లిస్తున్నారు. కానీ భారీగా ఆర్గనైజ్ అయివుండే వ్యాపారంలో కూడా జరిగే బేరసారాల్లో రైతులే నిండా మునిగిపోతున్నారు. కాబట్టి పొలం నుంచి వైఫల్యానికి చెందిన గాథ మారాల్సి ఉంది. కొనసాగుతున్న వ్యవసాయ దుస్థితికి గాను సప్లయ్ – డిమాండును మాత్రమే మనం నిందిస్తూ కూర్చోలేము.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సాహస సేనాని



రచనా బిష్ట్ రాసిన 'బిపిన్: ది మ్యాన్ బిహైండ్ ది యూనిఫాం' కాపీని అందుకున్నాను. ఈ పుస్తకం భారత దేశపు గొప్ప సైనిక నాయకులలో ఒకరైన జనరల్ బిపిన్ రావత్‌కు సముచితమైన నివాళి. నేడు (16 మార్చి) ఆయన జయంతి.

– రాజ్‌నాథ్ సింగ్, రక్షణ మంత్రి

వాళ్లకేనా మైకు?!



గత మూడు రోజులుగా చూస్తున్నా. స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులలో ఒక్కరిని కూడా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి స్పీకర్ నాయకత్వం వహిస్తున్నారు! ఇలా ట్వీట్ పెట్టినందుకు నేను జైలుకు వెళ్లవలసి వచ్చినా ఆశ్చర్యం లేదు.

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

ఆరోగ్య భారత్



ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో వ్యాధుల నిర్మూలనదే కీలకమైన భాగస్వామ్యం. పోలియోను ఓడించడం నుండి కోవిడ్–19కు వ్యతిరేకంగా పోరాటం చేయడం వరకు రోగ నిరోధకతలో మనమెన్నో చారిత్రక మైలురాళ్లను దాటి వచ్చాము. భారత ప్రజలందరికీ 'జాతీయ టీకా దినోత్సవ' శుభాకాంక్షలు.

– డా॥ మన్సుఖ్ మాండవీయా, ఆరోగ్య మంత్రి

సాధువుల ఆగ్రహం



అయోధ్యలో డ్రెయిన్‌లు వేయడానికి 'శ్రీరామ్' అని రాసి ఉన్న ఇటుకల్ని ఉపయోగించడం వివాదం అయింది. అయితే 'శ్రీరామ్' అన్నది ఆ ఇటుకల్ని తయారు చేసిన బట్టీ పేరు అని ప్రభుత్వం చెబుతోంది. ఏమైనా వారి కాంట్రాక్ట్‌ను తక్షణం రద్దు చేయాలని సాధువులు డిమాండ్ చేస్తున్నారు.

– పూజా అవస్థీ, చరిత్రకారిణి

మాతృ హృదయం



కదులుతున్న రైలు బోగీ ప్రవేశ ద్వారంలో నిలుచుని ప్లాట్‌ఫాంపై ఉన్న కన్నబిడ్డకు కన్నీళ్లతో వీడ్కోలు చెబుతూ విధులకు వెళుతున్న ఒక బి.ఎస్.ఎఫ్. యువ సైనికురాలిని చూశా. యూనిఫామ్‌లో తల్లిగా ఉండటం అంత సులభం కాదు.

– మీలా ఖాన్, ట్రావెలర్

ఇన్‌బాక్స్

నిద్ర ఆరోగ్యదాయని

నిద్ర ఆరోగ్యానికి అత్యంత అవసరం. అది కరవైతే అనేక రోగాలు వస్తాయి. ఈ యాంత్రిక జీవన కాలంలో నిద్రలేమి అనేది ప్రపంచ వ్యాప్తంగా మనుషులను పీడిస్తున్న ప్రధానమైన సమస్య అయ్యింది.. అన్నీ ఉండి కూడా ప్రపంచ వ్యాప్తంగా 45 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని సర్వేలు తెలియజేస్తూ ఉన్నాయి. సకల మనోరుగ్మతలకూ, శారీరక రుగ్మతలకూ సుఖ నిద్రే మందు.

పిల్లలు అందరూ పరీక్షలు రాసే సమయమిది. నిద్ర పోకుండా తీవ్రంగా కష్టపడటం కంటే మంచి నిద్ర తీసుకోవడం వలన ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. నిద్రకు కచ్చితంగా 6 గంటల పాటు సమయాన్ని కేటాయించాలి. సరైన నిద్ర తీసుకొన్నప్పుడే బ్రెయిన్ యాక్టివ్‌గా పని చేయడానికి అవకాశం ఉంటుంది. మెదడు చురుగ్గా పనిచేయాలంటే పిల్లలు సరైన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం, మంచి నిద్రపోవడం అవసరం. మంచి జ్ఞాపక శక్తిని పెంచేందుకు కూడా నిద్ర ఉపయోగపడుతుంది.

వయసును బట్టి నిద్ర పోయే వేళలు మారినప్పటికీ కనీసం సగటున ప్రతిరోజూ ఏడు గంటలైనా నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల శరీర బరువు పెరుగుతుందనేది అక్షర సత్యం. మెదడు పనితనం సన్నగిల్లుతుంది. సగటు ఆయుర్దాయం తగ్గుతుంది. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్ర పోవడం, నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. సెలవు రోజు అంటూ నిద్రకు ఎలాంటి మినహాయింపూ లేదు. ప్రతి రోజూ వ్యాయామం చేసినట్లయితే శరీరం సుఖ నిద్రను కోరుకుంటుంది. పుట్టిన పిల్లలకు 18 గంటల నిద్ర, చిన్న పిల్లలకు 11 గంటల నిద్ర, టీనేజిలో ఉండే వారికి 8–10 గంటల నిద్ర తప్పనిసరి.

ఒకప్పుడు బెడ్‌రూమ్ అంటే విశ్రాంతికి చిహ్నంగా ఉండేది. ప్రస్తుతం పడక గదిలో కూడా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలుగా మారి నిద్రను తగ్గిస్తూ మానసిక రుగ్మతలు పెంచుకుంటున్నారు. నిద్రపోయే సమయాని కంటే అరగంట ముందుగానే ఎలక్ట్రానిక్/సమాచార ఉపకరణాలకు దూరంగా ఉండాలి. నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్‌ఫోన్లు స్విచాఫ్ చేయాలి. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయ సన్నిహితులతో గడపాలి. నిద్రలేమి సమస్యకు నిద్రమాత్రలు పరిష్కారం కానే కాదు. మంచి తిండి, వ్యాయామం, ఆలోచనా విధానంలో మార్పు వంటివి మంచి నిద్రకు దోహదం చేస్తాయి.

– డా॥ అట్ల శ్రీనివాస్; రీహ్యాబిలిటేషన్ సైకాలజిస్ట్, కరీంనగర్
(నేడు ప్రపంచ నిద్రా దినోత్సవం)

'ఉపా' దుర్వినియోగాన్ని ప్రశ్నించాలి!

సందర్భం



అంకాళ్ళ పృథ్వీ రాజ్

చట్టాలు దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడాలి. అయితే వాటిని దేశ ప్రజల పాలిట శాపంగా పాలక వర్గాలు మారుస్తున్నాయి. దీంతో రాజ్యాంగం కల్పించిన హక్కుల హననం దారుణంగా జరిగిపోతోంది. అది ఏ రాజకీయ పక్షమైనా కావచ్చు, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షంపై లేదా ప్రశ్నించే ప్రజలు, సంఘాలపై రాజ్యాంగ విరుద్ధంగా కొన్ని చట్టాలను ప్రయోగించి అణచివేత సాగించడం పరిపాటిగా మారిపోయింది. అటువంటి అణచివేతపూరిత చట్టాలను ఏర్పర్చుకోవడం ఆయా పాలక వర్గాల మనుగడకు ఒక అవసరంగా పరిణమించింది. 'అన్ లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) ఏక్ట్ –1967 (ఉపా చట్టం–1967) ఇందుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

ప్రాథమికంగా ఈ చట్టం రెండు విభాగాలుగా విభజితమయ్యింది. ఒకటి అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, రెండు ఉగ్రవాద కార్యకలాపాల నివారణ. ఉపా చట్టం–1967, సెక్షన్ 2 (ఒ)... వ్యక్తులు లేదా సంఘాలు తమ పనుల ద్వారా అనగా రాతలతోను, మాటలతోను, విషయాలతోనూ, సంకేతాలతోనూ దేశంలోని ఏదైనా భాగాన్ని పరిత్యజించాలని లేదా వేర్పాటు చెయ్యాలని ఉద్దేశం కలిగి ఉండటం; అటువంటి వాదానికి మద్దతు తెలపడాన్నీ, అలాగే భారతదేశ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్నీ త్యజించే, ప్రశ్నించే, భేదించే చర్యలు; భారతదేశంపై విరోధ భావన కలిగి ఉండటాన్నీ అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలుగా నిర్వచిస్తోంది. అలాగే ఉపా సెక్షన్ 2 (పి)... ఏదైనా సంఘం అక్రమ లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించినా, అందుకుగాను సహాయం చేసినా అదేవిధంగా భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 153 (ఏ) ప్రకారం విభిన్న వర్గాల మధ్య మత, జాతి, భాష తదితర విభేదాలను ఆధారం చేసుకొని వైషమ్యాలను ప్రేరేపించుటం... భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 153 బి ప్రకారం జాతీయ సమగ్రతను భంగపరిచే చర్యలను ప్రోత్సాహించడం, అందుకు సహకరించడం చేసినా... ఆ సంస్థను 'అక్రమ' లేదా 'చట్టవిరుద్ధ' సంస్థగా నిర్వచిస్తోంది. సెక్షన్ 2 (కె), సెక్షన్ 15లు వరుసగా ఉగ్రవాదులనూ, ఉగ్రవాద చర్యలనూ నిర్వచిస్తున్నాయి.

అయితే వ్యక్తుల రూపంలో లేదా సంస్థల రూపంలో ఉగ్రవాద చర్యలకు దిగడం, అందులో భాగం కావడం, ఉగ్రవాదానికి సన్నాహపరచడం; ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినా, సమర్థించినా లేదా మరొక విధంగా భాగస్వామి అయినా అవి ఉగ్ర వాద చర్యలు అవుతాయి. ఉగ్రవాద చర్యలలో వ్యక్తులు లేదా సంస్థలు భాగస్వామ్యం కలిగి ఉంటే ఉగ్రవాదులుగా నాలుగవ షెడ్యూల్ లోనూ, సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా



మొదటి షెడ్యూల్‌లోనూ చేర్చుతుంది. అయితే ఉపా చట్టం సెక్షన్ 36 ప్రకారం ఎవరైతే ఉగ్రవాదులుగా, ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించబడి బాధింపబడతారో వారు... తాము కేంద్ర ప్రభుత్వానికి ఉగ్రవాద కార్యకలాపాల్లో భాగస్వాములం కామనీ, కాబట్టి తమను ఆ జాబితా నుండి తొలిగించమనీ దరఖాస్తును చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఈ దరఖాస్తును తిరస్కరించిన ఎడల రివ్యూ కమిటీకి అర్జీ పెట్టుకోవచ్చు. ఈ అర్జీపై విచారణ అనంతరం వచ్చే నిర్ణయాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం ఆయా వ్యక్తులను లేదా సంస్థలను ఉగ్రవాద జాబితా నుండి తొలగించాలి.

ఉగ్రవాదులు లేదా ఉగ్రవాద సంస్థలుగా ప్రకటింపబడిన వారిపైన, సంస్థలపైన మాత్రమే పోలీసువారు లేదా నేర విచారణా సంస్థలు ఉపా చట్టం కింద... కేసులు నమోదు చేసి తమ విచారణను కొనసాగించవచ్చు. అయితే ఆ చట్టం సెక్షన్ 2 (ఐ) ఉగ్రవాద సంస్థ కానటువంటి ఏదైనా సంఘం క్రమానుగుణంగానూ లేదా మరొక విధంగానూ ఉగ్రవాద చర్యలలో భాగం అయితే వాటిని ఉగ్రవాద ముఠాలుగా నిర్వచిస్తోంది. సెక్షన్–2 (ఎ) వ్యక్తుల సమూహాన్ని సంఘంగా నిర్వచిస్తోంది. కేంద్రం వ్యక్తులను ఉగ్రవాదులుగా నోటిఫై చేసి నాలుగో షెడ్యూల్‌లో చేర్చినప్పుడు మాత్రమే ఉగ్రవాద చర్యలలో పాల్గొనే వ్యక్తుల గుంపులపై, నేరుగా పోలీసులు కేసులు కట్టవచ్చు, దర్యాప్తు చేయవచ్చు.

అయితే ఇటీవల ఉపా చట్టాన్ని ఉగ్రవాద సంస్థల్లోనూ, ఉగ్రవాదుల జాబితాలోనూ లేనటువంటి వారిపై ప్రయోగించడాన్ని గమనించవచ్చు. రాజ్యాంగబద్ధంగా ఉన్నటువంటి సంస్థలపై, సాధారణ హక్కుల సంఘాలపై, ఆయా కార్యకర్తలపై ఉపా చట్టాన్ని మోపడం చూస్తున్నాం. ఇది తీవ్ర ఆక్షేపణీయం. ఆయా వ్యక్తులపై, సమూహాలపై ఉపా కేసులు బనాయించడం, కొనసాగించడం, వారిని జైళ్లల్లో అక్రమ నిర్బంధంలో ఉంచడం అమానుషం. ఈ దుర్వినియోగం శాసనం ద్వారా స్థాపితమైన ప్రక్రియను అనుసరించి తప్ప వ్యక్తి స్వాతంత్య్రం హరించరాదని స్పష్టం చేసిన భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ని ఉల్లంఘించడమే. అక్రమ లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెబుతూ... వివిధ మత సంస్థలపైనా, వివిధ జాతుల స్వాతంత్య్ర పోరాట వాదులతోపాటూ ఆయా తమకు వ్యతిరేకంగా ఉన్నారని భావిస్తున్న వ్యక్తులూ, సంస్థలపైనా ఈ చట్టాన్ని ప్రయోగించడాన్ని అడ్డు కోకపోతే ముందు ముందు విపరిణామాలు చోటు చేసుకోవచ్చు.

పరిస్థితి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో కుల, జాతి, భాష ప్రాతిపదికగా పని చేసే సంఘాలపైనా ఈ చట్టాన్ని బనాయించే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడే ఈ ఉపా చట్ట దుర్వినియోగాన్ని వ్యతిరేకిస్తూ గొంతులు కలపాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది

గూఢోక్తి

నలుగురిలో ఉన్నప్పుడు అన్ని వేళలా ముక్కుసూటిగా మాట్లాడటం సమంజసం కాదు. కొన్ని కొన్ని సందర్భాలలో దేనిమీదనో పెట్టి అన్యాపదేశంగా చెప్పాలి. ఆ చెప్పే పద్ధతి నిగూఢంగా ఉండాలి. ఎవరికి ఉద్దేశించినదో వారికే అర్థమయ్యేట్లు ఉండాలి. చుట్టూ ఉన్నవారికి తెలియకూడదు. నిగూఢ భాషణ కూడా ఒక కళా నైపుణ్యమే! భాషణ కళలో ఒక భాగమే! నిగూఢ భాషణను అర్థం చేసుకుని ఆచరించగలిగే నైపుణ్యం సంబంధిత శ్రోతకు ఉండాలి.

విరాట పర్వంలో విరటుని కొలువుకి ద్రౌపది వేగంగా వస్తున్నప్పుడు ఆమెను వెంబడించి వస్తున్న కీచకుని చూసి భీముడు కోపంతో అక్కడ ఉన్న పెద్ద వృక్షాన్ని చూస్తాడు. ధర్మరాజు కనుసైగతో వారిస్తాడు. వంటలవాడైన వలలుడు (విరాట పర్వంలో భీముని పేరు) పండ్లు బాగా పండిన పెద్ద కొమ్మలతో ఉన్న విశాలమైన నీడ నిచ్చే, ఆశ్రయించుకున్న వారి శ్రమను పోగొట్టే వృక్షాన్ని వంట చెరకు కోసం నరకటం దేనికీ? ఇంకో చోట చెట్లుండవా? అంటాడు. ఇది ధర్మరాజు పలికిన గూఢోక్తి. వృక్షాన్ని కేంద్రంగా చేసి అన్యాపదేశంగా పలికాడు. వలలుడు కీచకుని చంపటానికి ఆయుధంగా ఆ వృక్షాన్ని భావించాడు. ధర్మరాజు ఆ వృక్షం అంటే విరటుడే అని అన్యాపదేశంగా చెప్పాడు. ఆ వృక్షం (విరటుడు) పాండవుల అజ్ఞాతవాస కాలంలో ఆశ్రయమిచ్చి, వారి వ్రతాన్ని ఫలవంతం చేస్తోంది. ఆ చెట్టును పెరికితే, అజ్ఞాత వాసం భంగమై, తమ ఆశ్రయాన్ని తామే నాశనం చేసుకున్నట్లు అవుతుంది. విరాటునితో శత్రుత్వం వద్దని భీమునికీ, ద్రౌపదికీ మాత్రమే అర్థమయ్యేట్లు ధర్మరాజు మాట్లాడాడు.



జ్యోతిర్మయం

ఉమ్మడి కుటుంబాలలో చిన్నవారు తప్పు చేస్తే, ఇంటి పెద్ద ఆ వ్యక్తికి మాత్రమే అర్థమయ్యేట్లు, సరిదిద్దేట్లు మాట్లాడవలసి వచ్చినప్పుడు ఈ గూఢోక్తి అవసరమవుతుంది. తరగతి గదిలో తప్పు చేసిన విద్యార్థిని అందరిలో నిల్చోబెట్టి దండించకుండా సదరు విద్యార్థికి మాత్రమే అర్థమయ్యేట్లు గూఢోక్తిగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉంటారు.

ఈ గూఢోక్తి నైపుణ్యం ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో అవసరమవుతూనే ఉంటుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.దశమి ఉ.10.59 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.13 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.9.19 నుండి 10.46 వరకు, తిరిగి తె.3.58 నుండి 5.27 వరకు (తెల్లవారితే శనివారం). దుర్ముహూర్తం: ఉ.8.33 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.21 వరకు, అమృతఘడియలు: సా.6.14 నుండి 7.44 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.12, సూర్యాస్తమయం: 6.06.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

రాష్ట్రంలో అకాల వర్షం

'సందేశ' పావురం ఎక్కడిదో.. ఎవరిదో?


పావురాన్ని గ్రామకార్యదర్శికి అప్పగిస్తున్న లక్ష్మణరావు

ఎర్రుపాలెం: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరుకు గురువారం చేరిన ఓ పావురం కలకలం రేపింది. గ్రామంలోని గంతాల లక్ష్మణరావు ఇంట్లో వాలిన పావురాన్ని పరిశీలించగా, ఒక కాలికి టీఎస్-999 అని, మరో కాలికి 7417 నంబర్‌తో కూడిన స్టిక్కర్ ఉంది. రెక్కలకు డెల్టా 1000 కేఎం అని స్టాంప్ వేసి ఉండగా.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.సురేశ్ పరిశీలించి ఇది బెట్టింగ్ పావురం అయి ఉండొచ్చని, ప్రజలు అపోహలకు గురికావొద్దని సూచించారు.

నిఖిత మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి


మందకృష్ణ

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని నిఖిత మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. నిఖితను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన అచ్చంపేట బంద్ విజయవంతంగా ముగిసింది. బంద్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థినిని ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, అందుకు పోలీసులు, వైద్యులు సహకరించారని ఆరోపించారు.

కుడికాల్వకు నీటి విడుదలను నిలిపివేయాలి

నాగార్జునసాగర్: రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు తాగునీటి ఎద్దడి నివారించేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాల్వకు వెంటనే నీటి విడుదలను నిలిపేయాలని ప్రాజెక్టు తెలంగాణ అధికారులు ఏపీ అధికారులకు విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. కుడి కాల్వకు 2022, జూన్ 1 నుంచి 2023, మార్చి 16 వరకు 184.692 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కృష్ణానదీ జలాల నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) ప్రతి ఏడాది కుడి కాల్వకు 132 టీఎంసీలు కేటాయిస్తుంది. అయితే, కేటాయించిన దానికంటే ఇప్పటికే 52.692 టీఎంసీల నీటిని కుడికాల్వకు ఎక్కువగా విడుదల చేశారు. ఎడమకాల్వకు 132 టీఎంసీలు కేటాయించగా ఇప్పటివరకు 129.828 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఇరిగేషన్ సర్కిల్, ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా
టెండరు ప్రకటన
1) టెండరు నోటీస్ నంబర్ 21/SE/IC/ARMOOR/2022-23 Dt 04.03.2023 (2nd Call), రూ.13.10 లక్షలకు లభ్యమగు తేదీ : 16.03.2023 నుండి 23.03.2023 వరకు టెండరు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ఆర్మూర్
DIPR RO No.13369-PP/CL/Advt/1/2022-23, Dt 16.03.2023

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం, సూర్యాపేట జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
Tender Notice No.E1/936/24/1-2/2022-23 తేదీ : 16.03.2023
గ్రీన్ బడ్జెట్/PP SMG 2022-23 & పట్టణ ప్రగతి/స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంట్ క్రింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ గవర్నమెంట్ పోర్టల్ తెలంగాణ ద్వారా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో అర్బన్ పార్కుల నిర్వహణ మరియు CC రోడ్డు వేయు పని కోసం టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలకు దర్శించండి https://tender.telangana.gov.in. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: 16.03.2023న సా.6.00 గం., బిడ్ల దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 20.03.2023న మ.3.00 గం. పూర్తి వివరాల కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌ను కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును. వివరాలకు సంప్రదించండి : 9618455399
సం/- కమిషనర్, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ
DIPR RO No. 13366-PP/CL/Advt/1/2022-23, Dt 16.03.2023

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.E1/DB/MCK/8201/138/2022-23 తేది: .03.2023
ఓనర్ కమ్ డ్రైవర్ స్కీమ్ క్రింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్‌కు TATA ఏస్ గోల్డ్ డీజిల్ BS VI స్వచ్ఛ్ ఆటోల సరఫరా మరియు డెలివరీ. అంచనా వ్యయం: రూ.170.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 17.03.2023 సా. 04.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 23.03.2023 సా. 04.00 గం. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.13370-PP/CL/Advt/1/2022-23, Dt 16.03.2023

గద్వాల మున్సిపాలిటీ కార్యాలయం, జోగులాంబ గద్వాల జిల్లా
కొటేషన్ కోరుతూ ప్రకటన
QIN No.E1/GDL/TKHH/SP/708/2022-23 తేది: 15-03-2023

క్ర.సం.	ఆర్టికల్ / ఎక్విప్‌మెంట్ స్పెసిఫికేషన్	పరిమాణం
01	స్ప్రింక్లర్ సిస్టం / రెయిన్ గన్స్	01
02	7.5 HP /5 HP పంప్	01
03	సక్షన్ రింగ్ పైప్ & గార్డెనింగ్ పైప్	01
04	గార్డెన్ వాటరింగ్ ఎక్విప్‌మెంట్	01

కొటేషన్ స్వీకరణ ప్రారంభ తేది: 16-03-2023 ఉ॥ 11:00గం. కొటేషన్ స్వీకరణ ముగింపు తేది: 18-03-2023 సా॥ 04:00 గం. తదుపరి వివరాలను మున్సిపల్ కౌన్సిల్ గద్వాల నుండి విచారించవచ్చును మరియు ఏవేని తదుపరి వివరాల కోసం సంప్రదించండి ఫోన్: 9849907791 మరియు మెయిల్: mc.gadwal@cdma.gov.in
సం/- కమిషనర్, గద్వాల మున్సిపాలిటీ
DIPR RO No.13349-PP/CL/Advt/1/2022-23, Dt. 16.03.2022

జాతీయ మానసిక దివ్యాంగుల (దివ్యాంగజన్) సాధికారత సంస్థ
దివ్యాంగుల (దివ్యాంగజన్) సాధికారత శాఖ, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
AN ISO 9001:2015 INSTITUTION
మనోవికాస్ నగర్, సికింద్రాబాద్-500009, తెలంగాణ
ఫోన్: 091-40-27751741-745, ఫ్యాక్స్: 091-40-27750198, www.niepid.nic.in
ఉద్యోగ ప్రకటన సం.01/2023
NIEPID మరియు నోయిడా, కోల్‌కతా మరియు నవీ ముంబాయి వద్ద గల దాని ప్రాంతీయ కేంద్రాలు/ MSEC వద్ద రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయబడే దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం ఇన్స్టిట్యూట్ అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతుంది.

క్ర.సం.	ఉద్యోగం పేరు	ఉద్యోగం సంఖ్య	లెవెల్	కేటగిరీ
1.	స్పీచ్ పాథాలజీ & ఆడియాలజీలో లెక్చరర్	01	లెవెల్-10	రిజర్వు చేయబడలేదు
2.	అకౌంట్స్ ఆఫీసర్	01	లెవెల్-07	రిజర్వు చేయబడలేదు
3.	స్టెనోగ్రాఫర్	01	లెవెల్-04	SC కోసం రిజర్వు చేయబడింది
4.	జూనియర్ అకౌంటెంట్	01	లెవెల్-04	రిజర్వు చేయబడలేదు
5.	LDC/ టైపిస్ట్	02	లెవెల్-02	రిజర్వు చేయబడలేదు
6.	లైబ్రరీ క్లర్క్	01	లెవెల్-02	రిజర్వు చేయబడలేదు

క్రాస్ డిజేబిలిటీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ యూనిట్స్ కోసం కాంట్రాక్చువల్ ఉద్యోగాలు
సికింద్రాబాద్ వద్ద NIEPID, HQS, నెల్లూరు, దావణగెరె మరియు రాజ్‌నంద్‌గావ్ వద్ద గల CROలో క్రాస్ డిజేబిలిటీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్స్ కోసం ఏకమొత్తం నెలవారీ రెమ్యునరేషన్‌పై కాంట్రాక్చువల్ ప్రాతిపదికన భర్తీ చేయబడే దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం అర్హత గల అభ్యర్థుల నుండి ఇన్స్టిట్యూట్ దరఖాస్తులు కోరుతుంది.

క్ర.సం.	ఉద్యోగం పేరు	ఉద్యోగాల సంఖ్య	ఉద్యోగం ప్రదేశం	నెలవారీ ఏకమొత్తం రెమ్యూనరేషన్
1.	క్లినికల్ సైకాలజిస్ట్/ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్	04	1-NIEPDI, Hqs 1-దావణగెరె 1-నెల్లూర్ 1-రాజ్‌నంద్‌గావ్	Rs.40,000/-
2.	ఆక్యుపేషనల్ థెరపిస్ట్	04	1-NIEPDI, Hqs 1-దావణగెరె 1-నెల్లూర్ 1-రాజ్‌నంద్‌గావ్	Rs.35,000/-
3.	ఆడియాలజిస్ట్ మరియు స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్ (ASLP)	02	1-NIEPDI, Hqs 1-దావణగెరె	Rs.35,000/-
4.	స్పెషల్ ఎడ్యుకేటర్ (ID)	01	1-దావణగెరె	Rs.35,000/-
5.	స్పెషల్ ఎడ్యుకేటర్ (HI/VI)	01	1-దావణగెరె	Rs.35,000/-
6.	ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్	03	1-దావణగెరె 1-నెల్లూర్ 1-రాజ్‌నంద్‌గావ్	Rs.35,000/-
7.	ఫిజియో థెరపిస్ట్	02	1-NIEPDI, Hqs 1-దావణగెరె	Rs.35,000/-
8.	నర్స్	01	1-రాజ్‌నంద్‌గావ్	Rs.30,000/-
9.	శిక్షణ పొందిన కేర్‌గివర్	11	3-NIEPDI, Hqs 2-దావణగెరె 3-నెల్లూర్ 3-రాజ్‌నంద్‌గావ్	Rs.20,000/-
9.	యాక్టివిటీ టీచర్ (పార్ట్-టైమ్)	03	1-NIEPDI, Hqs 1-దావణగెరె 1-నెల్లూర్	Rs.15,000/-
10.	విజిటింగ్ మెడికల్ కన్సల్టెంట్లు (పీడియాట్రిక్స్/ సైకియాట్రీ/ ఆప్తమాలజీ/ డెంటల్/ న్యూరాలజీ/ ఆర్థోపెడీషియన్)	—	అన్ని కేంద్రాలు	ఒక్క విజిట్‌కు రూ. 2500 (గరిష్టంగా వారానికి 4 విజిట్స్)

పైన తెలిపిన ఉద్యోగాల కోసం నిర్దేశించిన విద్యార్హతలు, అనుభవం, వయసు, నియమ నిబంధనలకు సంబంధించి పూర్తి వివరాల కోసం మరియు దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోనుటకు ఇన్స్టిట్యూట్ వెబ్‌సైట్ www.niepid.nic.in దర్శించండి. దరఖాస్తుల దాఖలు కోసం ఆఖరి తేది: 28.04.2023.
డైరెక్టర్ (OFFG)

- ఉపరితల ద్రోణి కారణంగా ఈదురుగాలులతో కూడిన వాన
- వికారాబాద్ జిల్లా సహా పలుచోట్ల వడగళ్ల బీభత్సం
- పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో పొద్దంతా కురిసిన వర్షం
- మరో మూడు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి


వికారాబాద్ జిల్లా మర్పల్లి రహదారిపై వడగళ్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: బంగ్లాదేశ్ నుంచి కోస్తాంధ్ర వరకు కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా వానలు కురిశాయి. పలు జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు నమోదయ్యాయి. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల పడ్డాయి. వేగంగా వీచిన ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. రేకుల ఇళ్లు, గుడిసెల పైకప్పులు ఎగిరిపోయాయి.

చల్లబడిన హైదరాబాద్

గురువారం ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై ఉండటం, మధ్యాహ్నం నుంచి వాన పడటంతో గ్రేటర్ హైదరాబాద్, పరిసర ప్రాంతాలు చల్లబడ్డాయి. మధ్యాహ్నం మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో సాయంత్రమై చీకటి పడుతోందన్నట్టుగా మారిపోయింది. పలు శివారు ప్రాంతాల్లో ఈదురుగాలులతో, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రాజేంద్రనగర్, బండ్లగూడ, ఉప్పల్, బహదూర్‌పురా తదితర ప్రాంతాల్లో 3 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది.

ఈదురుగాలులు, వడగళ్లతో..

- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో గాలివాన ధాటికి చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెనుగాలులతో పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. గోవిందరావుపేట మండలం దుంపిళ్లగూడెం, కర్లపల్లిలో వడగళ్లు పడ్డాయి.
- ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ విస్తారంగా వానలు పడ్డాయి. పలుచోట్ల వడగళ్లు పడ్డాయి. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- కామారెడ్డి జిల్లా జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల్లో వడగళ్లు పడ్డాయి. మదన్‌హిప్పర్గా - డోంగ్లీ రహదారిపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.
- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కోహీర్‌లోని బడంపేటలో ఓ ఇంటిపైకప్పు ఎగిరిపోయింది. చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మరో మూడు రోజులు వానలు

బంగ్లాదేశ్ నుంచి కోస్తాంధ్ర వరకు, దక్షిణ తమిళనాడు నుంచి ఉత్తర కొంకణ్ వరకు ఉపరితల ద్రోణులు ఏర్పడ్డాయని.. వాటి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వానలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వానలు మరో మూడు రోజులు కొనసాగుతాయని.. కొన్ని ప్రాంతాల్లో వడగళ్లతో కూడిన వానలు పడతాయని హెచ్చరించింది. రాష్ట్రంలో శుక్రవారానికి ఆరెంజ్ అలర్ట్‌ను, మిగతా రెండు రోజులకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది.

పిడుగుపాటుకు ముగ్గురు బలి

వనపర్తి జిల్లా పెంచికపాడు శివారులో కృష్ణాతీరంలో గొర్రెలను మేపుతున్న వంగూరు లక్ష్మి (45).. నాగర్‌కర్నూల్ జిల్లా లింగసానిపల్లిలో గొర్రెలు మేపుతున్న బాలకృష్ణ (22) పిడుగుపాటుకు గురై మృతి చెందారు. గద్వాల జిల్లా అమరగిద్దలో పొలంలో ఆరబెట్టిన పొగాకు తోరణాలకు కవర్లు కప్పుతుండగా పిడుగుపడి జమ్మన్న (38) మృతి చెందాడు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గంటా శ్రవణ్‌రెడ్డి ఇంటిపై పిడుగుపడి సామగ్రి పూర్తిగా కాలిపోయింది.

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీభత్సం


మంతన్‌గౌరెల్లిలో వడగళ్లతో గాయపడ్డ మహిళ

ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన వికారాబాద్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. పలుచోట్ల కిలో బరువున్న వడగళ్లు కురిశాయి. చేలన్నీ వడగళ్లతో నిండి పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లన్నీ వడగళ్లతో నిండిపోయి హిమాలయ ప్రాంతంలా కనిపించడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మంతన్‌గౌరెల్లిలో 60కి పైగా రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. వేల కోళ్ల మృత్యువాత పడ్డాయి. 10 కార్ల అద్దాలు పగిలాయి. వడగళ్లతో మంతన్‌గౌరెల్లిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌లోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పిడుగు పడటంతో ధ్వజస్తంభం విరిగి పడి విద్యుత్ తీగలపై పడింది.


గద్వాల మార్కెట్ యార్డులో తడిసిన వేరుశనగ

వేల ఎకరాల్లో పంట నష్టం

- వడగళ్లతో మొక్కజొన్న, బీర, టమాటా పంటలకు దెబ్బ
- కొన్నిచోట్ల మంచు ప్రాంతంలా మారిపోయిన పొలాలు
- నేడు వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ మంత్రి పర్యటన


ఖమ్మం జిల్లా చిన్నమునగాలలో నేలకొరిగిన మొక్కజొన్న

సాక్షి, హైదరాబాద్: వడగళ్ల వానలు రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల్లో పంట నష్టం కలిగించాయి. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో టమాటా, బీరకాయ, మొక్కజొన్న, పచ్చిమిర్చి, బొబ్బర్లు, మినుములు తదితర పంటలకు నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల పొట్టదశకు వచ్చిన వరి నేలవాలింది. మామిడి పిందెలు, కాయలు రాలి తీవ్ర నష్టం వచ్చిందని రైతులు వాపోతున్నారు.

ఆరు జిల్లాల్లో ప్రభావం..

అకాల వర్షాలతో ప్రధానంగా ఆరు జిల్లాల్లో పంటలపై ప్రభావం పడింది. సుమారు 50 మండలాల్లోని 650 గ్రామాల్లో నష్టం జరిగిందని.. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో నష్టం తీవ్రంగా ఉందని అధికారులు చెప్తున్నారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్, మర్పల్లి మండలాల్లో అయితే పంట పొలాలన్నీ వడగళ్లతో నిండిపోయి మంచు ప్రాంతంలా మారిపోయాయి. ఆ పంటలు చేతికందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దీనితోపాటు సంగారెడ్డి, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోనూ పలుచోట్ల వడగళ్లతో పంటలు దెబ్బతిన్నాయి.

నేడు మంత్రి పర్యటన

వికారాబాద్ జిల్లా మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని.. శుక్రవారం రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలసి నష్టాన్ని పరిశీలిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, గులాబీ, ఉల్లి, బొప్పాయితోపాటు మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్టు తెలుస్తుందన్నారు.

నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం


కాలేజీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జూనియర్లు, తల్లిదండ్రులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లాలోని ఓ నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని తిరుమల నర్సింగ్ కాలేజీలో బీఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థులు తమను ర్యాగింగ్ చేస్తున్నారని సెకండియర్ విద్యార్థినులు ఆరోపించారు. ఈ విషయాన్ని కొందరు జూనియర్లు తమ తల్లి దండ్రులకు తెలియజేయడంతో వారు కాలేజీ వద్దకు వచ్చి మేనేజ్‌మెంట్ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఫ్రెషర్స్ పార్టీ చేసుకుంటుండగా సీనియర్ విద్యార్థులు ఫ్లెక్సీ చించివేశారని, అడ్డుకున్న తమను కొట్టారని జూనియర్లు ఆరోపించారు. నలుగురు బయట వ్యక్తుల్ని కాలేజీకి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి ఎస్సై గణేశ్ కాలేజీకి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. జూనియర్లు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తృతీయ సంవత్సరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు, సెకండియర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

A.P TOURISM DEVELOPMENT CORPORATION LTD
5th Floor, Stalin Corporate, Industrial Estate, Autonagar, Vijayawada-07
SHORT TENDER NOTIFICATION
Tender Notice No. APTDC/O&M/7/2022-23, Dt: 16.03.2023
APTDC Ltd. inviting Bids for Selection of Agency for Co-Branding Partnership with Andhra Pradesh Tourism Development Corporation (APTDC) for establishment of Amrut Kiosk (S) in Andhra Pradesh. For RFP document please visit https://www.apeprocurement.gov.in.
Sd/- K Kanna Babu, IAS, Managing Director
DIPR RO No.1619PP/CL/ADVT/1/1/2021-22, Dt 16/03/2023

పురపాలక సంఘ కార్యాలయము :: ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఆర్.ఓ.సి.నెం.ఎ1/వైయబజార్/2023-24, పత్రికా ప్రకటన తేది : 15.03.2023.
వైయ బజార్ వేలము/ టెండరు
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! పురపాలక సంఘ కార్యాలయము, ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నందు వైయబజార్ యొక్క కాంట్రాక్టు 2023-24 సం॥ నందు అనగా ఏప్రిల్, 2023 నుండి మార్చి 2024 వరకు కాంట్రాక్టు ఇవ్వుటకు నిర్ణయించనైనది. టెండరు షెడ్యూల్ దాఖలు చేయు తేది: 20.03.2023 నుండి 25.03.2023 సా.5.00 గం.వరకు (కార్యాలయ పని దినాలలో సంప్రదించగలరు) ఓపెన్ ఆక్షన్ తేది : 29.03.2023 సా.4.00 గం.లకు. క్రమ.సం.1. కాంట్రాక్టు వివరములు వైయ బజార్, డిపాజిట్ 2,00,000/-, రిజిస్ట్రేషన్ ఫీజు : 10,000/-. టెండరు నియమ నిబంధనలు కార్యాలయ నోటీసు బోర్డుపై ఉంచబడినవి. సంప్రదించవలసిన అధికారి రెవెన్యూ అధికారి : సెల్ నెం: 9666333359, (డిపాజిట్ డి.డి. & రిజిస్ట్రేషన్ డి.డి. టెండరు సమయంలో సమర్పించవలయును)
సం/- మున్సిపల్ కమిషనర్, పురపాలక సంఘం, ఇల్లందు.
DIPR RO No.13340-PP/CL/Advt/1/2022-23, Dt 16.03.2023

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
నం.E/MGF/336/2023 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 16.03.2023
మున్సిపల్ జనరల్ ఫండ్స్ క్రింద మున్సిపల్ కమిషనర్, పాల్వంచ మున్సిపాలిటీ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ ద్వారా టెండర్లు కోరుచున్నారు. పనుల వివరాలు దిగువ విధంగా ఉన్నాయి: 1. మొత్తం పనుల సంఖ్య: (03) పనులు. 2. మొత్తం పనుల విలువ: 7.00 లక్షలు. 3. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.03.2023 ఉ.11.00 గం. 4. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 21.03.2023 సా.4.30 గం. 5. బిడ్ తెరుచు తేది: 21.03.2023 సా.5.00 గం. 6. కార్యాలయంలో సంప్రదించవలసిన అధికారి పేరు మరియు చిరునామా: మున్సిపల్ కమిషనర్, పాల్వంచ మున్సిపాలిటీ, సెల్ నం.9849905884
సం/- కమిషనర్, పాల్వంచ మున్సిపాలిటీ
DIPR RO No.13346-PP/CL/Advt/1/2022-23, Dt: 16-03-2023

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం:: తెల్లాపూర్, సంగారెడ్డి జిల్లా
సమోదిత ఏజెన్సీల నుండి కొటేషన్ల కోసం పిలుపు
Lr.No. MCT/E1/ /2022-23 తేది:16.03.2023
ఫినిష్ ఐటమ్ పని కోసం మెటీరియల్, మెషినరీ ధర మరియు ట్రాన్స్‌పోర్ట్ మరియు లేబర్ చార్జీలతో సహా పూర్తిగా ఫిట్టింగ్ కోసం మున్సిపల్ ట్రాక్టర్‌కు అగర్ మెషిన్ మరియు అటాచ్‌మెంట్ కొనుగోలు కోసం కొటేషన్ల కోసం మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ వారిచే సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ వారి పేరున కొటేషన్ల స్వీకరణ కోసం ఆఖరి తేది: 24-03-2023న సా 5.00 గం॥ వరకు. ఏవైనా తదుపరి వివరాల కోసం శ్రీ B. శ్రీనివాస్, కమిషనర్ గారిని కార్యాలయ పని వేళలలో సంప్రదించవచ్చును.
సం/- మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ
DIPR RO No.13343-PP/CL/ADVT/1/2022-23, Dt 16-03-2023

తెలంగాణ ప్రభుత్వం.
పురపాలక పరిపాలనా మరియు పట్టణాభివృద్ధి శాఖ, పురపాలక సంఘ కార్యాలయము, హుజూరాబాద్, జిల్లా-కరీంనగర్
లేఖ నెం. A1/346/2023 **వేలము ప్రకటన** తేది : 03.03.2023
ఇందుమూలముగా సమస్త హుజూరాబాద్ పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, హుజూరాబాద్ పురపాలక సంఘం పరిధిలో 2023-24 ఆర్థిక సం.నకు (తేది: 01.04.2023 నుండి 31.03.2024 వరకు) [illegible] బహిరంగ వేలము తేది: 23.03.2023 గురువారం రోజున ఉ.12.00 గం.లకు పురపాలక సంఘ కార్యాలయం నందు [illegible] రూ.70,000/-ల డిపాజిట్ డి.డి. [illegible] రూ. 8,00,000/-ల [illegible]
DIPR RO No.13356-PP/CL/Advt/1/2022-23, Dt 16.03.2023 సం/- కమిషనర్, పురపాలక సంఘం, హుజూరాబాద్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి జిల్లా
ఇమెయిల్: ramagundam.corporation@gmail.com
టెండరు ప్రకటన
NIT No.47/EE/ACDP/RMC/2023, పని పేరు: ACDP నిధుల క్రింద RMCలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు (13 పనులు), అంచనా వ్యయం: రూ.162.00 లక్షలు. టెండరు ప్రక్రియ షెడ్యూలు: బిడ్ దాఖలుకు ప్రారంభ తేది: 18.03.2023. బిడ్ దాఖలుకు ముగింపు తేది మరియు సమయం: 31.03.2023 సా.4.00 గం. ధర బిడ్ తెరుచు తేది: 31.03.2023 సా.5.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.13353-PP/CL/Advt/1/2022-23, Dt. 16.03.2022

Dr. YSR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P
VIJAYAWADA – 520 008
No.17/We/T8/DM1/22 TENDER NOTICE Date: 16.03.2023
Sealed Tenders are invited for the following work at Dr.YSR University of Health Sciences, Vijayawada.

Sl.No	Name of the work
1	Printing and supply of Secured & General items required for the Examinations Wing of Dr.YSRUHS, Vijayawada for the year 2023-2024 & 2024-2025

Note: For further details visit www.apeprocurement.gov.in
Sd/- (Dr.V. Radhika Reddy) REGISTRAR

AP ICET-2023
Conducted on behalf of APSCHE by
SRI KRISHNADEVARAYA UNIVERSITY
ANANTHAPURAMU-515003
NOTIFICATION
Applications are invited for AP Integrated Common Entrance Test (APICET-2023) for admission into first year **MBA/MCA** Courses for the Academic Year 2023-24. Eligible candidates may submit their applications through **online mode only** by paying registration and processing fee **(Rs 650/- for OC & Rs. 600/- for BC and Rs.550/- for SC/ST Candidates)** through online payment by using credit / debit card or Net banking. The detailed information about APICET- 2023 is available on the **website: https://cets.apsche.ap.gov.in.**
Commencement of Online submission of application: **20-03-2023.**
Details for submission of online application with late fee are available on the website.

Last date for submission of applications online without late fee	19-04-2023
Date of Entrance Test	24-05-2023 & 25-05-2023
Time of the Test	09.00 AM to 11.30 AM & 03.00 PM to 5.30 PM

Place : ANANTHAPURAMU
Date : 17-03-2023
CONVENER, AP ICET-2023

గురుకులంలో కలుషితాహారం కలకలం


అస్వస్థతకు గురైన బాలికలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓ గిరిజన బాలికల గురుకులంలో కలుషితాహారం కలకలం చెలరేగింది. అర్ధరాత్రి వేళ వాంతులు, విరోచనాలకు గురైన 80 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల గురుకులంలో బుధవారంరాత్రి చోటు చేసుకుంది. రాత్రి 9 గంటలకు దాదాపు 400 మంది విద్యార్థినులు భోజనం చేశారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో 80 మంది విద్యార్థినులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. విద్యార్థినుల సమాచారం మేరకు ఏఎన్ఎం, వైద్యసిబ్బంది వచ్చి మాత్రలు అందించినా చాలామంది కోలుకోలేదు. అర్ధరాత్రి సమయంలో 24 మంది విద్యార్థినులను సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఆరుగురు విద్యార్థినుల పరిస్థితి విషమంగా ఉండటంతో సెలైన్లు పెట్టి, గురువారం ఉదయం డిశ్చార్జ్ చేశారు.

పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం

కలుషితాహారం ఘటన గురించి తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకన్న గురువారం పాఠశాలకు చేరుకుని విచారించా రు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు శిబిరం కొనసాగించాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై వివక్ష

- కమీషన్లు వచ్చే వాటిపైనే సీఎం కేసీఆర్ దృష్టి: రేవంత్‌రెడ్డి


ఎడపల్లిలో వర్షంలోనే పాదయాత్ర చేస్తున్న రేవంత్‌రెడ్డి

నిజామాబాద్‌సిటీ/బోధన్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోకంటే ఎక్కువ వివక్షకు గురవుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగాపూర్‌లో కాళేశ్వరం 20వ ప్యాకేజీ పంప్‌హౌస్‌ను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. అనంతరం రాత్రి బోధన్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లోనూ, పిట్లంలో నిర్వహించిన సభలోనూ మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా రైతులను ప్రోత్సహించటానికి అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మూడు లక్షల ఎకరాలకు నీరందేలా కొన్ని ప్రాజెక్టులు మొదలుపెట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రాణహిత-చేవెళ్ల 21వ ప్యాకేజీ పనులకు రూ.1,200 కోట్లు కేటాయించారని, రూ.900 కోట్ల వరకు ఖర్చు చేయగా చాలా వరకు పనులు పూర్తయ్యాయన్నారు. అయితే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మిగిలిన నిధులు కేటాయించకపోవడంతో ప్యాకేజీ పూర్తికాక ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. అలాగే ప్రాణహిత – చేవెళ్ల 20వ ప్యాకేజీ పనులు కూడా కాంగ్రెస్ హయాంలోనే 70% పూర్తయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించి ఉంటే ఉమ్మడి జిల్లాలో రూ. 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ ఉన్న నియోజకవర్గాలలో కొంతమేర పనులు పూర్తిచేసి, వాటిని చూపిస్తూ కాళేశ్వరం పూర్తయినట్లుగా తెలంగాణ సమాజాన్ని భ్రమలకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. 'సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకుంటే మీ అయ్య కేసీఆర్ సీఎం, నువ్వు మంత్రులు అయ్యేవారా?'అని రేవంత్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కాగా, బోధన్ ప్రాంతంలో వర్షంలోనూ రేవంత్ పాదయాత్ర కొనసాగింది.



క్లుప్తంగా...

కొత్తగా ఎర్నీ బాట్!

హాంకాంగ్: మైక్రోసాఫ్ట్ సంస్థ తీసుకొచ్చిన కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతోంది. కోట్లాది మంది ఉపయోగిస్తున్నారు. రోజురోజుకూ యూజర్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి పోటీగా చైనా సెర్చ్ ఇంజిన్ బైదూ కొత్తగా ఏఐ ఆధారిత చాట్‌బాట్ 'ఎర్నీబాట్'ను గురువారం ఆవిష్కరించింది. అయితే, ఇది యూజర్లను నిరాశపర్చింది. ఎర్నీబాట్ సంపూర్ణమేమీ కాదని, ఇంకా మెరుగుపరుస్తామని బైదూ సీఈఓ రాబిన్ లీ చెప్పారు. ఎర్నీబాట్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బైదూ కంపెనీ షేర్ల విలువ 10 శాతం పడిపోయింది. ఎర్నీబాట్‌ను ఉపయోగించుకొనేందుకు ఇప్పటిదాకా 650 కంపెనీలు ముందుకొచ్చాయని రాబిన్ లీ తెలిపారు. ఈ చాట్‌బాట్ మొదటి వెర్షన్‌ను 2019లో అభివృద్ధి చేశామన్నారు.

టిక్‌టాక్‌పై యూకే నిషేధం



లండన్: ప్రభుత్వ ఫోన్లలో టిక్‌టాక్ యాప్ వినియోగంపై బ్రిటన్ నిషేధం విధించింది. చైనా మూలాలున్న ఈ సామాజిక మాధ్యమ యాప్‌ను భద్రతాపరమైన కారణాలతో నిషేధిస్తున్నట్లు తెలిపింది. యూకే మంత్రి ఆలివర్ డౌడెన్ గురువారం పార్లమెంట్‌లో ఈ విషయం ప్రకటించారు. ప్రభుత్వ డేటా, సమాచారాన్ని టిక్‌టాక్ వాడుకోవడం ప్రమాదకరమని ఆయన అన్నారు. టిక్‌టాక్‌పై ఇప్పటికే భారత్, అమెరికా, కెనడా, ఈయూ దేశాలు పూర్తిస్థాయిలో నిషేధం విధించిన విషయం తెలిసిందే. యాప్ వినియోగదారుల సమాచారాన్ని చైనా ప్రభుత్వంతో పంచుకున్నట్లు వస్తున్న ఆరోపణలను టిక్‌టాక్ ఖండిస్తోంది.

216 జడ్జీల పోస్టుల భర్తీకి సిఫారసులు రాలేదు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టుల్లో మొత్తం 334 జడ్జీల పోస్టులు ఖాళీలుండగా 118 పోస్టుల భర్తీ కోసం హైకోర్టు కొలీజియంల నుంచి అందిన సిఫారసులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నట్లు కేంద్రం తెలిపింది. మరో 216 జడ్జీల పోస్టులకు హైకోర్టుల కొలీజియంల నుంచి సిఫారసులు అందాల్సి ఉందని వివరించింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. మార్చి 10వ తేదీ నాటికి సుప్రీంకోర్టులో ఖాళీలు లేవన్నారు. 25 హైకోర్టుల్లో మంజూరైన 1,114 జడ్జీ పోస్టులకు గాను 334 ఖాళీలున్నాయన్నారు. జడ్జి పోస్టుల ఖాళీల భర్తీ నిరంతర ప్రక్రియ అని వివరించారు.

ఇమ్రాన్ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- మార్చి 18లోగా అరెస్ట్ చేసి హాజరుపరచాలని సెషన్స్ కోర్టు ఆదేశాలు
- 2 కోట్లు చెల్లించి 10 కోట్ల విలువైన కానుకలు సొంతం చేసుకున్న ఇమ్రాన్
- మూడు వాచీలు అమ్ముకొని మూడున్నర కోట్లు మూటగట్టుకున్న వైనం
- ఆత్మాహుతి దాడులు తప్పవని ప్రభుత్వానికి ఇమ్రాన్ అనుచరుల హెచ్చరికలు

పాకిస్తాన్ తెహ్రీకీ ఇన్సాఫ్ (పీటీఐ) అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. తోషఖానా కేసులో తనపైనున్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను రద్దు చేయాలంటూ ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. పోలీసులకు లొంగిపోవాలని సూచించింది. ఇమ్రాన్ తనంతట తాను లొంగకపోతే మార్చి 18లోగా అరెస్ట్ చేసి కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని సెషన్స్ న్యాయమూర్తి జఫర్ ఇక్బాల్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అరెస్ట్ చేయాలని ఆదేశించామని మళ్లీ వారెంట్ల రద్దు పిటిషన్ ఎందుకు వేశారని న్యాయమూర్తి సీరియస్ అయ్యారు. దీంతో ఇమ్రాన్ ఎదుట ఉన్న దారులన్నీ మూసుకుపోయాయి. శనివారం నాడు ఆయన అరెస్ట్ కాక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయడానికి 10 రోజుల క్రితం పోలీసులు ప్రయత్నించినప్పట్నుంచి పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటూనే ఉన్నాయి. పోలీసులు ఇమ్రాన్ నివాసానికి వెళ్లిన ప్రతీసారి ఆయన ఇంట్లో లేకపోవడం, కార్యకర్తలు పోలీసులపైకి రాళ్లు రువ్వుతూ ఘర్షణకు దిగడం సర్వసాధారణంగా మారింది.



తోషఖానా టు బందీఖానా!

ఏమిటీ తోషఖానా కేసు..?

తోషఖానా.. అంటే ప్రభుత్వానికి దేశ విదేశీ ప్రతినిధుల నుంచి వచ్చే కానుకల ఖజానా. 1974లో ఇది ఏర్పాటైంది. ప్రభుత్వ అధికారులకొచ్చే కానుకల్ని ఇందులోనే ఉంచుతారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తమకు ఎవరు ఏ కానుక ఇచ్చినా తోషఖానాకు తప్పనిసరిగా అప్పగించాలి. ఇమ్రాన్‌ఖాన్ ప్రధాని పదవిని చేపట్టాక తనకు వచ్చిన కానుకలేమిటో చెప్పడానికి నిరాకరించారు. అంతేకాదు తనకు వచ్చిన కానుకల్ని ఎంతో కొంత ధర ఇచ్చి తోషఖానా నుంచి తీసుకొని వాటిని తిరిగి అమ్ముకోవడానికి అనుమతినివ్వాలంటూ ఎన్నికల సంఘానికి లేఖ కూడా రాశారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉండగా 101 కానుకలు వచ్చాయి. 2018, సెప్టెంబర్ 24 నాటికి అలా వచ్చిన కానుకల్లో 10 కోట్ల విలువైన వాటికి 2 కోట్లు చెల్లించి ఇమ్రాన్ తీసుకున్నారని నివేదికలు వెల్లడించాయి. అంతేకాకుండా మూడు వాచీలను అమ్మేసి ఇమ్రాన్ సొమ్ము చేసుకున్న మొత్తం రూ.3.6 కోట్లుగా తేలింది. పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టులో తోషఖానా వివాదంపై కేసు నమోదు చేసింది. ఇమ్రాన్ తనకు వచ్చిన కానుకల వివరాలు చెప్పకుండా కొన్ని అక్రమ మార్గాల్లో అమ్ముకున్నారంటూ కేసు పెట్టింది. ఇమ్రాన్ గద్దె దిగిన తర్వాత తోషఖానాలో కొన్ని పుస్తకాలు తప్ప మరే వస్తువు లేదు.

పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ ఏమంటోంది?

ఇమ్రాన్‌కు వ్యతిరేకంగా కేసు రిజిస్టర్ అయిన రెండు నెలల తర్వాత పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ ఇమ్రాన్ ఆ కానుకల్ని అమ్ముకోవడం చట్ట వ్యతిరేకం కాదని తేల్చి చెప్పింది. ఎందుకంటే ఎంతో కొంత ధర చెల్లించి ఆయన ఆ కానుకల్ని తన సొంతం చేసుకున్నారని చెప్పింది. అయితే ఆయన అనైతికంగా ఈ పని చేస్తూ తప్పు దారి పట్టించే ప్రకటనలు చేశారంటూ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్‌పై అయిదేళ్ల నిషేధం విధించింది.



ఇమ్రాన్ తీసుకున్న కానుకల ఖరీదు (పాకిస్తాన్ రూపాయలు)	
డైమండ్ రిస్ట్ వాచీ	8.5 కోట్లు
కఫ్‌లింక్స్ పెయిర్	56 లక్షలు
పెన్ను	15 లక్షలు
ఉంగరం	87.5 లక్షలు
4 రోలెక్స్ వాచీలు	87 లక్షలు

ఇవే కాకుండా పెర్ఫ్యూమ్స్, ఐ ఫోన్లు, మాంట్ బ్లాంక్ పెన్, మసీదు, అత్తర్ బాటిల్స్ నమూనాల వంటివి తీసుకున్నారు.



37 కేసులు

- ఇమ్రాన్‌ఖాన్‌పై తోషఖానాతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 37 కేసులు నమోదయ్యాయి.
- పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) ప్రధాన ఎన్నికల అధికారి సికందర్ సుల్తాన్ రజాకు వ్యతిరేకంగా ఇమ్రాన్‌తో పాటు పీటీఐ పార్టీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఒక కేసు నమోదైంది
- ఎన్నికల కమిషన్ అయిదేళ్లపాటు ఎన్నికలకు దూరంగా ఉండాలంటూ అనర్హత వేటు వేసినప్పుడు ఈసీపీ కార్యాలయం ఎదుట నిరసనలు నిర్వహించడంపై కేసు దాఖలైంది
- పాకిస్తాన్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ యాక్ట్ నియమాలను ఉల్లంఘిస్తూ విదేశాల నుంచి ఆర్థిక లావాదేవీలు నడిపారన్న ఆరోపణలపై కేసు
- పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్‌ని ఉల్లంఘిస్తూ ర్యాలీ నిర్వహించినందుకు కేసు
- పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) నేత మొహ్‌సిన్ షానావజా రంజా ఇమ్రాన్ ఆదేశాల మేరకే తనను పోలీసులు కొట్టి చంపడానికి వచ్చారంటూ హత్యాయత్నం కేసు పెట్టారు

అరెస్టయితే అంతర్యుద్ధం తప్పదా..?

ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్ అయితే పాకిస్తాన్‌లో అంతర్గత యుద్ధం తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాను అరెస్ట్ అయితే ఏం చెయ్యాలన్న దానిపైనా ఇమ్రాన్ పక్కా ప్రణాళికతోనే ఉన్నారు. దానిని సరైన సమయంలో బయటపెడతానని ఆయన చెబుతున్నారు. తమ నేతపై చెయ్యి వేస్తే షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఆత్మాహుతి దాడులకి దిగుతామని ఇప్పటికే పార్టీ నాయకులు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆర్థికంగా, రాజకీయంగా గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న పాక్ ప్రభుత్వానికి పీటీఐ కార్యకర్తల సవాల్ ఎదుర్కోవడం కూడా క్లిష్టంగా మారింది. మరోవైపు పంజాబ్ ర్యాలీలో ఇమ్రాన్‌పై దాడి జరిగిన దగ్గర్నుంచి ఆయనను హత్య చేస్తారన్న ఆందోళనలూ ఉన్నాయి. తనపై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఆయన ఇప్పటివరకు కోర్టు ఎదుట కూడా హాజరు కాలేదు. ప్రభుత్వ పెద్దలే తనను హత్య చెయ్యడానికి కుట్ర పన్నుతున్నారంటూ ఇమ్రాన్ తనకు అనుమానం ఉన్న వారందరి పేర్లు వెల్లడిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. తనని జైలుకు పంపినా, చంపేసినా ప్రభుత్వంపై పోరాటం ఆపవద్దంటూ అనుచరుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

13 మందిపై రేప్, వీడియో రికార్డింగ్

సిడ్నీ: ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలకు పిలిచి, మత్తు కలిపిన డ్రింక్స్ తాగించి వారిపై అత్యాచారానికి పాల్పడేవాడు.. ఆ దురాగతాలను వీడియో రికార్డింగ్ చేసేవాడు. కొరియా మహిళలంటే ఇతడికి పిచ్చి. బాధితుల్లో వీరే ఎక్కువమంది. వీరి పేర్లు, వివరాలను దాచుకున్నాడు. అతడి గదిలో బెడ్ పక్కనే అలారం క్లాక్‌లోని సీక్రెట్ కెమెరా ద్వారా అన్నీ రికార్డయ్యేవి...ఇవన్నీ ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన భారత సంతతి వ్యక్తి బాలేశ్ ధన్‌కర్ అకృత్యాలు. 2018 జనవరి– అక్టోబర్‌కాలంలో ఇతడు 13 మంది ఇతడు మహిళలను రేప్ చేశాడు. 2018 అక్టోబర్‌లో పోలీసులు ఇతడి సొంత ఫ్లాట్‌తోపాటు ఓ హోటల్ గదిలో సోదాలు జరపగా మత్తు పదార్థాలు కలిపిన డ్రింక్స్ బాటిళ్లు, రేప్ దృశ్యాలు, మహిళలతో ఏకాంతంగా ఉండగా తీసిన మొత్తం 47 వీడియోలతో హార్డ్‌డ్రైవ్ దొరికింది. బాలేశ్ నేరాలపై న్యూసౌత్ వేల్స్ జిల్లా కోర్టులో విచారణ జరుగుతోంది. కొన్ని వీడియోల్లోని అసహ్యకర దృశ్యాలను జడ్జీలు కూడా చూడలేకపోయారని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పేర్కొంది.

సిసోడియాపై మరో కేసు



న్యూఢిల్లీ: మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఢిల్లీ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) మరో కేసును నమోదుచేసింది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఫీడ్ బ్యాక్ యూనిట్(ఎఫ్‌బీయూ) విషయంలో అధికార, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ప్రత్యర్థి పార్టీలపై నిఘా కోసం వాడారని మనీశ్‌పై గతంలో ఆరోపణలు వచ్చాయి. దీంతో నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం, ఫోర్జరీసహా అవినీతి నిరోధక చట్టం కింద సీబీఐ మంగళవారం కేసు నమోదుచేసింది. సిసోడియాతోపాటు గతంలో విజిలెన్స్ విభాగ కార్యదర్శిగా పనిచేసిన ఐఆర్ఎస్ అధికారి సుకేశ్‌కుమార్, సీఎం కేజ్రీవాల్‌కు ప్రత్యేక సలహాదారు, ఎఫ్‌బీయూ జాయింట్ డైరెక్టర్, రిటైర్డ్ సీఐఎస్ఎఫ్ డీఐజీ రాకేశ్ కుమార్ సిన్హాలపై కేసు నమోదైంది. కస్టడీలోనే మనీశ్ మగ్గిపోయేలా చేయాలని ప్రధాని మోదీ ఇలా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పనితీరును నిఘావేసి సమాచారం(ఫీడ్‌బ్యాక్) సేకరించేందుకు ఉద్దేశించిన ఎఫ్‌బీయూను వీరంతా దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. 2016 నవంబర్ నాలుగోతేదీన ఢిల్లీ విజిలెన్స్ విభాగం ఫిర్యాదుతో సీబీఐ రంగప్రవేశం చేసి ఎఫ్‌బీయూ నియామకాలు, నిధుల్లో అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేల్చి ఆ నివేదికను తాజాగా 11 పేజీల ఎఫ్ఐఆర్‌లో జతచేసింది.

అమెరికా ఎయిర్‌ఫోర్స్ అసిస్టెంట్ సెక్రటరీగా చౌధరి



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ ఫ్లైట్ టెస్ట్ ఇంజినీర్ రవి చౌధరి చరిత్ర సృష్టించారు. అమెరికా రక్షణ శాఖలో ఎయిర్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ స్థాయికి ఎదిగిన మొట్టమొదటి భారతీయ అమెరికన్ ఈయనే. రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్‌లోని ఈ అత్యున్నత పదవికి రవి చౌధరిని నామినేట్ చేస్తూ అధ్యక్షుడు జో బైడెన్ చేసిన సిఫారసును సెనేట్ 65–29 ఓట్ల తేడాతో బుధవారం ఆమోదించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీకి చెందిన డజనుకు పైగా సభ్యులు సైతం రవి చౌధరికి మద్దతివ్వడం విశేషం. రవి అమెరికా ఎయిర్ ఫోర్స్‌లో 1993–2015 నుంచి 22 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ఆపరేషనల్, ఇంజినీరింగ్, సీనియర్ స్టాఫ్ అసైన్‌మెంట్లు వంటి వైవిధ్యమైన అంశాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ)లోని అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ అండ్ ఇన్నోవేషన్ విభాగానికి డైరెక్టర్ కూడా వ్యవహరించారు. సి–17 పైలట్‌గా అఫ్గానిస్తాన్, ఇరాక్ యుద్ధ విధుల్లో పాలుపంచుకున్నారు. సిస్టమ్స్ ఇంజినీర్ కూడా అయిన చౌధరి నాసాలోనూ పనిచేశారు.

పార్లమెంట్‌లో జవాబిస్తా: రాహుల్

న్యూఢిల్లీ: లండన్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమాషా సృష్టించిందని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలన్నదే ప్రభుత్వ పన్నాగమని దుయ్యబట్టారు. బీజేపీ చేస్తున్న ఆరోపణలపై పార్లమెంట్‌లో సమాధానం చెబుతానని అన్నారు. రాహుల్ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తనపై పార్లమెంట్‌లో నలుగురు కేంద్ర మంత్రులు ఆరోపణలు చేశారని, సమాధానం చెప్పడానికి తనకు వారికి ఇచ్చినంత సమయం ఇస్తారా? లేక నోరు నొక్కేస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. అదానీ వ్యవహారం బయటపడడంతో ప్రభుత్వం, ప్రధాని మోదీ భయపడుతున్నారని, అందుకే జనం దృష్టిని మళ్లించడానికి లేనిపోని తమాషా సృష్టించారని మండిపడ్డారు. గురువారం స్పీకర్ బిర్లాను కలిశానని, చట్టసభ సభ్యుడిగా పార్లమెంట్‌లో మాట్లాడతానని చెప్పానన్నారు. మోదీ–అదానీ బంధంపై ప్రభుత్వానికి నాలుగు ప్రశ్నలు సంధించానని వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలకు పార్లమెంట్‌లో సమాధానం చెప్పడం తన ప్రజాస్వామిక హక్కు అని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యం నిజంగా సక్రమంగా పని చేస్తుంటే తన హక్కుకు రక్షణ లభిస్తుందని, చట్టసభలో మాట్లాడే అవకాశం లభిస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.



స్పీకర్‌తో రాహుల్ భేటీ

కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరితో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో మాట్లాడేందుకు తనను అనుమతించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. లండన్ పర్యటనలో భారత్‌కు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. సభలో అవకాశం ఇస్తే తాను చెప్పాలనుకున్నది చెప్తానన్నారు. సభలో అవకాశం రాకపోతే సభ బయట మాట్లాడతానని పేర్కొన్నారు. లండన్‌లో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెబుతారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, రాహుల్ చిరునవ్వులు చిందించారు.

నాలుగో రోజూ ప్రతిష్టంభన

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కొనసాగిన గందరగోళం

న్యూఢిల్లీ: లండన్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, అదానీ గ్రూప్ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయి. తమ డిమాండ్ల నుంచి అధికార, విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. విదేశీ గడ్డపై భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ ఎంపీలు, అదానీ అంశంపై విచారణ కోసం జేపీసీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు వరుసగా నాలుగో రోజు గురువారం సైతం స్తంభించాయి. .

రాహుల్ గాంధీ రాక

లోక్‌సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే యథావిధిగా అధికార, ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరస్పరం వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించారు. దీంతో కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే స్పీకర్ బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. లోక్‌సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభలోకి ప్రవేశించారు. 'లండన్' వ్యాఖ్యల తర్వాత ఆయన సభకు రావడం ఇదే మొదటిసారి. అధికార బీజేపీ, విపక్ష ఎంపీలు నినాదాలు ఆపలేదు. దంతో స్పీకర్ సభను మరుటి రోజుకు వాయిదా వేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, అరుపులతో రాజ్యసభ స్తంభించింది.

క్షమాపణ చెప్పాలి: మంత్రులు

భారత ప్రజాస్వామ్యంపై బ్రిటన్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషీ డిమాండ్ చేశారు. అంతకంటే ముందు ఆయన తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయాలన్నారు. గతంలో ఎంతోమంది సీనియర్ నాయకులు పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పారని వారు గుర్తుచేశారు.

అదానీపై చర్చను ఎగ్గొట్టడానికే: ఖర్గే

అదానీపై, పరిపాలనలో వైఫల్యాలపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా చూడాలన్నదే నరేంద్ర మోదీ ప్రభుత్వ కుతంత్రమని ఖర్గే ధ్వజమెత్తారు. అందుకే పార్లమెంట్ కార్యకలాపాలకు అడ్డు తగులుతోందని ఆరోపించారు. ఆయన గురువారం పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. తాము బుధవారం పార్లమెంట్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయం దాకా శాంతియుతంగా ప్రదర్శన చేపడితే దుర్మార్గంగా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ముందు వరుసలో మహిళా కానిస్టేబుళ్లను ఉంచారని అన్నారు.

కలిసికట్టుగా ప్రభుత్వాన్ని నిలదీద్దాం

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో గురువారం విపక్ష నేతలు సమావేశమయ్యారు. పార్లమెంట్ ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించుకున్నారు. కలిసికట్టుగా ఉంటూ, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్‌తోపాటు డీఎంకే, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, జేడీయూ, జేఎంఎం, ఎండీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, వీసీకే, ఐయూఎంఎల్ తదితర పార్టీల నేతలు ఈ భేటీకి హాజరయ్యారు. ఇదిలా ఉండగా, అదానీ అంశంపై చర్చించాలని, ఈ వ్యవహారంపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో నోటీసులు ఇచ్చారు.

కూలిన చీతా హెలికాప్టర్

ఇద్దరు సైన్యాధికారుల దుర్మరణం

ఈటానగర్: ఇద్దరు సైన్యాధికారులతో ప్రయాణిస్తున్న సైనిక చీతా హెలికాప్టర్ అరుణాచల్ ప్రదేశ్‌లో గురువారం ఉదయం ప్రమాదవశాత్తు కూలింది. ఈ ఘటనలో హెలికాప్టర్ పైలట్‌గా విధుల్లో ఉన్న లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భాను రెడ్డి, కోపైలట్‌గా ఉన్న మేజర్ జయంత్ ప్రాణాలు కోల్పోయారు. దట్టంగా మంచు కమ్ముకున్న మారుమూల మండళ కొండల్లో హెలికాప్టర్ కూలింది. రక్షణ శాఖ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. సాధారణ సన్నద్ధతలో భాగంగా హెలికాప్టర్ అరుణాచల్‌లోని పశ్చిమ కెమాంగ్ జిల్లాలోని సాంగే గ్రామం నుంచి అస్సాంలోని సోనిపట్ జిల్లా మిస్సామరికు తిరుగుపయనమైంది. మార్గమధ్యంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)తో హెలికాప్టర్ సంబంధాలు తెగిపోయాయి. 9.15 గంటల ప్రాంతంలో బంగ్లాజాప్ గ్రామ శివారులోని కొండల్లో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. హెలికాప్టర్ కూలిన ఘటనపై ఆర్మీ కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ మొదలుపెట్టింది.

వీవీబీ రెడ్డి యాదాద్రి జిల్లా వాసి



బొమ్మలరామారం: హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో అసువులు బాసిన ఉప్పల వినయ్ భానురెడ్డి(వీవీబీ) స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం. మండల కేంద్రానికి చెందిన ఉప్పల నర్సింహారెడ్డి ఇద్దరు కుమారుల్లో వినయ్ భానురెడ్డి చిన్నవాడు. వినయ్‌భానురెడ్డి తండ్రి నర్సింహారెడ్డి ఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగరీత్యా కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వినయ్ భాను రెడ్డికి చిన్ననాటి నుంచి అమితమైన దేశ భక్తి. దేశం కోసం విధి నిర్వహణలో తాను మృతిచెందినా శోకించవద్దని తండ్రి నర్సింహా రెడ్డితో తరచూ చెప్పేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. 21 సంవత్సరాలుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తూ లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు. వినయ్ భార్య స్పందన ఆర్మీలో డెంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. వినయ్ మృతితో బొమ్మలరామారం మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎట్టకేలకు గార్సెట్టి ఎంపిక ఖరారు



వాషింగ్టన్: రెండు సంవత్సరాలకుపైగా ఎటూ తేలని భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్ గార్సెట్టి ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. అమెరికా పార్లమెంట్ ఎగువసభలో జరిగిన ఓటింగ్‌లో 52–42 ఓటింగ్ ఫలితంతో గార్సెట్టి నామినేషన్ గండాన్ని విజయవంతంగా గట్టెక్కారు. దీంతో భారత్‌లో అమెరికా రాయబారిగా గార్సెట్టి త్వరలో నియామకం కానున్నారు. తొలిసారిగా 2021 జూలైలో గార్సెట్టిని భారత్‌లో అమెరికా రాయబారిగా నామినేట్ చేస్తున్నట్లు అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. లాస్ ఏంజెలిస్ నగర మాజీ మేయర్ అయిన గార్సెట్టిపై పలు లైంగిక వేధింపులు, ఆధిపత్య ధోరణి ఆరోపణలు ఉన్నాయి. ఇన్నాళ్లూ అమెరికా నూతన రాయబారి వ్యవహారం సందిగ్ధంగా ఉండటంతో చరిత్రలో తొలిసారిగా 2021 జనవరి నుంచి ఇప్పటిదాకా భారత్‌లో అమెరికా రాయబారిగా ఎవరూ లేరు. కాగా, బైడెన్‌కు సన్నిహితుడు నూతన రాయబారిగా వస్తుండటంతో భారత్‌తో సత్సంబంధాలు మెరుగుపడతాయని భారతీయ అమెరికన్లు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఉత్తరకొరియా ఖండాంతర క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా గురువారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. టోక్యోలో జపాన్–దక్షిణ కొరియా నేతల శిఖరాగ్ర సమ్మేళనం ప్రారంభానికి ముందు ఉ.కొరియా ఈ దుందుడుకు చర్యకు పాల్పడటం గమనార్హం. ఉత్తరకొరియా ఈ నెలలో జరిపిన మొదటి ఐసీబీఎం ప్రయోగం కాగా, వారం వ్యవధిలో చేపట్టిన మూడో ఆయుధ పరీక్ష ఇది. ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి గురువారం ఉదయం ప్రయోగించిన ఈ క్షిపణి సుమారు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు వైపు సముద్రజలాల్లో పడిపోయినట్లు దక్షిణ కొరియా ప్రకటించింది.



కశ్మీర్‌లోని బందిపొర జిల్లా గురెజ్ వ్యాలీలో భారీగా మంచు కురుస్తోంది. రంజాన్ పాస్ వద్ద రోడ్డుపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న బీఆర్‌వో సిబ్బంది

జోధా అక్బర్ ఫేమ్ అమన్ ధలివాల్‌పై దాడి

కాలిఫోర్నియా: జోధా అక్బర్‌సహా పలు హిందీ, పంజాబీ సినిమాల్లో నటించిన యువ పంజాబీ నటుడు అమన్ ధలివాల్‌పై అమెరికాలో ఒక ఆగంతకుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఛాతీ, మెడ, తల, భుజంపై పలు చోట్ల తీవ్రంగా గాయపరిచాడు. ఘటన తర్వాత అమన్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాణాపాయం ఏమీలేదని వైద్యులు తెలిపినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. గురువారం ఉదయం కాలిఫోర్నియా నగరంలోని గ్రాండ్ ఓక్స్ ప్రాంతంలోని ఒక జిమ్‌లో కసరత్తు చేస్తున్న అమన్‌పైకి ఒక ఆగంతకుడు కత్తితో దాడి చేసి బందీగా పట్టుకున్నాడు. తాగడానికి నీళ్లు కావాలని అక్కడి వారిని ఆగంతకుడు బెదిరించిన సమయంలో ఒక్కసారిగా అమన్ ఎదురుతిరిగి అతడిని పట్టుకోబోయాడు. ఈ ఘర్షణలో అమన్ గాయాలపాలై రక్తసిక్తమయ్యాడు. వెంటనే అప్రమత్తమైన జిమ్‌లోని తోటివారు ఆ ఆగంతకుడిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. అమన్‌పై ఆగంతకుడు దాడి దృశ్యం ప్రస్తుతం వైరల్‌గా మారింది.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు 3%

- కానీ వాటిల్లో 96 శాతం కేసుల్లో నేరనిరూపణ
- కేసులు, తదితర వివరాలు నివేదించిన ఈడీ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ). విపక్ష నేతలనే ఈడీ లక్ష్యంగా చేసుకుంటోందన్న ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో తమ కేసుల దర్యాప్తు తదితర వివరాలను సంస్థ తాజాగా ప్రకటించింది. తాము నమోదుచేసిన కేసుల్లో ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన కేసులు కేవలం 2.98 శాతమేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్పష్టంచేసింది. అయితే మనీలాండరింగ్ చట్టం కింద నమోదైన ఈ 2.98 శాతం కేసుల్లో నేర నిరూపణ శాతం ఏకంగా 96 శాతం ఉండటం గమనార్హం. మనీ లాండరింగ్ నిరోధక చట్టం, ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ చట్టం, పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల చట్టం(ఎఫ్ఈఓఏ)ల కింద ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు నమోదైన మొత్తం కేసుల తాలూకు తాజా స్థితిగతులను ఈడీ విడుదలచేసింది.

ఈడీ గణాంకాల ప్రకారం...

- మనీ లాండరింగ్ చట్టం అమల్లోకి వచ్చాక ఇప్పటిదాకా మొత్తంగా 5,906 ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్– ఎఫ్ఐఆర్ లాంటిదే)లు నమోదుకాగా వాటిలో ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలపై దాఖలైన కేసులు కేవలం 176 (2.98 శాతం) ఉన్నాయి.
- అన్నింటిపై కోర్టుల్లో మొత్తంగా 1,142 అభియోగ పత్రాలు నమోదుచేశారు. 513 మందిని అరెస్ట్‌చేశారు. కేవలం 25 కేసుల విచారణ పూర్తయింది. 24 కేసుల్లో నిందితులు దోషులుగా తేలారు. అంటే మొత్తంగా 45 మందిని కోర్టులు దోషులుగా నిర్ధారించింది. అంటే 96 శాతం నేరనిరూపణ జరిగింది.
- 5,906 కేసుల్లో 531 కేసులకు సంబంధించి మాత్రమే సోదాలు, ఆకస్మిక తనిఖీలు జరిగాయి. అంటే కేవలం 9 శాతం కేసుల్లోనే సోదాలు చేశారు.
- మొత్తం కేసుల్లో ఇప్పటిదాకా ఆస్తుల జప్తు/అటాచ్‌మెంట్‌కు సంబంధించి 1,919 ఉత్తర్వులను ఈడీ జారీచేసింది. రూ.1,15,350 కోట్ల ఆస్తులను జప్తుచేసింది.
- ఫెమా చట్టం కింద దాదాపు 34 వేల కేసులు నమోదయ్యాయి.
- ఎఫ్ఈఓఏ చట్టం కింద 15 మందిపై కేసులు నమోదుకాగా తొమ్మిది మందిని పరారైన నేరగాళ్లుగా ప్రకటించారు.

ఫ్రాన్స్‌లో ప్రత్యేక అధికారాలతో పెన్షన్ బిల్లుకు ఆమోదం

పారిస్: ఫ్రాన్స్ ప్రభుత్వం పెన్షన్ సంస్కరణల్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతోంది. దేశ పార్లమెంటులో ఓటింగ్ జరగకుండానే బిల్లు చట్టరూపం దాల్చేలా ప్రత్యేకమైన రాజ్యాంగ అధికారాన్ని పొందేలా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చర్యలు తీసుకున్నారు. రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్ల నుంచి 64 సంవత్సరాలకు పెంచుతూ తీసుకుని వచ్చిన ఈ బిల్లు నేషనల్ అసెంబ్లీలోని దిగువ సభలో ఆమోదం పొందే అవకాశం లేదు. అందుకే ఓటింగ్‌కి కొన్ని నిమిషాల ముందు ప్రధానమంత్రి ఎలిజబెత్ బోర్న్ చట్టసభలు ఆమోదించకుండానే బిల్లు చట్టంగా మారేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 49.3ని వినియోగించుకున్నారు. ఈ కొత్త పెన్షన్ బిల్లుపై గత కొద్ది రోజులుగా ఫ్రాన్స్‌లో ఆందోళనలు మిన్నంటుతున్నాయి.

కొలంబియా బొగ్గు గనిలో పేలుడు..11 మంది దుర్మరణం

బొగొటా: కొలంబియాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో 11 మంది చనిపోయారు. లోపలి చిక్కుకుపోయిన మరో 10 మంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సుటటౌసా మున్సిపాలిటీ సమీపంలోని గనిలో మంగళవారం రాత్రి సంభవించిన పేలుడు ప్రభావం టన్నెళ్ల ద్వారా అనుసంధానమై ఉన్న మరో నాలుగు గనులపైనా పడిందని అధికారులు తెలిపారు. మీథేన్ గ్యాస్ ఒత్తిడే గనిలో పేలుడుకు కారణమన్నారు.



చేరదీస్తారు.. చేతికందిస్తారు

తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలను జిల్లా సంక్షేమ అధికారులు చేరదీసి పెంచి పెద్దచేసి.. దత్తత ఇస్తున్నారు. 8లో▸



ఎన్‌వైకే.. పిలుస్తోంది...

నెహ్రూ యువకేంద్రంలో వలంటీర్లుగా చేరేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.24 వరకు గడువు ఉంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.0/20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం పడే అవకాశముంది. స్వల్పంగా ఉక్కపోత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉద్యోగులను అభినందించిన ఈడీ



కరీంనగర్: కరీంనగర్–2 డిపోకు చెందిన ఉత్తమ, ఆదర్శ ఉద్యోగులను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం శాలువాలతో సత్కరించారు. ఈడీ మాట్లాడుతూ రాష్ట్రంలో 25 డిపోలు లాభాల్లో నడుస్తున్నాయని, ఈ డిపోల జాబితాలలో కరీంనగర్–2 డిపో కూడా చేరే విధంగా ప్రతీ ఉద్యోగి పనిచేయాలని అన్నారు. ఉత్తమ ఉద్యోగులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కె.కనుకయ్య, ఎస్.శంకర్, జె.రాధ(కండక్టర్లు), కె.జీ.సాగర్, పి.రాజయ్య, డి.వి.సాగర్(డ్రైవర్లు),కెఎస్.నారాయణ, ఎం.డి.సలీం(మెకానిక్)లను శాలువాలతో సత్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ భీంరెడ్డి, డిపో మేనేజర్ మల్లయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి యుగేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు నాగభూషణం, బోయేజ్ కుమార్, రాజేశం, కమల, బాలయ్య ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రధాన ఆస్పత్రిని గురువారం కాయకల్ప బృందం సందర్శించింది. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ప్రసూతి విభాగాల నిర్వహణ, శిశువులు, ఇతరరోగులకు ఆధునిక వైద్యం, ఆస్పత్రి పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనం పరిరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. మెరుగైన ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని గ్రేడ్లు, పురస్కారాలు అందించనున్నారు. బృందంలో డాక్టర్ రఘుపూజారి, డాక్టర్ రహమాన్, డాక్టర్ ప్రశాంత్, సిస్టర్ స్టెల్లా ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల పాల్గొన్నారు.

ఇంటర్‌లో ముగ్గురు డిబార్



కరీంనగర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం లాంగ్వేజ్–2 పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 12,743 విద్యార్థులకు గానూ 268 మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. 12,475 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,534 మందిగానూ 92మంది గైర్హాజరుకాగా 1,442 మంది హాజరయ్యారు. మొత్తంగా 14,277 మంది విద్యార్థులకు గానూ 360 మంది గైర్హాజరు అయ్యారు. 13,917 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డీఐఈవో తెలిపారు. జమ్మికుంటలోని ప్రవంతి జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, కరీంనగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు..

శాతవాహన యూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ వ్యాప్తంగా జరుగుతున్న డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో గురువారం నలుగురు డిబార్ అయినట్లు ఎస్‌యూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఎన్.వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు. హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఇద్దరు, హుజూరాబాద్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒక్కరు, జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఒక్కరు మొత్తం నలుగురు డిబార్ కాగా వారిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్ 3వ విడత ప్లాట్లకు ఈ నెల 17నుంచి 19వరకు వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. నగరంలోని వాసర గార్డెన్స్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యక్ష వేలం ఉంటుందని వివరించారు. మూడు రోజుల పాటు ప్లాట్ల ప్రత్యక్షవేలం కార్యక్రమాన్ని నిర్వహించనుండగా 157 ప్లాట్లను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు దరఖాస్తుతో పాటు దరావత్తు సొమ్ము రూ.10వేలు డీడీ తీయాలని, రాజీవ్ స్వగృహ దరఖాస్తుదారులు ఒరిజినల్ ఈ సేవ రసీదును సమర్పించి వేలంలో పాల్గొనవచ్చని ప్రకటనలో వివరించారు.

టీచకుడు!

మహిళా సిబ్బందిని వేధిస్తున్న ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

- నిత్యం ఉద్యోగినుల శరీరాలు తాకేందుకు తహతహ
- ఆగడాలు భరించలేక వీడియోలు తీసిన సిబ్బంది
- వీడియోలను కలెక్టర్ కార్యాలయానికి పంపిన 'సాక్షి'
- సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన కలెక్టర్ యాస్మిన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అతనో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అతను దారి తప్పాడు. తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సింది పోయి.., తోటి మహిళా సిబ్బందిపై కన్నేస్తున్నాడు. తన కోరిక తీర్చాలంటూ పరోక్షంగా వేధిస్తున్నాడు. మాట వినకుంటే మహిళా సిబ్బందిని వేధిస్తూ తన ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. మొత్తానికి 'కామా తురాణం న భయం..' అన్న మాటలను మరోసారి తన చేష్టలతో రుజువు చేస్తున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తోటి మహిళా సిబ్బందిని తన కామకోరికలు తీర్చాలంటూ వేధించే ఈ కీచక గురువుపై ఉన్నతాధికారులకు ఇటీవల వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అతని తప్పులను ఆధారాలతో సహా అటు హైదరాబాద్‌కు, ఇటు జగిత్యాల ఉన్నతాధికారులకు అందించారు. అతని ఆగడాలకు సంబంధించిన ఆధారాలను 'సాక్షి' కూడా కలెక్టర్‌కు పంపడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.



మహిళా సిబ్బంది మీద చేయి వేస్తున్న శ్రీనివాస్

తాకేందుకు తహతహ..

ఈ వ్యవహారంలో కీచక గురువు పేరు ఎం.శ్రీనివాస్. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం ఇటిక్యాలలోని మోడల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇతను మహిళా సిబ్బందితో విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. మహిళలు ఒంటరిగా దొరికితే ఏదో వంకతో తాకేందుకు తహతహలాడుతున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ 'ఇదేం పాడు బుద్ధి'' అని మిగిలిన సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొత్తలో అతనిది కేవలం మితిమీరిన క్రమశిక్షణ అనుకున్నామని.. కానీ, పోను పోను అతని అసలు ఉద్దేశం అర్థమైందని చెబుతున్నారు. తన దారికి రాని మహిళలను క్రమశిక్షణ పేరుతో వేధిస్తున్నాడని మిగిలిన టీచర్లు వాపోతున్నారు. నిమిషం ఆలస్యమైనా మెయిన్ గేట్లు వేసేస్తున్నాడని, అందరి ముందు పరువు తీసేలా కించపరుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురు తిరిగితే తమను రకరకాల కారణాలు చెప్పి వేధిస్తున్నాడని, పనిచేసే చోట ఇలాంటి వాతావరణం తమకు తీవ్ర ఆందోళన కలగజేస్తోందని వాపోతున్నారు. ఒక దశలో అతని ఆగడాలు భరించలేక ఏకంగా అతని పైత్యపు చేష్టలను వీడియో తీశారు.

ఫిర్యాదులో ఇంకేమున్నాయంటే..?

- స్టాఫ్ రూంలో మహిళలు ఒంటరిగా కనిపిస్తే వారిని తాకేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఫిర్యాదు కాపీకి అందజేశారు.
- పదో తరగతి విద్యార్థుల నుంచి నిర్ధారిత ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తున్నాడు.
- విద్యార్థుల నుంచి పారిశుద్ధ్య చార్జీలు అంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలా వసూలు చేసిన మొత్తాన్ని కాలేజీ ఖాతాలో జమచేయడం లేదు.
- చిన్న కారణాలకే విద్యార్థులను ఇష్టానుసారంగా గొడ్లను బాదినట్లు బాదుతున్నాడు. ఇటీవల ఓ విద్యార్థిని చావబాదితే.. అతని తల్లిదండ్రులు పాత కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు

శ్రీనివాస్ తిక్క చేష్టలపై అతని కింద పనిచేస్తున్న సిబ్బంది మొత్తం కలిసి ఇటీవల ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అతను పాఠశాలలో ప్రవర్తిస్తున్న తీరును క్షుణ్ణంగా వివరిస్తూ.. ఫిబ్రవరి ఆఖరు వారంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మోడల్ స్కూల్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లకు రిజిస్టర్‌పోస్టు ద్వారా కలెక్టర్ జగిత్యాల, డీఈవోలకు నేరుగా ఫిర్యాదులను అందజేశారు. తమను స్వేచ్ఛగా పనిచేయకుండా చేస్తోన్న సదరు ప్రిన్సిపాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తను కాలేజీలో మహిళలను వేధిస్తుండగా తీసిన వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జతచేశారు.

సస్పెండ్ చేస్తున్నాం: కలెక్టర్ యాస్మిన్ భాషా

ఈ నేపథ్యంలో సదరు గురువు మహిళలను కళాశాలలోనే అసభ్యకరంగా తాకుతున్న వీడియోలు 'సాక్షి'కి చేరాయి. ఈ వీడియోలను జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషాకు 'సాక్షి' చేరవేసింది. ఈ దృశ్యాలను చూసిన కలెక్టర్ స్పందించారు. వెంటనే సదరు మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సారార్ కళాశాలతో పోస్టల్‌శాఖ ఒప్పందం



ప్రిన్సిపాల్ రామకృష్ణకు ఎంవోయూ అందిస్తున్న పోస్టల్ అధికారులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలతో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ)వారు గురువారం అవగాహన ఒప్పందం(ఎంవోయూ)కుదుర్చుకున్నారు. ఐపీపీబీ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఎస్సారార్‌కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు బ్యాంకింగ్ నైపుణ్యాలతో పాటు ఇంటర్న్‌షిప్ అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ తెలంగాణ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోవిందరాజ్‌లు మాట్లాడుతూ.. బ్యాంకింగ్ పరిశ్రమలో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఇంటర్న్‌షిప్‌లో భాగంగా బ్యాంకు అవసరమైన నైపుణ్యాలను అందజేస్తుందని తెలిపారు. అనంతరం ఎంవోయూను ప్రిన్సిపాల్ రామకృష్ణకు ఒప్పందం అందించారు. కరీంనగర్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రాజేశ్ తొర్తి, మేనేజర్ రేవతి కొలుగూరి కదా, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ భిక్షపతి, అధ్యాపకులు ప్రసాద్, చంద్రమౌళి, శిరీష, అరవింద్, నర్మద, మల్లేశం, రాజు, రాములు, మానస, గౌతమి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ ఎల్.సుబ్బరాయుడు హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో గురువారం కమిషనరేట్‌కేంద్రంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. సీపీ మాట్లాడుతూ.. మద్యంతాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి, ప్రాణాలుపోయే అవకాశం ఉందని అన్నారు. కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడిన వారి లైసెన్సులు రద్దుచేసేందుకు సిఫారసు చేస్తామని అన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే దుకాణాదాలపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. అనంతరం మందుబాబులతో మళ్లీ మద్యంతాగి వాహనాలు నడుపమని ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్, జి.చంద్రమోహన్, ఏసీపీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐలు తిరుమల్, నాగార్జునరావు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీ ఎల్.సుబ్బారాయుడు

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారితోపాటు నంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు సరిగాలేని వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి 11గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. పట్టుబడినవారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తామని పోలీసులు తెలిపారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో జువేరియా ప్రకటించారు. కరీంనగర్ నగరంలోని 1,6,8,12,15,18,41,45,46,49,53,56 డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణం 4,16వ వార్డులు, అదే మండలంలోని కాట్రపల్లి, సిరసపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 9వ వార్డు, అదే మండలంలోని గంట్రపల్లి, మడిపల్లి, వీణవంక మండలం ఎలబాక, కొండపాక, కనపర్తి, చిగురుమామిడి మండలం రేకొండ, ఇందుర్తి, చొప్పదండి పట్టణం 11వ వార్డు, అదే మండలంలోని కాట్నేపల్లి, రాగంపేట, ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి, మల్యాల, గంగాధర మండలం గర్శకుర్తి, ఇస్లాంపూర్, ఉప్పరమల్యాల, రామడుగు మండలం దేశరాజ్‌పల్లి, వన్నారం, కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, మొగ్దుంపూర్, నగునూర్, మానకొండూరు మండలం ముంజంపల్లి, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, అమ్మనగుర్తి, కేశవపట్నం మండలం వంకాయగూడెం, లింగాపూర్, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, నల్లగొండ, గన్నేరువరం మండలం గోపాల్‌పూర్‌లో శిబిరాలు కొనసాగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త వైరస్ అంటూ అసత్య ప్రచారాలు నమ్మొద్దు



డాక్టర్ రత్నమాల

కరీంనగర్‌టౌన్: జిల్లాలో కొత్తరకం వైరస్ హెచ్3ఎన్2 ఇన్ఫ్లూయెంజా కేసులు ఇప్పటి వరకు నమోదు కాలేదని జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల స్పష్టం చేశారు. గురువారం ఆమె విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. జిల్లాలో కొత్తవైరస్ కేసులు నమోదవుతున్నాయనే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. కేవలం ఫ్లూ వైరస్ కారణంగా జ్వరాలు వస్తున్నాయని, ఆసుపత్రిలో జాయిన్ అయిన కేసుల్లో ఫ్లూ లక్షణాలు మాత్రమే ఉన్నాయని వెల్లడించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారు మాస్కు తప్పనిసరిగా ధరించాలన్నారు. అలా చేయడం వల్ల వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

ఆరుగురికి కరోనా పాజిటివ్

కరీంనగర్ టౌన్: జిల్లాలో ఏడాది తర్వాత మళ్లీ కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. గురువారం నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో ఆరు పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 69 మందికి ఆర్టీపీసీఆర్ ద్వారా కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆరుగురికి కరోనా పాజిటివ్‌గా తేలినట్లు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అధికారులు వెల్లడించాయి.

రుద్రారంలో ప్లాస్టిక్ బియ్యం కలకలం!



రామడుగు:మండలంలోని రుద్రారం గ్రామంలో ప్లాస్టిక్ బియ్యం కలకలంగా మారాయి. గ్రామంలోని ఓ రేషన్‌షాపులో గ్రామస్తులు కొందరు బియ్యం తీసుకున్నారు. ఇంటికి వచ్చి చూడగా.. అందులో ప్లాస్టిక్ బియ్యం కలిసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఓ వ్యక్తి తనబియ్యంలో నుంచి ప్లాస్టిక్ రూపంలో ఉన్న బియ్యాన్ని ఫొటో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో ప్లాస్టిక్ బియ్యం కలకలం కలిగించాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామంలోకి వెళ్లి రేషన్ బియ్యాన్ని పరిశీలించినట్లు తెలిసింది.

విద్యానిధి అందుకో.. విదేశాల్లో చదువుకో

- సంక్షేమశాఖల ద్వారా ఆర్థికసాయం
- రూ.20లక్షల వరకు రుణ సదుపాయం
- వినియోగించుకోండి: అధికారులు



కరీంనగర్: డిగ్రీ తరువాత విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలని ఆసక్తి ఉండి, ఆర్థికంగా వెనకబడిన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలవారికి విదేశీ విద్యానిధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. రూ.20లక్షల రుణాన్ని రెండువిడతల్లో అందించి వారి అభివృద్ధికి తోడ్పాటునిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మైనారిటీలకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి, బీసీలకు మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకాలు భరోసానిస్తున్నాయి. 2014–15 ఏడాది నుంచి ఎస్సీ, ఎస్టీలకు, 2015–16నుంచి మైనార్టీలకు, 2018నుంచి బీసీలకు ఈ పథకాలు అమలు చేస్తున్నారు. అవగాహన లేకపోవడంతో ఈ పథకాల ద్వారా విదేశాలకు వెళ్లి చదివింది కొందరే.

చేయూతనిస్తున్నా... అంతంతే...

విదేశీవిద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఈ పథకాలను సద్వినియోగం చేసుకుంటుంది కొందరే. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లయినా ఇప్పటివరకు విదేశాలకు వెళ్లింది ఏడుగురే. ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా 18మంది, మహాత్మా జ్యోతిబాపులే విద్యానిధి పథకానికి జిల్లానుంచి 12మంది ఎంపికైనట్లు సమాచారం. ప్రభుత్వం విద్యానిధి పథకాలతో విదేశీవిద్యను ప్రోత్సహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఇది అందరికీ దక్కడం లేదు. జిల్లాలో 1500పైగా ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. విద్యాసంవత్సరం ముగిసేదశలో సంక్షేమశాఖల పరిధిలోని అధికారులు, కళాశాలల యాజమాన్యం విదేశీవిద్యపై అవగాహన కల్పిస్తే చాలా మంది విదేశాల్లో చదువుకునేందుకు ఆసక్తి కనబరిచే అవకాశముంది.

పది దేశాల్లోనే పథకం అమలు..

ఈ పథకం ద్వారా చదివేందుకు మనం దేశం నుంచి పదిదేశాలకే అనుమతిస్తున్నారు. ఇందులో దక్షిణ కొరియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశాల్లో మాత్రమే ఉన్నతవిద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ఇక్కడ వైద్య ,విద్య, ఇంజినీరింగ్, మేనేజ్మెంట్, ప్యూర్‌సైన్స్, వ్యవసాయం, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, తదితర కోర్సుల్లో పీజీ చేయడానికి అవకాశం ఉంటుంది.

అర్హతలు ఇలా...

- ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్ర కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- ఈ కోర్సుల్లో 60శాతానికి పైగా మార్కులు సాధించాలి.
- టోఫెల్‌లో 60శాతం. ఐఈఎల్టీఎస్ 80మార్కులు, జీఆర్ఈ, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి పీఈటీలో 50శాతం అర్హత మార్కులు ఉన్నవారికి అవకాశం.
- విద్యార్థుల వయసు 35 ఏళ్లలోపు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలి.

దరఖాస్తుకు అవసరమయ్యే ధ్రువపత్రాలు ఇవీ..

కులం, ఆదాయం, జనన ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు, పదో తరగతి, డిగ్రీ, ఇంటర్, పీజీ మార్కుల జాబితాలతోపాటు టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌ఈఆర్టోస్‌ఈ, జీమ్యాట్, పీఈటీ అర్హత కలిగి ఉండాలి. విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి సంబంధిత కళాశాల ప్రవేశ అనుమతిపత్రం, ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, వీటి ఆధారంగా మీసేవా కేంద్రంలో గానీ, ఆన్‌లైన్‌లో తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.10 విలువైన నాన్ జ్యూడిషియల్ స్టాంపును అతికించి రిజిస్ట్రార్ సంతకంతో కూడిన పత్రాన్ని ఆదాయ ధ్రువపత్రానికి జత చేసి దరఖాస్తు సమర్పించాలి. ఆయా సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శుల నేతత్వంలోని కమిటీ సభ్యులు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. గడువు అంటూ ఉండదు. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

విద్యార్థులకు చక్కని అవకాశం



ప్రభుత్వం అమలు చేస్తున్న విదేశీ విద్యానిధి పథకాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా నుంచి ఇప్పటి వరకు విదేశాలకు వెళ్లిన ఎస్సీ విద్యార్థులు ఏడుగురు ఉన్నారు. కలెక్టర్‌తోనూ చర్చించి జిల్లా కేంద్రంలోని ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు ఈ పథకాలపై అవగాహన కల్పించి విదేశాల్లో చదువుకునేలా కృషి చేస్తాం.

– నేతానియల్, డిప్యూటీ డైరెక్టర్, ఎస్సీ అభివృద్ధి సంక్షేమశాఖ అధికారి

జిల్లావ్యాప్తంగా భారీవర్షం



కరీంనగర్‌లో గురువారం సాయంత్రం కురుస్తున్న వర్షం

కరీంనగర్‌అర్బన్/గన్నేరువరం: కొద్దిరోజులుగా వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం జిల్లాకేంద్రంతో పాటు తిమ్మాపూర్, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, రామడుగు, మానకొండూరు తదితర ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ నెల 19వరకు మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించగా గురువారం జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కరీంనగరంలోని తెలంగాణచౌక్, కలెక్టరేట్ రోడ్డు, కట్టరాంపూర్, ఆటోనగర్ తదితర ప్రాంతాలదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గన్నేరువరం మండలంలో మొక్కజొన్న, మామిడి తోటలకు అపారనష్టం జరిగింది.



బో'నమో' తల్లీ

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీలో మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తల్లులకు బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనంతో ఆలయానికి బయలుదేరి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు, డప్పుచప్పుల్లు, డీజే మోతలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఒగ్గు డోలు దరువులు, బైండ్ల వాయిద్యాలు అలరించాయి. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

క్లుప్తంగా

రూ.50 తగ్గిన పత్తి ధర



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.50 తగ్గింది. బుధవారం క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400 పలుకగా, గురువారం రూ.7,350 పలికింది. గురువారం మార్కెట్‌కు 93 వాహనాల్లో 1,366 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో 24 మంది రైతులు 32 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.5,500 ఖరీదు వ్యాపారులు చెల్లించారు. మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

దరఖాస్తు గడువు పెంపు

తిమ్మాపూర్(మానకొండూర్): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ (మహాత్మ జ్యోతిబాపూలే) గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు తేదీ ఈ నెల 20 వరకు పొడిగించారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కేంద్రం (సీవోఈ) ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పల్లెపు వెంకటస్వామికి విద్యుత్ చౌర్యం కేసులో జైలుశిక్ష పడ్డట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. వెంకటస్వామి 2016లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా మొదటి తప్పుగా పరిగణిస్తూ రూ.వెయ్యి జరిమానా విధించి వదిలేశారు. కాగా 2017లో మళ్లీ విద్యుత్ అక్రమంగా వినియోగిస్తూ పట్టుపడగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. జగిత్యాల జిల్లా మొదటి అదనపు కోర్టు న్యాయమూర్తి పల్లెపు వీరయ్య కేసు పూర్వపరాలు పరిశీలించారు. నిందితుడు వెంకటస్వామి విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఆరునెలల జైలు శిక్ష లేదా రూ.15,966 చెల్లించాలని తీర్పు చెప్పారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చేరదీస్తారు.. చేతికందిస్తారు

- దత్తతకు చిరునామా శిశుగృహ
- ఇప్పటి వరకు 72 మంది పిల్లల దత్తత



బాలసదనం భవనం

కరీంనగర్: గ్రహణ మొర్రి, బలహీనంగా ఉన్న వారు, తప్పిదాల వల్ల పుట్టిన చిన్నారులను కొంత మంది చెత్తకుప్పల్లో, బస్టాండ్‌లలో, మాతాశిశు కేంద్రాల వద్ద వదిలేసి వెళ్తుంటారు. ఈనేపథ్యంలో వారిని చేరదీసి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెంచి పెద్ద చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన దంపతులకు దత్తత ఇస్తారు. వీరే కాకుండా ఇతరత్రా కారణాల వల్ల తల్లిదండ్రులు వదిలించుకున్న పిల్లలనూ శిశుగృహ అక్కున చేర్చుకుంటోంది. మరోవైపు సంతాన భాగ్యం లేని దంపతులకు దత్తత ఇచ్చి వారి కల నెరవేరుస్తోంది. సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏటా రెండుసార్లు దత్తత మాసోత్సవాలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో 'ఊయల'

అనారోగ్యం, పోషణ భారంతో పిల్లల్ని పోషించలేమనుకున్న తల్లిదండ్రులు, అవాంఛిత గర్భం ద్వారా పుట్టిన పిల్లలను పెంచటానికి ఇష్టపడనివారు, ఎక్కువ మంది ఆడపిల్లలు ఉన్నవారు, రోడ్డు పక్కన, ముళ్లకంచెలు, చెత్తకుప్పల్లో శిశువులను నిర్లక్ష్యంగా వదిలివేయటం వంటి ఘటనలు సమాజంలో అప్పడప్పుడు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇలాంటి పిల్లలను ప్రభుత్వాసుపత్రిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలోగల ఊయలలో ఎవరైనా వేయొచ్చు. అనాథ పిల్లలు రోడ్ల మీద కనిపిస్తే చైల్డ్ లైన్ 1098కు సమాచారం ఇస్తే చాలు ఆ చిన్నారులకు శిశుగృహలో రక్షణ కల్పిస్తారు.

దత్తతకు దరఖాస్తు ఇలా..

- పిల్లలు లేని దంపతులకు మహిళా శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో దత్తత కార్యక్రమం నిర్వహిస్తారు.
- జిల్లాలో 2010లో శిశుగృహ దత్తత కార్యక్రమం ప్రారంభించారు.
- సీఏఆర్ నిబంధనల ప్రకారం పాన్, ఆధార్, వయస్సు, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలు, మెడికల్ సర్టిఫికెట్లు, దంపతుల ఫొటో, సింగిల్ పేరెంట్ అయితే విడాకుల డిక్రీ/మరణ ధ్రువపత్రం, ఇద్దరు వ్యక్తుల సిఫార్సు లేఖలు ఉన్న పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- డాక్యుమెంట్లు అప్‌లోడ్ అయిన తర్వాత 3 సెట్ల కాపీలు, రూ.6,000 విలువగల డీడీని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి.
- సీనియారిటీ, అర్హత ప్రకారం కోర్టు ఉత్తర్వులు, బర్త్ సర్టిఫికెట్‌తో పిల్లలను దత్తత ఇస్తారు. దత్తత వెళ్లిన పిల్లల సమాచారం ఆరునెలలకు ఒకసారి సేకరించి నివేదిక తయారుచేస్తారు.

చట్టపరంగా దత్తత శ్రేయస్కరం



దత్తత చట్టప్రకారం జరిగితే భవిష్యత్‌లో సమస్యలు రావు. ఆసక్తి ఉన్న దంపతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల జిల్లా కార్యాలయంలో సంప్రదించాలి. దత్తత మాసోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌లో దత్తత నమోదు విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. అనైతిక విధానంలో పిల్లలను పెంచుకోవద్దని సూచనలు ఇస్తున్నాం. 2010 నుంచి ఇప్పటి వరకు శిశుగృహ నుంచి 72 మంది పిల్లలను దత్తత ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం ఆరుగురు చిన్నారులు శిశుగృహలో ఉన్నారు.

– సబితాకుమారి, జిల్లా సంక్షేమ అధికారి

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ అంశాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ మెంబర్ మల్యాల రాకేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ శాతవహన యూనివర్సిటీ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, నిరుద్యోగులు వేలకు వేలు ఫీజులు కట్టి తిండి తిప్పలు మానేసి కుటుంబాలకు దూరంగా ఉంటూ కోచింగ్ తీసుకున్నారని, ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకొని పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన చెందారు. నిరుద్యోగుల ఆశలను పేపర్ లీకేజీ అడియాశలు చేసిందన్నారు. వెంటనే సిట్టింగ్ జడ్జి, సీబీఐతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే విద్యార్థులు, నిరుద్యోగులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజునందు, రమేశ్, చందు, కిరణ్, శివ, అబ్దుల్ రెహ్మాన్, శేషాద్రి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ST. JOHN'S ENGLISH MEDIUM HIGH SCHOOL
2-10-1764, Bhagyanagar, Karimnagar
Contact No. (0878) 2256367

St. John's English Medium High School is highly prestigious with 60 years of reputation with academic excellence, **Opened New Section** in the same premises. Therefore, we require young, dynamic and trained teachers.

WANTED TEACHERS

Applications are invited from eligible trained candidates who are **basically from English Medium** to teach the following subjects:

Admissions are in Progress 2023-24

- School Assts. - English, Mathematics,
- Physical Science, Social Studies
- Telugu Pandit Gr-I ✣ Hindi Pandit Gr-1
- SGT - English, Mathematics, Science, Social Studies.
- K.G. (Degree, PP. Trd)
- Computer Lab. Assistant ✣ Office Assistant
- Wanted Qualified Co-Ordinators (Retd.)

Can submit their applications along with Xerox copies of all certificates to the St. John's E.M. School Office on or before 25-03-2023.

Sd/- Principal.

ప్రోగ్రాం ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ



శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ అధికారులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవహన యూనివర్సిటీలో గురువారం అధికారిక విద్య, క్రమమైన ఉపాధి లేని యువతపై సర్వే షెడ్యూల్‌కి సంబంధించిన ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎస్సారార్ ఎన్ఎస్ఎస్ అధికారి బి.సురేశ్‌కుమార్, జగిత్యాల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి పి.తిరుపతి న్యూఢిల్లీలో బుధవారం శిక్షణ తీసుకున్నారు. వీరిరువురి ఆధ్వర్యంలో శాతవాహన పరిధిలోని 30 మంది ఎన్ఎస్ఎస్ పీవోలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అధికారులు ఏడు రోజులు వివిధ గ్రామాలను సందర్శించి యువత, నిరుద్యోగ అంశాలపై పరిశోధన చేయనున్నారు. శాతవాహన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ జరీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శ్రావణ్ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాపాక శ్రావణ్(24) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. శ్రావణ్ కరీంనగర్‌లో ఓ లేత్ మిషన్‌లో ఆరేళ్లుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. బుధవారం అన్నారంలో జరిగిన బరాత్ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రివేళ తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం పెట్రోల్‌బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాత్రి ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. గురువారం ఉదయం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి రాజేశ్వరి, తండ్రి ఓదెలు, ఇద్దరు అక్కలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజకుమార్ తెలిపారు.

చెన్నైలో రత్నాపూర్ వాసి..

రామగిరి(మంథని): మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కలికోట శ్రీనివాస్(35) చెన్నైలో అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఆదివారం రాత్రి స్వగ్రామం రత్నాపూర్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో చెన్నై రైల్వేస్టేషన్ సమీపంలో అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారంతో బంధువులు బుధవారం రాత్రి చెన్నైకి బయలుదేరారు. మృతుడికి భార్య సువర్ణ, కుమారులు అక్షిత్ (3), మోక్షిత్ (2), కూతురు (1)ఉన్నారు. శ్రీనివాస్ మృతికి గల కారణాలు తెలియరావడం లేదు.

రేషన్ బియ్యం పట్టివేత



మంథని: అక్రమంగా 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని నాగారం శివారులో గల సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గురువారం వేకువజామున పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 55 రేషన్ బియ్యం సంచులు కనిపించాయి. డ్రైవర్ బోగి సర్వేశ్‌ను విచారించగా మంథని మున్సిపాలిటీ పరిధి గంగాపురి, ఇతర గ్రామాల్లో ప్రజల నుంచి పది రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి రాచర్ల రమేశ్ అనే వ్యాపారి సూచన మేరకు మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు చెప్పాడు. పట్టుబడిన బియ్యం, ఆటోను స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ మల్లయ్య, పీసీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన జీఎంకు సన్మానం

రామగిరి/గోదావరిఖని: సింగరేణిలో జీఎం(పర్సనల్)గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎ.ఆనందరావును గురువారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు సన్మానించారు. ఈసందర్భంగా సెంటినరీ కాలనీలోని జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ, వివిధ హోదాల్లో సుమారు 35 ఏళ్లు సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తించిన ఆనందరావు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమన్నారు. సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీవైపీఎం కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్జీ–1 జీఎం కె.నారాయణ తన కార్యాలయంలో ఆనందరావును ఘనంగా సన్మానించారు.

ఎన్నికలపై ఉన్న శ్రద్ధ కార్మికులపై లేదు



గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యలపై లేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణ అన్నారు. గురువారం జీడికే–11ఏ గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బడా పెట్టుబడిదారులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈసందర్భంగా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 18,19 తేదీల్లో జరిగే ఐఎఫ్‌టీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, ఎం.కొమురయ్య, పి.మొండయ్య, చింతల శేఖర్, మొగిలి, ఎన్‌సీ బాబు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ కరీంనగర్ బొమ్మకల్ క్రిష్ణనగర్, కళ్యాణ్ గార్డెన్స్ ఎదురు గల్లీలో ఒక గుంట విస్తీర్ణంలో గల G+1 బిల్డింగ్ అమ్మబడును. డైరెక్ట్ ఓనర్. సెల్: 9502292232 [K-11536]

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-1773]

ASTROLOGY

■ శ్రీ బాలాజీ అనుగ్రహ జ్యోతిష్య పీఠం పండిట్: శ్రీ బాలాజీ అనుగ్రహ ఆరదనతో విద్య, ఉద్యోగం, భార్యా భర్తల గొడవలు, కోర్టు కేసులు, వ్యాపారం, సంతానం, సమస్యలు ఎలాంటి సమస్యలు ఉన్న ఫోన్ ద్వారా పరిష్కారం. Ph: 9902893454 [H-793586]

WANTED

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000–20000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9030007628 [G-795222]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21,000 + రూం + భోజనం ఫ్రీ. సంప్ర: 6281342090, 9949857816. [WA-6922]

FACULTY TEACHERS

■ Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-1001]

■ మాదాపూర్‌లో ఇంటిపని, వంటపని చేసుకొని సీనియర్ సిటిజెన్‌ను చూసుకోవటానికి 40–55 వయసుగల 10వ తరగతి చదివిన మగ మనిషి కావలెను. ఫోన్: 7207914195 [H-793465]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ రాజీనామా చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలని, సీబీసీఐడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ ఘటనలో ఘటనకు సంబంధించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, నెటవర్క్ మేనేజర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజశేఖర్‌రెడ్డి పాత్రపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో 350పైగా ఉద్యోగ సిబ్బంది అవసరం ఉండగా కేవలం 80 మందితో కాలం వెల్లదీస్తున్నారని, కాన్ఫిడేషన్ విభాగంలోకి ఎవరు వెళ్తున్నారో పర్యవేక్షణ లేకుండా పోయిందని వాపోయారు. గతంలో ఎస్పీడీసీఎల్ ఉద్యోగ నియామక పరీక్షలో కూడా మాస్ టాపిక్ నిర్వహించడం వల్ల సుమారు 2లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోతూ విలువైన సమయాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యులందరి పైన విచారణ చేపట్టాలని లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్, శివరాజ్ నాయక్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అరవింద్, రవీందర్‌నాయక్, సురేష్, శివ సతీష్, రాజు, కార్తీక్, పటేల్, వంశీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇవ్వనందుకే హతమార్చారు

- దేశరాజ్‌పల్లి వివాహిత హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కరుణాకర్‌రావు

రామడుగు(చొప్పదండి): మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో ఈ నెల 13న మాడిపల్లి అనిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. గురువారం రామడుగు పోలీస్‌స్టేషన్‌లో కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు ఘటన వివరాలు వెల్లడించారు. రామడుగు మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన తడగొండ దామోదర్ (మృతురాలికి వరుసకు అల్లుడు) కరీంనగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడ్డాడు. భార్యతో గొడవపడి జులాయిగా తిరిగేవాడు. రూ.30 వేలు అప్పు కావాలని అనితను (ఘటనకు ముందు రోజు ఆదివారం) అడిగాడు. తన వద్ద డబ్బు లేదని సోమవారం రావాలని తెలిపింది. మరుసటి రోజు ఉదయం దామోదర్ అతడి స్నేహితుడు కరీంనగర్‌కు చెందిన శివతో కలిసి ద్విచక్రవాహనంపై అనిత ఇంటికి వెళ్లారు. డబ్బు అప్పు ఇవ్వాలని అడుగగా ఆమె లేవని చెప్పింది. ఈక్రమంలో అనిత ఒక్కతే ఇంట్లో ఉండడాన్ని గమనించిన ఇరువురు ఆమెను బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లి గొంతును చున్నీతో బిగించి చంపివేశారు. తర్వాత ఆమె మెడలోని పుస్తెలతాడు, వెండి పట్టీలు, నల్ల పూసల గొలుసు ఎత్తుకెళ్లారు. పుస్తెలతాడును బంగారు వ్యాపారి వద్ద రూ.20వేలకు తాకట్టు పెట్టి, చేరో రూ.10 వేలు తీసుకున్నారు. కేసులో విచారణ ముమ్మరం చేసిన పోలీసులు గురువారం నిందితుడు దామోదర్ గోపాల్‌రావుపేట నుంచి తిర్మలాపూర్ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి ద్విచక్రవాహనం, బంగారు గొలుసు, వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు జంబోజి శివ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన చొప్పదండి సీఐ జి.రవీందర్, రామడుగు, గంగాధర ఎస్సైలు అంజయ్య, రాజు, సిబ్బందిని అభినందించారు. రివార్డు కోసం అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



డిపాజిట్ బాండ్ అందిస్తున్న రాజిరెడ్డి, సభ్యులు

రామగిరి(మంథని): సెంటినరికాలనీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్వచర్లకు చెందిన భూస సింధుకు గురువారం లయన్స్‌క్లబ్ సభ్యుడు, ఆర్జీ–3 సివిల్ ఇంజినీర్ బెల్లం శ్రీనివాస్, జ్యోతి దంపతులు చేసిన రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించి మాట్లాడారు. గ్రామానికి చెందిన భూస సురేశ్, రజిత దంపతులు ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సింధు భవిష్యత్ అవసరాల నిమిత్తం రూ.10వేలు పోస్ట్ ఆఫీస్‌లో జీవన్ సుకన్య పాలసీ ద్వారా ఫిక్స్ డిపాజిట్ చేయించి అందుకు సంబధించిన బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్, గంట వెంకటరమణారెడ్డి, పల్లె వెంకటేశ్వరరావు, టీవీ సురేశ్‌బాబు, కళాధర్‌రెడ్డి, రేణుకుమార్ స్వామి, బూస స్వామి పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు ఒప్పందం అమలు చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కాలపరిమితి ముగిసి 20 నెలలు దాటినా అలవెన్స్‌లపై చర్చించకుండా కేవలం మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతానికి ఒప్పుకొని కావాలని కాలయాపన చేయడాన్ని ఖండించారు. వేజ్ బోర్డు అమలు చేస్తున్నప్పటినుంచే అలవెన్సులు చెల్లిస్తారు కాబట్టి ఆలస్యం చేయడం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే అలవెన్స్‌లపై చర్చలు జరిపి కార్మికులకు మార్చి 2023 నుంచి చెల్లించే వేతనముతో 11వ వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న అలవెన్స్‌లపై ఫ్రీజ్ అనే పదాన్ని తొలగించాలన్నారు. కార్మికులకు రావలసిన పెన్షన్, మెడికల్ కార్డులు, వేతన ఒప్పందం విషయంలో జాతీయ సంఘాలు తప్పుడు ఒప్పందాలు చేసుకొని అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలని, సీపీఆర్ఎంఎస్ కార్డుల విషయంలో రికవరీని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పనితీరుకు ఆకర్షితులై వివిధ యూనియన్లకు సంబంధించిన 60 మంది కార్మికులు చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఐలి శ్రీనివాస్, చర్చల ప్రతినిధి కొత్త సత్యనారాయణరెడ్డి, ఫిట్ కార్యదర్శి కొంగర రవీందర్, జీఎం సభ్యులు శంకర్‌నాయక్, ఆకుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో జీఎం మనోహర్, తదితరులు

గోదావరిఖని(రామగుండం): స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు వ్యాపారంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం సీఈఆర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, సింగరేణి సేవా సమితి ద్వారా గతేడాది అనేక రకాల వృత్తి విద్యా కోర్సులను నేర్పించి ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశామని, స్వయం ఉపాధి పొందడానికి ఈ సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ప్రతినిధి చిప్ప సత్యనారాయణ, ఫ్యాకల్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై రౌడీషీట్

రుద్రంగి (వేములవాడ): మండల కేంద్రానికి చెందిన నేవూరి కిషన్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ పేర్కొన్నారు. కిషన్ 2020, 2021 సంవత్సరాల్లో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. 2022లో నేవూరి నర్సయ్యను భూతగాదాల నేపథ్యంలో ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో మృతిచెందాడని, అందుకు రౌడీషీట్ ఓపెన్ చేశామని తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం.. కొడుముంజ గ్రామ శివారులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచి మూడు ఇసుక డంపులను గురువారం పోలీసులు గుర్తించి సీజ్ చేశారు.

ఎస్సారార్ విద్యార్థులకు సీపీ అభినందన

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం విద్యార్థులను గురువారం సీపీ ఎల్.సుబ్బారాయుడు అభినందించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో కరీంనగర్‌లోని ప్రధాన కూడళ్లలో ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచుతామని సీపీ అనుమతి కోరారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ ఎం.హిమబిందు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీపీ సుబ్బారాయుడు

మినుముల మినీ కిట్స్ పంపిణీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌లో సాయిని మల్లయ్య, పెంతల రాజిరెడ్డిలు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటగా వేసేందుకు మినుముల విత్తనాల మినీ కిట్లను ఏవో సత్యం గురువారం అందించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా ఈ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు మంద తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



కిట్లు అందిస్తున్న ఏవో సత్యం

'శ్రీ చైతన్య' విద్యార్థులకు ఉద్యోగాలు

శాతవాహన యూనివర్సిటీ: నగరంలోని మంకమ్మతోట శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాలల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఏషియన్ టెక్నాలజీస్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐటీ రిక్రూటర్ ఉద్యోగాలకు 7గురు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి రూ.2.2 లక్షల వార్షిక వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఉద్యోగాలు సాధించినవారిని గురువారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

క్లుప్తంగా

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'

కరీంనగర్‌టౌన్: పేపర్ లీకేజీలతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత నోటిఫికేషన్లు జారీ చేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేకనే పేపర్ లీకేజీలకు పాల్పడుతూ పరీక్షలు రద్దు చేస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగుల ఆశలు అడియాశలు చేస్తున్న కేసీఆర్‌కు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా పరీక్షలు సజావుగా జరిపి, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, సంజీవరెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న జల్సాను విజయవంతం చేయాలి

కరీంనగర్ కల్చరల్: నగరంలోని కార్ఖానగడ్డ మహముదియా మజీద్‌లో ఈ నెల 19న సాయంత్రం 6.30 గంటలకు మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జల్సా (ఆధ్యాత్మిక సదస్సు)కు ముస్లింలు తరలివచ్చి, విజయవంతం చేయాలని ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తీ మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. సదస్సుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ ఖాస్మీ హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్మశానవాటిక స్థల ఆక్రమణను అడ్డుకోవాలి

కొత్తపల్లి: కొత్తపల్లి(హెచ్) పట్టణంలోని సర్వే నంబర్ 22లో గల హిందూ శ్మశానవాటిక స్థల ఆక్రమణను అడ్డుకోవాలని కోరుతూ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందించినట్లు స్థానికులు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మయ్యకుంటలోని శ్మశానవాటిక 5.20 ఎకరాల్లో విస్తరించి ఉండగా దీని అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఈ స్థలం ఆక్రమణకు గురవుతోందని, వెంటనే సర్వే చేసి, చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్ నారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కన్నం నారాయణను తెలంగాణ అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి గోపాలభూషణరావు, ఉపాధ్యక్షుడు గంగాధర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హాకీ చాంపియన్ టీంకు విద్యార్థి ఎంపిక



వంశీని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న మునుగొండ వంశీ నేషనల్ హాకీ చాంపియన్ టీంకు ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి మే 8వ తేదీ వరకు 13వ హాకీ ఇండియా జూనియర్ మెన్స్ నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో రమేష్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోలార్ స్కేటర్స్.. ప్రాక్టీస్ అదుర్స్

- ఏప్రిల్‌లో మొహాలీలో జాతీయస్థాయి పోటీలు
- సన్నద్ధమవుతున్న క్రీడాకారులు





అంబేడ్కర్ స్టేడియంలోని రోలార్ స్కేటింగ్ రింక్‌లో సాధన చేస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: రోలార్ స్కేటింగ్ గేమ్.. అత్యంత ఖరీదైన క్రీడల్లో ఒకటి. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో స్మార్ట్‌సిటీ నిధులతో అధునాతన రింక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రాక్టీస్ చేసేందుకు పెద్ద సంఖ్యలో చిన్నారులు వస్తున్నారు. కాగా ఇటీవలే రోలార్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలార్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏప్రిల్ నెలలో చండీగఢ్‌లోని మొహాలీలో నిర్వహించే జాతీయస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేశారు. దీంతో వారు జాతీయ పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కఠోర సాధన చేస్తున్నారు.

ఐదు అంశాల్లో పోటీలు..

మొహాలీలో ఇన్‌లైన్, క్వాడ్, రోలార్ హాకీ, ఇన్‌లైన్ హాకీ, ఆర్టిస్టిక్ అంశాల్లో పోటీలు జరగనున్నాయి. మన క్రీడాకారులు పతకాలు సాధించేలా స్పీడ్, ల్యాప్, స్ట్రెచింగ్ తదితర అంశాల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారితోపాటు కోచ్ గట్టు అనిల్‌కుమార్ 'సాక్షి'తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

లాస్ట్ టైం మొహాలీలోనే..



లాస్ట్ టైం మొహాలీలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. కానీ పతకం సాధించలేకపోయాను. ఇప్పుడూ అక్కడే పోటీలు జరగనున్నాయి. పతకం సాధించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నాను. – తాటి విశ్రుత్

బ్రాంజ్ మెడల్ సాధించా..



హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ లెవెల్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించా. మొన్న జరిగిన పోటీల్లోనూ రాణించా. మొహాలీలో జరిగే నేషనల్స్‌లో మెడల్ సాధిస్తా. కోచ్ అనిల్ సర్ బాగా ప్రాక్టీస్ చేయిస్తున్నారు. – అమృత

రాష్ట్రస్థాయిలో పాల్గొన్న..



లాస్ట్ టైమ్ రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న. ఇప్పుడు జాతీయస్థాయి పోటీలకు సెలెక్ట్ అయ్యాను. ఏప్రిల్‌లో జరిగే పోటీలకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నాం. పతకం తీసుకువస్తాం. – వెంకట విశ్వక్

స్టేట్‌మీట్‌లో కాంస్య పతకం



రాష్ట్ర, జాతీయస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించాలనేది నా కోరిక. స్టేట్‌మీట్‌లో కాంస్య పతకం సాధించాను. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు ప్రాక్టీస్ చేస్తున్నాం. – పి.శ్రీహాస్

జాతీయస్థాయిలో ఫస్ట్ టైం..



జాతీయస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీల్లో ఫస్ట్ టైం పాల్గొంటున్నాను. చాలా హ్యాపీగా ఉంది. బాగా ప్రాక్టీస్ చేస్తున్నా. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌లో ఏదో ఒకటి సాధించాలని ఉంది. – రుషిక

పతకాలే లక్ష్యంగా శిక్షణ



పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షణనిస్తున్నాం. గతంలో జిల్లా నుంచి చాలా మంది జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. కానీ పతకాలు సాధించలేకపోయారు. ఇప్పుడు సాధిస్తారన్న నమ్మకం ఉంది. – గట్టు అనిల్‌కుమార్ గౌడ్, కోచ్

చిత్ర కథ

పేషెంట్ కేర్ ఎక్కడ?



కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పేషెంట్ కేర్ ఉద్యోగులను ఇతర పనులకు వాడుకోవడంతో రోగులకు సమయానికి సేవలందడం లేదు. ఫలితంగా పేషెంట్ల బంధువులే అన్ని పనులు చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన ఓ వ్యక్తి గురువారం డిశ్చార్జి అయ్యాడు. ఆటో వద్దకు తీసుకెళ్లడానికి పేషెంట్ కేర్‌లు లేకపోవడంతో అతని భార్యే వీల్‌చైర్‌లో తీసుకెళ్లి, ఆటోలో కూర్చోబెట్టింది. అనంతరం వీల్‌చైర్‌ను సంబంధిత వార్డులో పెట్టి, వెళ్లిపోయింది. ఎవరు చేసే పనులను వారితోనే చేయించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మంచి నిద్రతోనే మెరుగైన ఆరోగ్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: మనిషికి మంచి నిద్రతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని పల్మనాలజిస్టు డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. మార్చి 17 వరల్డ్ స్లీప్ డే సందర్భంగా గురువారం సూర్య చెస్ట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిద్ర ప్రాముఖ్యతకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో 30 శాతం మంది నిద్రలేమితో, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. శరీరానికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే ముఖ్యమని అన్నారు. అందుకే నిద్రను థర్డ్ పిల్లర్‌గా భావిస్తామని చెప్పారు. నిద్రలేమిని ఒక వ్యాధిగా పరిగణించి, సరైన వైద్యం అందించడం ముఖ్యమన్నారు. నిద్రలేమితో హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఏకాగ్రత కోల్పోవడం, పనిచేసే సామర్థ్యం తగ్గిపోవడం, డ్రైవింగ్‌లో యాక్సిడెంట్లు అవుతాయని తెలిపారు. నిద్రకు సంబంధించిన వ్యాధులను స్లీప్ స్టడీ (పాలీసోమ్నోగ్రఫీ) పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. తర్వాత నిద్రలేమి వ్యాధి తీవ్రతను బట్టి పాప్ థెరపీ గానీ, సర్జికల్ ట్రీట్‌మెంట్ ద్వారా గానీ వైద్యం అందిస్తారని అన్నారు.

అంతర్జాతీయ సంగీత పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

కొత్తపల్లి: మెల్‌బోర్న్‌కు చెందిన బాచ్ ఇంటర్నేషనల్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సంగీత పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. ఈ పోటీల్లో 20కి పైగా దేశాల నుంచి విద్యార్థులు పాల్గొనగా 30 మంది విద్యార్థులతో కూడిన పారమిత పాఠశాల గాయక బృందం అద్భుతంగా రాణించినట్లు పేర్కొన్నారు. పిల్లలను, మ్యూజిక్ టీచర్ జితుమణి శర్మను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు గురువారం అభినందించారు. కేవలం చదువుకే పరిమితం చేయకుండా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పాఠశాల యాజమాన్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వి.యు.యం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రబింద్ర పాత్రో, లక్ష్మీదీప్తి, హరిప్రియ, టీచర్లు పాల్గొన్నారు.

కాన్షీరాం స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించాలి



నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కరీంనగర్: బహుజన రాజ్యాధికార ప్రదాత కాన్షీరాం సామాజిక ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం సాధించాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కాన్షీరాం జయంతి ఉత్సవాల్లో భాగంగా బీఎస్ఎఫ్ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. శాస్త్రవేత్తగా ఉద్యోగ జీవితాన్ని వదిలి, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర, సైకిల్ యాత్ర చేసి, ప్రజలను చైతన్యం చేసిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. రాజ్యాధికారం మాత్రమే ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలకు పరిష్కార మార్గమని నమ్మిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ అధ్యక్షుడు పాటకుల భూమయ్య, తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల భూషణ్‌రావు, భీమ్ ఆర్మీ చీఫ్ సెక్రటరీ వాసాల శ్రీనివాస్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేమసారం సమ్మయ్య, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రామచంద్రనాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

జమ్మికుంట: మడిపల్లిలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి జవేరియా గురువారం పరిశీలించారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపీ, పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ వేర్వేరుగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. గ్రామాల్లో సాయంత్రం వరకు శిబిరాలు కొనసాగించాలని ఆదేశించారు. వెంట హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనా జవేరియా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆప్తమాలజిస్ట్ అమరేందర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ పవన్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి సందర్శనకు ముందు గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో శిబిరం 13 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. సర్పంచ్ పర్శరాములు, ఎంపీటీసీ సభ్యురాలు వసుంధర, ఉపసర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అల్ఫోర్స్ ఫ్లరీస్-2023'





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్ రెడ్డి, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. గురువారం సీతారాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'అల్ఫోర్స్ ఫ్లరీస్-2023' పేరిట జరిగిన కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యతోనే భవిష్యత్‌కు చక్కని పునాది వేయవచ్చన్నారు. పదోతరగతి వార్షిక పరీక్షలంటే భయానికి లోనుకాకుండా చక్కగా రాసి, సంచనాలు నమోదు చేయాలని చెప్పారు. నరేందర్‌రెడ్డిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి, ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామంలో ఇంటికో బోనం తీశారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ గుడికి తరలివెళ్లారు. బైండ్ల పూజారుల ప్రత్యేక పూజల అనంతరం మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు జక్కం నర్సయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పుష్ప, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్లు కందుల రమేశ్, దాడి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో ట్రైనీ కలెక్టర్ పర్యటన



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్

హుజూరాబాద్: పట్టణంలో గురువారం ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో పర్యటించారు. పలు ఏరియాల్లో తిరుగుతూ పన్ను బకాయి ఉన్న దుకాణాల వివరాలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆఫీసులోని పలు రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గంలో పదకొండు రోజుల పాటు పర్యటించనున్నారు. వెంట ఆర్డీవో హరిసింగ్, తహసీల్దార్ చింతల కోమల్‌రెడ్డి, కమిషనర్ సల్వాది సమ్మయ్య తదితరులు ఉన్నారు.

వర్క్‌షాప్ సందర్శన



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ కరీంనగర్ డైట్ కళాశాలలో జరుగుతున్న యూడైస్ ప్లస్ వాలిడేషన్ వర్క్‌షాప్‌ను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యూడైస్ ప్లస్ వాలిడేషన్స్ ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. ఏఎస్‌సీ మహేందర్, టీపీ భరత్, వివిధ మండలాల ఎంఐఎస్, సీసీవోలు పాల్గొన్నారు.

'ఆధార్' అప్‌డేట్ చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రజిత

చొప్పదండి: ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ అంబటి రజిత కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అప్‌డేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. 2010 నుంచి 2018 వరకు కార్డులు పొందినవారు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఓటర్ ఐడీ, పాసుబుక్కులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపుకార్డుల ద్వారా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ మేరకు యూఐడీఏఐ సంస్థ ప్రజలకు పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ అరుణ్‌కుమార్, త్రిపాల్‌సింగ్, మోహన్ రెడ్డి, చల్ల క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి వరిసాగుపై అవగాహన



హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట రైతువేదికలో గురువారం తడి, పొడి వరి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో సునీల్‌కుమార్ తడి, పొడి సాగు ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో పొద్దుటూరి సతీష్‌రెడ్డి, పద్మపాణి స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చింతల కొండల్‌రెడ్డి, సంస్థ మండల కోఆర్డినేటర్ మెడుదుల రమేష్, రైతుబంధు సమితి సభ్యుడు శ్రీనివాస్, సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

3న చలో ఢిల్లీకి తరలిరావాలి

కరీంనగర్: బీసీల సమస్యల పరిష్కారం కోసం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఏప్రిల్ 3న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు తదితర సమస్యలపై పోరాడాలని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పార్టీలకతీతంగా బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

● సంక్షేమంతో కూడిన అభివృద్ధే లక్ష్యం

ఐదవసారీ అదే దారి

రూ.2,79,279.27 కోట్లతో 2023-24 ఏపీ వార్షిక బడ్జెట్



- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళలు, పిల్లల పథకాలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట

మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్

మంచి చదువు, మంచి వైద్యం, మంచి ఆరోగ్యం, రైతుల్లో సంతోషం, నా అక్క చెల్లెమ్మల్లో సాధికారత, జోరైన పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. అసమానతలు తగ్గించి, పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ బడ్జెట్ ద్వారా మరో అడుగు ముందుకేశాం.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచే అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీకి సమర్పించింది. జెండర్ బేస్డ్ బడ్జెట్ ద్వారా సమాజంలో సగం ఉన్న మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. పిల్లలకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం విశేషం. అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా వరుసగా ఐదోసారి రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,28,540.71 కోట్లుగా, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు బుగ్గన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,316.70 కోట్లు రెవెన్యూలోటు, రూ.54,587.52 కోట్లు ద్రవ్యలోటు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.77 శాతం, ద్రవ్యలోటు 1.54 శాతం ఉంటుందని, రెవెన్యూ ఆదాయం 2,06,224.01 కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇందులో కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.41,338.02 కోట్లు వస్తాయని, కేంద్రం నుంచి గ్రాంట్లరూపంలో రూ.46,834.64 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. రెవెన్యూ లోటుతో పాటు ద్రవ్య లోటును అదుపులో పెట్టే చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతకు ముందు ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశమై 2023-24 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

నవరత్నాలకు పెద్దపీట

ఎప్పటిలాగే మేనిఫెస్టోలోని నవరత్నాల పథకాల కొనసాగింపునకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలతో పాటు మైనారిటీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీ ఎత్తున నిధులు కేటాయించారు. మొత్తం మీద రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజానీకాన్ని సంతృప్తి పరిచే స్థాయిలో బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మరో పక్క వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో మౌలిక రంగాలకు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో ఎక్కడా దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకత ప్రదర్శించారు. ఏయే రంగాల్లో ఏయే పథకాలకు ఎన్ని నిధులు కేటాయించింది స్పష్టంగా వివరించారు. అవ్వా తాతల సామాజిక పెన్షన్లను వచ్చే ఏడాది జనవరిలో నెలకు 3 వేల రూపాయలు చేస్తామని ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పెన్షన్ కానుకకు ఏకంగా రూ.21,434 కోట్లు కేటాయించారు. నవరత్న పథకాల్లోని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తామని స్పష్టం చేసింది.

సచివాలయాలకు కేటాయింపులు: చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మత్స్యకారులు, దర్జీలు, చేనేత కార్మికులు, కాపులు, లాయర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు.. గ్రామ, పట్టణ సచివాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నేరుగా నగదు బదిలీచేసే 22 నవరత్నాల పథకాలకు బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయించారు. మహిళల పథకాలకు ప్రత్యేకంగా రూ.77,914.43 కోట్లు, పిల్లల పథకాలకు ప్రత్యేకంగా రూ.20,593.38 కోట్లు కేటాయించారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.38,605 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.20,005 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.6,929 కోట్లు, మైనారిటీ కాంపొనెంట్‌కు రూ.4,203 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి రూ.51,345 కోట్లు, సాధారణ విద్యా రంగానికి రూ.32,198 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,043 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.17,531 కోట్లు కేటాయించారు.

రైతుల సంక్షేమంపై శ్రద్ధ

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు కేటాయింపులు కొనసాగించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా జల వనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించారు. మన బడి నాడు-నేడు కార్యక్రమానికి రూ.3500 కోట్లు.. వైద్య ఆరోగ్య రంగంలో నాడు-నేడు కార్యక్రమానికి రూ.2214.21 కోట్లు కేటాయించారు. పేదల గృహ నిర్మాణాలకు రూ.6291.70 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంకు రూ.610 కోట్లు కేటాయించారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.6,546 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి రూ.2,400 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వానికి రూ.532 కోట్లు కేటాయించారు.

2022-23 సవరించిన అంచనాలు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2,40,509.34 కోట్లుగా ఉంటుందని ఆర్థిక మంత్రి బుగ్గన తెలిపారు. రెవెన్యూ వ్యయం రూ.2,05,555.95 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.16,846.69 కోట్లు అని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు రూ.29,107 కోట్లు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు అని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూలోటు 2.21% కాగా, ద్రవ్యలోటు 3.62 శాతంగా ఉందని పేర్కొన్నారు.

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం	మొత్తం ఆదాయం
రూ.2,28,540.71 కోట్లు	రూ.31,061.04 కోట్లు	రూ.2,79,279.27 కోట్లు

కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.41,338.02 కోట్లు

కేంద్ర గ్రాంట్లు	రెవెన్యూ లోటు	ద్రవ్య లోటు
రూ.46,834.64 కోట్లు	రూ.22,316.70 కోట్లు	రూ.54,587.52 కోట్లు

బడ్జెట్ స్వరూపం

రెవెన్యూ రాబడి	రూ.2,06,224.01 కోట్లు
ప్రజా రుణం	రూ.72,022.09 కోట్లు
రుణాల రికవరీ	రూ.56.32 కోట్లు
పబ్లిక్ అకౌంట్స్	రూ.976.85 కోట్లు
మొత్తం రాబడి	రూ.2,79,279.27
రెవెన్యూ వ్యయం	రూ.2,28,540.71 కోట్లు
మూల ధన వ్యయం	రూ.31,061.04 కోట్లు
రుణ చెల్లింపులు	రూ.18,411.42 కోట్లు
రుణాలు & అడ్వాన్స్	రూ.1,266.10 కోట్లు
మొత్తం వ్యయం	రూ.2,79,279.27 కోట్లు

సొంత సంస్థల్లోకి మళ్లిస్తున్నారు

- మార్గదర్శి.. మరో అగ్రిగోల్డ్, సహారా కాకముందే చర్యలు చేపట్టాం
- విచారణ 'పరిధి' అంశం పెండింగ్‌లో ఉండగా క్వాష్ పిటిషనా?
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ తన ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును సొంత సంస్థల్లోకి మళ్లిస్తోందని, అవి నష్టాల్లోకి వెళ్తే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్, సహారా మాదిరిగా కాకముందే జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నందున పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వానికి ఏ సంస్థ అయినా ఒకటేనని, అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడబోమని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని / దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అభ్యర్థిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను ఏపీలో కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటివరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీన్ని గురువారం విచారణకు చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ రెగ్యులర్ కేసులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా, ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. విచారణ 'పరిధి', కేసు మెరిట్ అంశాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

పునర్విభజన చట్టానికి విరుద్ధం

'మార్గదర్శి అక్రమాలపై 409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పదేళ్లకు పైగా శిక్ష పడే కేసులే. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ రిలీఫ్ కోరలేరు. ఒకట్రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. కేసులు నమోదైన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు ఇక్కడ అరెస్టులు చేయవద్దని కోరడం చట్ట విరుద్ధం. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు కూడా పలు తీర్పులను ఇచ్చింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు. 'పరిధి' అంశం తేలకుండానే మళ్లీ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం దర్యాప్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారని చెప్పారు. చిట్స్ పేర డబ్బులు సేకరించి ఉషాకిరణ్ లాంటి సంస్థల్లోకి మళ్లిస్తున్నారని తెలిపారు.

మరో రాష్ట్రానికి మార్చండి..

'మార్గదర్శి కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇక్కడి నుంచే బ్రాంచ్‌ల పర్యవేక్షణ జరుగుతుంది. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇక్కడే ఉంటారు. అందుకే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాం. దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి. ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా తనిఖీలు చేస్తున్నారు' అని సిద్దార్థ లూత్రా పేర్కొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఓట్ల లెక్కింపు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకుంది. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగతా 4 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ నాలుగు స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. గురువారం ఓట్లు లెక్కించారు. శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి నర్తు రామారావు, కర్నూలు జిల్లా నుంచి మధుసూదన్, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు. ఈ నాలుగు స్థానాల్లోనూ సంఖ్యా బలం లేకపోయినా స్వతంత్రుల ముసుగులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. కాగా, 3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలు మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎస్.మంగమ్మ, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇద్దరు నకిలీ నక్సలైట్ల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, పక్కన డీసీపీ సుధీర్ రాంనాథ్

- రెండు రేంజర్ ఎయిర్‌గన్స్ స్వాధీనం
- రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: నక్సలైట్లమంటూ గత నెల 21న మంచిర్యాల జిల్లా సీసీసీ పోలీసుస్టేషన్ పరిధిలోని సీసీసీ నస్పూర్‌కు చెందిన గుండ కాంతయ్యకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు నకిలీ నక్సలైట్లను పోలీసులు అరెస్టు చేశారు. రెండు ఎయిర్‌గన్స్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి వివరాలు వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన గుండ కాంతయ్య తన స్వగ్రామం లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలలో రెండు నెలల క్రితం భూమి విక్రయించగా డబ్బులు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మేడి వెంకటేష్, హాజీపూర్ మండలం పెద్దంపేటకు చెందిన ఆరెందుల రాజేష్ పథకం ప్రకారం ఓ రోజు రెక్కీ నిర్వహించారు. గత నెల 21న రాత్రి ద్విచక్రవాహనంపై వచ్చి కాంతయ్య ఇంటి ఆవరణలో రెండు ఎయిర్‌గన్స్ పడేసి వెళ్లారు. మరుసటి రోజు కాంతయ్య, తన కుమారుడు నాగరాజులకు ఫోన్ చేసి తిర్యాణి అడవుల నుంచి మావోయిస్టులం మాట్లాడుతున్నామని, అర్జంట్‌గా రూ.40లక్షలు పంపించాలని డిమాండ్ చేశారు. లేదంటే చంపేస్తామని, మీ ఇంటి ఆవరణలో తుపాకులు పెట్టామని బెదిరించారు. దీంతో బాధితులు సీసీసీ పోలీసులను ఆశ్రయించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సాంకేతిక పరిజ్ఞానంతో వెంకటేష్, రాజేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి పల్సర్ బైక్, సెల్‌ఫోన్, ఎయిర్‌గన్స్ స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, జైపూర్ ఏసీపీ నరేందర్ పాల్గొన్నారు. నకిలీ నక్సలైట్లను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సంజీవ్, ఎస్సై రవికుమార్, సిబ్బంది ఎండీ.సలీమ్, బి.దేవేందర్, శ్రీధర్, ఇర్షాద్‌లను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

ఈజీ మనీకి అలవాటు పడి..

వెంకటేష్, రాజేష్ దూరపు బంధువులు కాగా.. చిన్నప్పటి నుంచి కలిసే ఉండేవారు. ఈజీగా డబ్బు డబ్బులు సంపాదించాలని కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పెద్దగా డబ్బులు రాకపోవడంతో మావోయిస్టుల పేరిట బెదిరించి డబ్బు సంపాదించాలని హైదరాబాద్‌లో రెండు ఎయిర్‌గన్స్ కొనుగోలు చేశారు. కాంతయ్యపైనే ప్రయోగం చేద్దామని నక్సల్ అవతారం ఎత్తారు. రాజేష్‌పై గతంలో మంచిర్యాల, హాజీపూర్ ఠాణాల్లో ఈవ్ టీజింగ్, ల్యాండ్ సెటిల్‌మెంట్ల గొడవలకు సంబంధించిన ఆరు కేసులుండడం గమనార్హం.

పరీక్ష బాగా రాయలేదని విద్యార్థి ఆత్మహత్య



శివకృష్ణ(ఫైల్)

బెల్లంపల్లి: కడుపునొప్పితో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష బాగా రాయలేదని మనస్తాపం చెందిన విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో గురువారం చోటు చేసుకుంది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన రాపల్లి శారద, శంకర్ దంపతులకు కుమారులు సాయి అక్షయ్, శివకృష్ణ ఉన్నారు. సాయిఅక్షయ్ హైదరాబాద్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతుండగా, శివకృష్ణ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శివకృష్ణ గురువారం స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష రాస్తుండగా కడుపునొప్పి రావడంతో పరీక్ష రాసి వచ్చాడు. ఇదే విషయమై తల్లి శారదకు ఫోన్ చేసి చెప్పి బాధపడ్డాడు. మరోసారి రాసి మంచి మార్కులు తెచ్చుకోవచ్చని తల్లి సముదాయించింది. ఇంటికి వెళ్లిన తర్వాత శివకృష్ణ (18) చీరతో ఉరేసుకున్నాడు. పక్కింటి మహిళ గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. టూటౌన్ ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

చురుకైన విద్యార్థి

శివకృష్ణ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించి ప్రతిభ చూపాడు. అదే స్ఫూర్తితో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సిద్ధమయ్యాడు. కడుపునొప్పి కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆర్జీవీపై కేసు నమోదు చేయాలి

- వి.హనుమంతరావు



మాట్లాడుతున్న వి.హనుమంతరావు

నిర్మల్‌టౌన్: సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్‌వర్మ(ఆర్జీవీ)పై న్యాయస్థానం సుమోటోగా నమోదు చేయాలని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కోరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం మాట్లాడారు. మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి భారతదేశంలో ఉందన్నారు. నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్జీవీ మహిళలు, సమాజాన్ని కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. ఆర్జీవీ మాట్లాడిన తీరును మహిళా సమాజం ఖండించాలన్నారు. ఆర్జీవీ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాదయాత్రపై మాట్లాడుతూ.. పాదయాత్ర ఆపడానికి గల కారణాలను అధిష్టానాన్ని అడిగి తెలుసుకుంటానని చెప్పారు.

మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ రానుంది. రైల్వేస్టేషన్ల అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైల్వే డీఆర్‌ఎం అభయ్‌కుమార్‌గుప్త గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అభివృద్ధికి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో రూ.9కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్కలేటర్, సెకండ్ ప్లాట్‌ఫామ్ వైపు టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బీజేవైఎం నాయకులు ఆయనను కలిసి స్టేషన్‌లో సదుపాయాలు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే రైళ్లు ఆగడం లేదని తెలిపారు. రైల్వే గేట్ మూసివేసిన స్థలంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పేర్కొన్నారు. రాజీవ్ నగర్ ప్రాంతం వెళ్లేందుకు హైటెక్ సిటీ వెనుకాల అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రామారావు సిబ్బంది, బీజేపీ నాయకులు గోనే శ్యాంసుందర్‌రావ్, బీజేవైఎం నాయకులు తుల ఆంజనేయులు, పురుషోత్తంరాజు, హరికృష్ణ, సంతోష్, రాజు పాల్గొన్నారు.

యువతా.. 'ఎన్‌వైకే' పిలుస్తోంది

- నవ సమాజ నిర్మాణంలో వలంటీర్లు కీలకం
- ఎన్‌వైకే వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ ద్వారా ఈనెల 24 లోపు గడువు
- ఉమ్మడి జిల్లాలో 818 ఎన్‌వైకే అనుబంధ యువజన సంఘాలు



యువజన సంఘాల సామాజిక సేవ కార్యక్రమం(ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: యువత దేశాభివృద్ధిలో కీలకం. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యం. ఇలా సమష్టిగా దేశసేవలో పాల్పంచుకునేలా నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) భాగస్వామ్యం చేస్తోంది. నవ సమాజ నిర్మాణంలో యువతను కీలకం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా నిలుస్తూ.. సామాజికసేవలో భాగస్వామిగా ఉంటూ వలంటీర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్‌వైకేలో యువతను బలోపేతం చేసేందుకు 2023-24 సంవత్సరానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 19మంది వలంటీర్లను ఎంపిక చేస్తోంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. 18 నుంచి 29 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న యువత దరఖాస్తు చేయవచ్చు. ఇప్పటి వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 818 ఎన్‌వైకే అనుబంధ యువజన సంఘాలు సమాజసేవలో భాగస్వాములుగా కొనసాగుతున్నాయి.

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో వలంటీర్ల ఎంపిక జరగనుంది. బ్లాక్‌ల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. కేవలం కరీంనగర్‌లోనే 8 బ్లాక్‌లు కొనసాగుతుండగా.. కొత్తజిల్లాల్లో బ్లాక్‌లు ఏర్పాటు కాలేదు.
- ఈ క్రమంలో కరీంనగర్‌లో 16 మండలాలకు గాను 10మంది వలంటీర్లు, పెద్దపల్లి జిల్లాలో 14మండలాలకు గాను ముగ్గురు వలంటీర్లు, రాజన్న సిరిసిల్ల పరిధిలోని 12 మండలాలకు గానూ ముగ్గురు, జగిత్యాల జిల్లాలో 18 మండలాలకు గానూ ముగ్గురి చొప్పున వలంటీర్లను నియమించనున్నారు.
- ఎన్‌వైకే ద్వారా నియామకమైన వలంటీర్లు వారివారి యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రామప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తారు. ఏడాదిలో 100కు పైగా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది.
- ఎన్‌వైకేలో వలంటీర్ కావాలంటే 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయసుండాలి. చదువుతున్నవారు, ఉద్యోగం చేసే వారు అనర్హులు. కనీస విద్యార్హత పదో తరగతి. కంప్యూటర్ పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలపై అవగాహన తప్పనిసరి.
- ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లుగా గతంలో చేసిన వారు, ఎన్‌వైకే అనుబంధ యువజన సంఘ సభ్యులకు ప్రాధాన్యం ఉంటుంది. ఎంపికైన వలంటీర్లకు గౌరవ వేతనంగా నెలకు రూ.5వేలు చెల్లిస్తారు. www.nyks.in లో ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలి.

మంచి అవకాశం



సమాజానికి సేవచేయాలనుకునే యువతకు ఇదీ మంచి అవకాశం. ప్రతి ఏడాది ఎన్నో సామాజిక కార్యక్రమాలు ఎన్‌వైకే ఆధ్వర్యంలో చేపడుతున్నాం. ఆ కార్యక్రమాల్లో వలంటీర్లు భాగస్వాములు అవుతారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.
- ఎం.వెంకటరాంబాబు, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్, కరీంనగర్

దేశభక్తి పెంచే కార్యక్రమాలు ఉండాలి



యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాం. దాని ఫలితంగానే ఉత్తమ యువజన సంఘం అవార్డు దక్కింది. యువతలో మానసిక, శారీరక, నూతన ఉత్సాహాన్ని కలిగించే కార్యక్రమాలతో పాటు దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలి. స్వచ్ఛభారత్, హరిత హారం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి.
- తొర్తి శ్రీనివాస్, జిల్లా ఉత్తమ యువజన సంఘం అవార్డు గ్రహీత

రెండేళ్లు పనిచేశా..



రెండేళ్లు ఎన్‌వైకే వలంటీరుగా పనిచేశా. వలంటీరుగా చేయడమంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గ్రామస్థాయిలో యువతకు చేర్చడం. యువతలో ఉన్న చెడు అలవాట్లు, స్కూల్ డ్రాప్ అవుట్స్ వంటి వాటిని గుర్తించి, నిర్మూలించే కార్యక్రమాలు చేశాను. 2020లో జిల్లా ఉత్తమ అవార్డును గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా అందుకున్నా.
- హరీశ్, ధర్మక్షేత్రం యువజన సంఘం, జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత

బలోపేతం చేయాలి



అవినీతి రహిత సమాజం కోసం యువత కృషి చేయాలి. యువజన సంఘాలను బలోపేతం చేయాలి. యువత చెడు మార్గాలకు వెళ్లకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలి. గ్రామస్థాయిలో నూతన యువజన సంఘాలను ఏర్పాటు చేసి యువతలో సామాజిక కార్యక్రమాలు చేయడం, సేవా కార్యక్రమాలు చేయడానికి కావలసిన సహకారాన్ని అందించాలి.
- తాదూరి కృష్ణ, మాజీ వలంటీర్, చొప్పదండి

ఫ్యాషన్

సకల శుభాల శోభ















**ఉగాది రావడంతోనే వేసవి మనకు పరిచయం అవుతుంది.
షడ్రుచులతో కొత్త చిగురుల సందడి మొదలవుతుంది.
సకల శుభాలను మోసుకువచ్చే ఉగాదికి
సకల హంగులూ అద్దేవి మన చేనేతలే.
పండగ రోజులే కాకుండా వేసవి మొత్తం
కాటన్ డ్రెస్సులతోనే కలర్‌ఫుల్‌గా కనిపించడం ఎలాగా అని
ఆలోచించేవారికి సరైన ఎంపికతోనే సిద్ధంగా ఉన్నాయి.**

అచ్చతెలుగు అమ్మాయిలా లంగాఓణీలో కనిపించాలనుకున్నా, లెహంగాలో గ్రాండ్ లుక్‌తో మెరిసిపోవాలన్నా, చుడీదార్‌తో ఆధునికం అనిపించాలన్నా, చీర అంచుతోనే అందాన్ని చుట్టేయాలన్నా మన చేనేతలు ఎప్పుడూ అగ్రభాగాన ఉంటాయి. పట్టుకున్న ప్రాముఖ్యత కాటన్స్‌కు లేదు అనుకునేవారికి సరైన ఎంపిక అవుతున్నాయి. వాటిలో ఖాదీ, మంగళగిరి, ఇక్కత్, నారాయణపేట్, గద్వాల్, వెంకటగిరి... వంటి కాటన్ హంగులు తీరైన నిండుదనాన్ని తీసుకువస్తున్నాయి. ప్రతిరోజూ పండగే అనిపించే శోభను మోసుకువస్తున్నాయి. ఈ వేసవిని శోభకృతుతో ఇంపైన కళగా మార్చేద్దాం.

రియల్ స్టోరీ

'ఇలాంటి పిల్లల'కూ హక్కులుంటాయి!


● శ్రీలత

**'దివ్యాంగులు మెట్లు ఎక్కలేకపోవడానికి
కారణం వాళ్లకు కళ్లో, కాళ్లో లేకపోవడం కాదు
సమాజానికి సహానుభూతి లేకపోవడం'
అంటుంది తమిళ రచయిత్రి కంభంపాటి శ్రీలత.
డిస్‌లెక్సియాతో పుట్టిన కూతురి కోసం
తానే టీచర్‌గా మారింది శ్రీలత.
'నార్మల్ వ్యక్తుల మెజారిటీ సమాజం దివ్యాంగుల పట్ల
ఎటువంటి బాధ్యత వహించకపోయినా
వాళ్లు తమ జీవితాలను నిశ్శబ్దంగా నిర్మించుకుంటూనే ఉంటారు'
అంటుందామె.
కూతురి జీవితాన్ని, ఆమెలాంటి దివ్యాంగుల జీవితాలను
'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకంగా తీసుకొచ్చిందామె.**


శ్రీలత తాను రాసిన 'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించింది. ఆ ఏడింటిలో ఒకదాని పేరు 'దృష్టి లేనిది ఎవరికి?'. 'ఈ సమాజంలో దృష్టి లేనిది అంధులకా దివ్యాంగుల పట్ల ఎటువంటి ఆలోచనా లేని సామాన్యులకా?' అని ప్రశ్నిస్తుంది అందులో.

'సమర్థత (ఎబిలిటీ) మీకు మాత్రమే ఉంటుందా? అందుకే దివ్యాంగులను డిజేబుల్ అంటారా? వారూ సమర్థులే. కాని వారి కదలికలకు వీలు కల్పించలేని నిర్మాణాలు, చదవడానికి వీల్లేని చదువులు, వారికి సమాన అవకాశం ఇవ్వలేని స్కూళ్లు... ఇవి వారిని సమర్థత లేనివారుగా చేస్తున్నాయి' అంటుందామె.

చెన్నైలో నివసించే శ్రీలత సుప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి. ఆమె రాసిన కవితా సంకలనాలు ఆదరణ పొందాయి. 'టేబుల్ ఫర్ ఫోర్' అనే నవల పెద్ద పురస్కారాల వరకూ వెళ్లింది. అయితే ఆ రాసిన పుస్తకాల కంటే తాజాగా వెలువరించిన 'దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్' పుస్తకం విలక్షణమైనది. దానికి కారణం ఆమె కూతురు అనన్యకు 9 ఏళ్ల ఉండగా 'ఇలాంటి అమ్మాయిని స్కూల్లో ఉంచుకోలేం' అని ప్రిన్సిపల్ నిర్దాక్షిణ్యంగా చెప్పడమే. ఆ 'ఇలాంటి అమ్మాయి' (దిస్ కైండ్ ఆఫ్ చైల్డ్)ని గుండెలకు హత్తుకుని తానే చదువు చెప్పుకుంది శ్రీలత. దానికి కారణం అనన్య డిస్‌లెక్సియాతో బాధ పడుతూ ఉండటమే. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే అనన్యకు 'స్పెసిఫిక్ లెర్నింగ్ డిసేబిలిటీ' (ఎస్ఎల్‌డి) ఉంది. 'నా కూతురిని కూడా అందరి పిల్లలతో పాటు కూచోబెట్టి చదివించే స్కూళ్లు ఉండాలి. ఆ స్కూల్లో నా కూతురు స్థితిని స్వీకరించే పరిస్థితి ఉండాలి. నా కూతురే కాదు అలాంటి అందరు పిల్లలకు' అంటుంది శ్రీలత.



'న్యూరోడైవర్సిటీ'... అంటే మెదడు సంబంధమైన లోపాలతో పుట్టే పిల్లలు– ఆటిజమ్, డిస్‌ప్రాక్సియా, డిస్‌కాల్క్యులియా, డిస్‌గ్రాఫియా... తదితర అవస్థలతో బాధ పడుతుంటే వారి కోసం సమాజంలో ఎటువంటి ఆలోచనా ఉండదని ఈ పుస్తకంలో విపులంగా రాస్తుంది శ్రీలత. వారు చిన్నపిల్లలుగా ఉన్నప్పటి కంటే టీనేజ్‌కు వచ్చినప్పుడు ఎదురయ్యే మానసిక, శారీరక పరిస్థితుల గురించి చాలా అవగాహన లోపం ఉందని అంటుందామె. అందుకే తన పుస్తకంలో 'మా షరతులతో మేము' అనే చాప్టర్‌ను రాసింది. దివ్యాంగులు తమ పరిమితిని గుర్తించి ఆ పరిమితిని స్వీకరించి రాజీ పడక హక్కుల కోసం పోరాడాలని కోరుతుందామె. 'దివ్యాంగుల హక్కులు మానవ హక్కులు. మీరు జాలి పడి రాల్చే సౌకర్యాలు కాదు' అంటుంది శ్రీలత.



దివ్యాంగుల విషయంలో అన్నింటి కంటే ముఖ్యమైన సమస్య 'కేర్ గివర్స్'. అంటే 'చూసుకునేవాళ్లు'. తల్లిదండ్రులు, భార్యాభర్తలు... వీరు దివ్యాంగులతో ఎలా మెలగాలో ఒక చాప్టర్‌లో రాస్తే తోబుట్టువులు, పిల్లలు ఎలా మెలగాలో ఇంకో చాప్టర్‌లో రాసింది. 'పోలియోతో ఉన్న తండ్రితో నార్మల్‌గా పుట్టిన కొడుకు ఎలా మసలుకున్నాడో... తన తండ్రిని అర్థం చేసుకుని ఎలా బాసటగా నిలిచాడో ఒక కేస్‌స్టడీ ఈ పుస్తకంలో ఉంది' అని చెబుతుంది శ్రీలత.

అనేక మంది దివ్యాంగుల గెలుపు కథలను, తల్లిదండ్రుల, తోబుట్టువుల, సహాయకుల, స్పెషల్ ఎడ్యుకేటర్ల అనుభవాలను కథలుగా, ఇంటర్వ్యూలుగా, మౌఖిక కథనాలుగా ఈ పుస్తకంలో రికార్డు చేసింది శ్రీలత. దివ్యాంగుల నిజమైన అవసరాలు ఏమిటో సమాజానికి రావాల్సిన దృష్టి ఏమిటో ఈ పుస్తకం సమర్థంగా తెలియచేస్తుంది. 'ఇలాంటి పుస్తకాలు ఎంతమంది రాస్తే అంత మంచిది' అంటుంది శ్రీలత. అన్నింటి కంటే ముఖ్యం శ్రీలత కుమారుడు అనిరుద్ధ తన సోదరి అనన్యను చూస్తూ 'ప్రతి స్కూల్లో పిల్లలకు దివ్యాంగుల గురించి పాఠాలు చెప్పాలి. దివ్యాంగులతో ఎలా మెలగాలో పిల్లలకు సిలబస్‌గా ఎందుకు చెప్పరు? అప్పుడు కదా స్కూల్లో ఏ దివ్యాంగ పిల్లవాడైనా చేరితే ఇతర పిల్లలు అతనితో బాగా మెలిగేది' అన్న మాట ఎంతో ఆలోచించదగ్గది.

అభిరుచి

అంతరంగచిత్రం







**హంస ముఖంలో ముఖం పెట్టి మురిపెంగా చూస్తున్న అమ్మాయి.
నెమలి పింఛాన్ని ఆసక్తిగా చూస్తున్న బుట్టగౌను పాపాయి.
ఏనుగు తొండాన్ని ఆత్మీయంగా నిమురుతున్న యువతి.
ప్రకృతి... పక్షులు... సరస్సులు... పువ్వులు కళ్ల ముందే.
థీమ్ ఏదయినా సరే... ఓ అమ్మాయి రూపం తప్పనిసరి.
ఆర్టిస్ట్ ఆషా రాధిక బొమ్మల్లో కనిపించే ఆర్ద్రత ఇది.**

ఆషా రాధిక పుట్టింది, పెరిగింది, చదువు, ఉద్యోగం అంతా హైదరాబాద్‌లోనే. ఆమె బొమ్మల్లో హైదరాబాద్ సంస్కృతితోపాటు హైదరాబాద్‌లో కనిపించని జీవనశైలి కూడా ద్యోతకమవుతుంటుంది. ఆమె 24 సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు పెట్టారు. హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, తెలంగాణ ఆర్టిస్ట్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఆర్ట్ ఆఫ్ ద హార్ట్' చిత్రలేఖన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన చిత్రకళా ప్రస్థానాన్ని 'సాక్షిఫ్యామిలీ'తో పంచుకున్నారు.

కుంచె నేర్పింది!

''నాకు పెయింటింగ్ హాబీగా మారడానికి కారణం మా అమ్మ నాన్న. అమ్మ ఎంబ్రాయిడరీ చేసేది. దారంతో వస్త్రం మీద ఒక రూపం తీసుకురావాలంటే గంటల సేపు పని చేయాలి. బ్రష్‌తో అయితే నిమిషంలో వచ్చేస్తుంది. అలా సరదాగా మొదలుపెట్టాను. స్కూల్‌లో కాంపిటీషన్‌లలో ప్రైజులు వస్తుంటే ఆ ఉత్సాహంతో మరికొన్ని బొమ్మలు వేసేదాన్ని. ఇక నాన్నగారు మహాసంప్రదాయవాది. ఆడపిల్లలు స్కూలుకి వెళ్లడం, ఇంటికి రావడం తప్ప ఇక దేనికీ బయటకు వెళ్లరాదన్నంత నియమం ఆయనది. ఖాళీ సమయం అంతా ఇంట్లోనే ఉండాల్సి రావడంతో పెయింటింగ్స్‌లో ప్రయోగాలతో కాలక్షేపం చేయడం అలవాటైపోయింది. అలా కుంచే నాకు గురువైంది. సెవెన్త్ క్లాస్‌లో సమ్మర్ కోచింగ్ తప్ప పెయింటింగ్స్‌లో ప్రత్యేకమైన శిక్షణ ఏదీ లేకనే చాలా బొమ్మలు వేశాను. పెద్దయిన తర్వాత టెంపూరా ఆన్ పేపర్ కళను తెలుగు యూనివర్సిటీ, పెయింటింగ్ అండ్ స్కల్ప్చర్ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీనివాసాచారి గారి దగ్గర నేర్చుకున్నాను.

కాన్వాస్‌లాగానే మైండ్ కూడా

నా కుంచె గర్ల్ చైల్డ్ ప్రధానంగా జాలువారుతుంది. నేచర్, పక్షులు, పూలు ఆహ్లాదాన్నిస్తాయి. ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలను చూసినప్పుడు తప్పనిసరిగా ప్రభావితమవుతాం. అయితే అది అనుకరణ కోసం కాదు. ఒక గమనింపు మనలో ఉంటుంది. ఆ చిత్రకారుల గీతను నిశితంగా గమనిస్తుంది మన మేధ. జగదీశ్ మిట్టల్ గారి కలెక్షన్స్‌లో 14వ శతాబ్దం నాటి చిత్రాలు కూడా ఉన్నాయి. ఆ మీనియేచర్ ఆర్ట్ నా మెదడు మీద అలా ముద్రించుకుపోయింది. రామ్‌కుమార్, ప్రభాకర్ కోల్టే వేసే ఆబ్‌స్ట్రాక్ట్‌లు చాలా ఇష్టం. ఎన్ని చిత్రాలను చూసి, ఎన్నింటి నుంచి స్ఫూర్తి పొందినా మన మెదడు కాన్వాస్ మీద తనకు తానుగా ఓ కొత్త రూపాన్ని ఆవిష్కరిస్తుంది. నేను బొమ్మ వేయడానికి కాన్వాస్ ముందు కూర్చునేటప్పుడు ఫలానా రూపం రావాలనే ఆలోచన ఉండదు. కాన్వాస్‌లాగానే మెదడు కూడా క్లియర్‌గా ఉంటుంది. రంగులు ఒక్కొక్క లేయర్ వేస్తూ ఉంటే కొంత సేపటికి రూపం వస్తుంది. ఆ చిత్రంలో ఒక అమ్మాయి తప్పనిసరిగా ఉంటుంది. ఇక థీమ్ అంటే 'హర్ అబ్జర్వేషన్' అని చెప్పవచ్చు. ఒక అమ్మాయి ప్రకృతిని, తన పరిసరాలను గమనించడంతోపాటు మమేకం కావడం నా బొమ్మల్లో ఉంటుంది. ఒక అమ్మాయిగా బాల్యంలో నేను చూసినవి, ఊహించినవి, పెద్దయిన తర్వాత నా గమనింపుకు వచ్చినవి, ఒక అమ్మాయికి తల్లిగా ప్రేమానుబంధం నా బొమ్మల్లో ఆవిష్కారమవుతుంటుంది. ఇంట్లోనే ఆర్ట్ స్టూడియో ఏర్పాటు చేసుకున్నాను. నాలుగు వేల బొమ్మలు వేసి ఉంటాను. సోలో ప్రదర్శనలను గుర్తు పెట్టుకుంటాను, కానీ గ్రూప్ ప్రదర్శనల లెక్క ప్రత్యేకంగా గణనలోకి తీసుకోలేదు. అమెరికాలో నాలుగు రాష్ట్రాల్లోనూ నావి సోలో ప్రదర్శనలే.

చిత్రలేఖనం పట్ల ఎంత ఇష్టం ఉన్నప్పటికీ చదువు ప్రాధాన్యం తగ్గనివ్వలేదు. ఎస్‌బీఐలో 1992లో ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు శంకరపల్లి బ్రాంచ్ మేనేజర్‌ని. 'ఆర్ట్ ఆఫ్ ద హార్ట్'లో పాల్గొన్నాను. సోలో ఎగ్జిబిషన్‌లు 2001 నుంచి మొదలుపెట్టాను. ఇప్పుడు 25వ ఎగ్జిబిషన్ నా చిత్రలేఖనం కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలనే ఆకాంక్షతో సిద్ధం చేస్తున్నాను'' అని తన అంతరంగాన్ని ఆవిష్కరించారు ఆర్టిస్ట్ ఆషా రాధిక.

– వాకా మంజులారెడ్డి

వంటిల్లు

సూర్యుడికి పెరుగుతో చెక్

**ఇంట్లో పెరుగు ఉంటే వేసవికి సవాల్ విసరవచ్చు.
వడదెబ్బ నుంచి మనల్ని మనమే రక్షించుకోవచ్చు.
అందుకే రాష్ట్రాలు వేరైనా భాషలు వేరైనా
దేశంలో అందరూ ఎండల్ని పెరుగుతోనే
చల్లబరుస్తారు. ఈవారం మన వంటిల్లు
వండుతున్న ఈ పెరుగు కూరలను అన్నంలో
కలుపుకోవచ్చు, రొట్టెలతో కలిపి తినవచ్చు.**

పంజాబీ బూందీ కఢీ



కావలసినవి: పెరుగు – 2 కప్పులు (చిలకాలి); శనగపిండి – 4 టేబుల్ స్పూన్‌లు ; మిరప్పొడి – పావు టీ స్పూన్ ; పసుపు – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నెయ్యి– టేబుల్ స్పూన్ ; లవంగాలు – 5 ; పచ్చిమిర్చి పేస్ట్ – టీ స్పూన్ ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; జీలకర్ర – టీ స్పూన్ ; మెంతులు – టీ స్పూన్ ; మిరియాల పొడి – పావు టీ స్పూన్ ; ఇంగువ– చిటికెడు ; బూందీ– కప్పు ; కొత్తిమీర – చిన్న కట్ట (తరగాలి).

తయారీ: ● పెరుగును చిలికి అందులో శనగపిండి, మిరప్పొడి, పసుపు, ఉప్పు వేసి అన్నీ బాగా కలిసేవరకు చిలకాలి. కలిసిన తర్వాత అరలీటరు నీటిని పోసి మళ్లీ చిలకాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి లవంగాలు, జీలకర్ర, మెంతులు, పచ్చిమిర్చి పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మగ్గనిచ్చి మిరియాల పొడి, ఇంగువ వేయాలి. ఇవి వేగిన తర్వాత పెరుగు మిశ్రమాన్ని వేసి బుడగలు వచ్చే వరకు గరిటెతో కలుపుతూ ఉడికించి దించాలి(చిక్కదనం చూసుకుని అవసరమనిపిస్తే మరికొంత నీటిని కలిపి అవి మరిగే వరకు ఉడికించాలి). ఇప్పుడు బూందీ, కొత్తిమీర తరుగు వేసి కలపాలి.

కన్నడ కుంబలకాయ్ మజ్జిగె హులి



కావలసినవి: బూడిద గుమ్మడికాయ ముక్కలు – పావు కేజీ (చెక్కు, గింజలు తొలగించి ముక్కలు చేయాలి); పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్ ; పచ్చి కొబ్బరి తురుము– కప్పు; పచ్చిమిర్చి– 3; అల్లం– అంగుళం ముక్క ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పెరుగు – కప్పు.

పోపు కోసం: వంట కొబ్బరి నూనె – టీ స్పూన్; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర – అర టీ స్పూన్ ; ఇంగువ – పావు టీ స్పూన్; కరివేపాకు – 4 రెమ్మలు.

తయారీ: ● ముందుగా పచ్చిశనగపప్పును కడిగి నీటిలో 20 నిమిషాల సేపు నానబెట్టాలి. ● పెరుగులో కప్పు నీరు పోసి చిలికి పక్కన ఉంచాలి. ● గుమ్మడి కాయ ముక్కలను ప్రెషర్ కుక్కర్ లేదా నేరుగా ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● శనగపప్పును నీటి నుంచి తీసి మరో గిన్నెలో వేసి అందులో కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా పేస్ట్ చేయాలి. ● పెనంలో ఉడికించిన గుమ్మడికాయ ముక్కలు, మిక్సీలో రుబ్బిన పేస్ట్ వేసి కప్పు నీటిని పోసి వేడి చేయాలి. ఈ మిశ్రమం ఉడకడం మొదలైన తర్వాత చిలికిన పెరుగు వేసి దించేయాలి. పోపు లేని మజ్జిగె హులి సిద్ధమైందన్న మాట. ● ఇప్పుడు మరొక పెనంలో నూనె వేడి చేసి ఆవాలు వేసి చిటపటలాడిన తరవాత జీలకర్ర వేయాలి. అవి కూడా వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ వేసి కలిపి ఈ పోపును మజ్జిగె హులిలో కలపాలి. ఇది కన్నడ స్టైల్ మజ్జిగ చారు.

తమిళ మురుంగక్కాయ్ మోర్ కొళంబు



కావలసినవి: మునక్కాయలు – 2; పెరుగు – కప్పు (చిలకాలి) ; పసుపు – టీ స్పూన్ ; పచ్చి కొబ్బరి తురుము – కప్పు ; బియ్యప్పిండి– టీ స్పూన్ ; ధనియాలు – టీ స్పూన్ ; జీలకర్ర– టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: వంట కొబ్బరి నూనె– టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు.

తయారీ: ● మునక్కాయలను కడిగి ముక్కలు చేసి కొద్దిగా నీరు పోసి ఉడికించాలి. ● బియ్యప్పిండిని అర కప్పు నీటిలో నానబెట్టాలి. ధనియాలను నూనె లేకుండా వేయించాలి. ● కొబ్బరి తురుము, ఉప్పు, పసుపు, బియ్యప్పిండి, జీలకర్ర, ధనియాలు, ఎండుమిర్చిలను మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఉడికించిన మునక్కాయ ముక్కల్లో వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని సన్న మంట మీద ఉడికించాలి, మరగడం మొదలైన తర్వాత పెరుగు కలిపి దించేయాలి. ● ఒక పెనంలో నూనె వేడి చేసి ఆవాలు వేసి చిటపటలాడిన తరవాత కరివేపాకు వేసి స్టవ్ ఆపేయాలి. ఈ పోపును పైన సిద్ధం చేసుకున్న మోర్ కొళంబులో వేసి కలిపి వడ్డించాలి.

జై సల్మీర్ కాలా చన్నా కఢీ



కావలసినవి: పచ్చి శనగలు – అర కప్పు ; పెరుగు – కప్పు (చిలకాలి) ; శనగపిండి – 2 టేబుల్ స్పూన్‌లు ; నీరు – 2 కప్పులు ; పసుపు – అర టీ స్పూన్ ; ధనియాల పొడి – టీ స్పూన్ ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; గరం మసాలా పొడి – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం : నెయ్యి – టీ స్పూన్ ; పచ్చి మిర్చి – ఒకటి (తరగాలి) ; జీలకర్ర – అర టీ స్పూన్.

తయారీ: ● పచ్చి శనగలను కడిగి రాత్రంతా నానబెట్టి ఉదయం మరోసారి కడిగి కుక్కర్‌లో ఐదారు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● పెనంలో శనగపిండి, పెరుగు, నీరు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా పొడి, మిరప్పొడి వేసి సమంగా కలిసే వరకు కలపాలి. ఇప్పుడు పెనాన్ని స్టవ్ మీద పెట్టి సన్న మంట మీద గరిటెతో కలుపుతూ వేడి చేయాలి. మరగడం మొదలైన తర్వాత ఉడికించిన శనగలన్నింటినీ వేసి కలపాలి. మిశ్రమం చిక్కగా కావాలంటే కొన్ని శనగలను మిక్సీలో గ్రైండ్ చేసి కొన్నింటిని అలాగే వేసుకోవచ్చు. మిశ్రమాన్ని సన్నమంట మీద కలుపుతూ ఉడికించుకోవాలి. ● మరొక పెనంలో నెయ్యి వేడి చేసి జీలకర్ర, పచ్చిమిర్చి తరుగు వేసి వేగిన తర్వాత మొత్తం మిశ్రమాన్ని ఉడికి సిద్ధంగా ఉన్న కఢీలో పోసి కలపాలి. వేడి వేడి జై సల్మీర్ కాలా చనా కఢీ రెడీ.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

వాట్ ఏ పలావర్!

వ్యాపార ఒప్పందం కుదరాలంటే చర్చలు జరగాలి. అయితే ఆ చర్చలు దారి తప్పి గందరగోళంగా మారినప్పుడు, అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నప్పుడు ఫలితం తేలకపోగా కాలయాపన జరుగుతుంది. ఇలాంటి వృథా ప్రయత్నాలకు సంబంధించి వాడే ఇడియమ్...వాట్ ఏ పలావర్!


ఉదా: *ది డెలిగేషన్ ఈజ్ ఇన్ పలావర్స్ విత్ దెయిర్ లీడర్స్*



ఇక దీని మూలాల్లోకి వెళితే...

18వ శతాబ్దంలో పోర్చుగీసు వర్తకులు స్థానిక ఆఫ్రికన్‌లతో వ్యాపార చర్చలు చేసేవారు. ఒకరి భాష మరొకరికి అర్థం కాకపోవడం వల్ల, ఇతర కారణాల వల్ల ఆ చర్చలు గందరగోళంగా మారేవి. ఏ ఫలితం లేకుండానే వృథాగా ఆగిపోయేవి. 'పలావర్' అంటే మాట అని అర్థం. ఆ తరువాత దీన్ని ఎందుకూ పనికి రాని మాటలు అనే అర్థంలో వాడుతున్నారు.

● టెక్.. టాక్



త్వరలో గ్రామర్లీ గో

గుర్తింపు పొందిన రైటింగ్ అసిస్టెంట్‌లలో 'గ్రామర్లీ' ఒకటి. ఈ ఏఐ అసిస్టెంట్ ద్వారా అక్షర, వ్యాకరణ దోషాలు నివారించవచ్చు. కాపీగా అనిపించే వాక్యాలు రాకుండ చూస్తుంది. 'గ్రామర్లీ' త్వరలో చాట్‌జీపిటీలాంటి రైటింగ్ అసిస్టెంట్ 'గ్రామర్లీ గో'ను తీసుకురానుంది. దీని ద్వారా టెక్ట్స్ రీరైట్ చేయడమే కాదు కొత్త టెక్ట్స్ క్రియేట్ చేయవచ్చు. ప్రాంప్ట్ ద్వారా కూడా టెక్ట్స్ క్రియేట్ చేయవచ్చు. దీనిలో టెక్ట్స్‌ను చదివే వాయిస్ ఆప్షన్ ఉంటుంది. మేధోమథనం చర్చల్లో ఐడియాలు జనరెట్ చేస్తుంది.

వన్‌ప్లస్ పాడ్



సైజ్: 11.61 అంగుళాలు
8జీబి ర్యామ్ 126 స్టోరేజ్
బ్యాటరీ: 9,510 ● 67 డబ్ల్యూ వైర్డ్ ఛార్జింగ్
స్క్రీన్ రిజల్యూషన్: 2800×2000 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
బరువు: 552 గ్రా. కలర్ ఆప్షన్: హ్యాలో గ్రీన్;

హ్యామర్ ఏస్ 3.0 స్మార్ట్‌వాచ్



డిస్‌ప్లే: 1.85 అంగుళాలు బ్యాటరీ: 190 ఎంఏహెచ్ ● ఇన్‌బిల్ట్ స్పీకర్
● సింగిల్ ఛార్జ్: 5 రోజులు ● డస్ట్ రెసిస్టెంట్
● 24×7 యాక్టివిటీ ట్రాకర్స్
● బ్లూటూత్: 5.0 ● ధర: రూ.1,999

సెల్ఫీ స్టిక్



ఈ బ్లూటూత్ ఎనేబుల్డ్ సెల్ఫీ స్టిక్ మొబైల్‌ఫోన్‌కు ఉపయోగపడుతుంది. రిమోట్‌ను నొక్కి ఫొటో కాప్చర్ చేయవచ్చు. బ్రాండ్: టైగాట్ డైమెన్షన్స్: 8×5×3 సెం.మీ రోటేటెడ్: 360 డిగ్రీ ప్లస్ 220 డిగ్రీ అడ్జస్ట్‌మెంట్

● సక్సెస్ స్టోరీ



ఆరోగ్యానికి వారధి

'అనుభవాలే పాఠాలు అవుతాయి' అనే మాటను అనేకసార్లు విని ఉన్నాం మనం. మరి అనుభవాలే అంకురాలు (స్టార్టప్) అవుతాయా? 'వై నాట్!' అంటున్నారు మయాంక్ కాలే (27), అమృత్‌సింగ్ (27) మూడు పదుల వయసు దాటకుండానే హెల్త్‌కేర్ అండ్ ఇన్సూటెక్ స్టార్టప్ 'లూప్'తో ఘన విజయం సాధించి సత్తా చాటారు. స్టార్టప్‌కు సామాజిక కోణం జత చేసి విజయవంతం అయ్యారు...

యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్(యూఎస్)లో చదువుకునే రోజుల్లో చదువును మధ్యలోనే ఆపేయాలని మయాంక్, అమృత్‌లు నిర్ణయించుకున్నప్పుడు వారి వారి తల్లిదండ్రులకు ఎంతమాత్రం నచ్చలేదు.

'ఇంతకీ ఏంచేయాలనుకుంటున్నారు?' అని అడిగారు.

తమ భవిష్యత్ చిత్రపటాన్ని రంగుల్లో చూపారు మయాంక్, అమృత్‌లు.

వారి వారి తల్లిదండ్రులకు నచ్చిందో లేదో తెలియదుగానీ 'ముందు చదువు పూర్తి చేయండి. ఆతరువాత ఆలోచిద్దాం' అన్నారు.

ఇప్పుడు చిన్న ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాలి మనం..

మయాంక్ యూనివర్సిటీలో ఉన్నప్పుడు తండ్రికి గుండెకు సంబంధించిన సమస్య వచ్చింది. దీంతో ఒక్కగానొక్క కొడుకైన మయాంక్ ఆఘమేఘాల మీద ఇండియాకు వచ్చాడు. తండ్రి సమస్య సర్జరీ వరకు వెళ్లింది.

ఇంటికి, హాస్పిటల్స్‌కు వెళ్లే క్రమంలో మయాంక్ ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. ఆ సమయంలో అతడికి గట్టిగా బోధపడిన సత్యం ఏమిటంటే 'ప్రైమరీ కేర్'కు ప్రాధాన్యం ఇస్తే ఎన్నో ప్రమాదాలను నివారించవచ్చు. ప్రమాదం ముంచుకు వచ్చినప్పుడుగానీ చాలామంది హాస్పిటల్స్‌కు వెళ్లడం లేదు. ఇది తన దృష్టిలో నిలిచిపోయింది.

> ఇంటికి, హాస్పిటల్స్‌కు వెళ్లే క్రమంలో మయాంక్ ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. ఆ సమయంలో అతడికి గట్టిగా బోధపడిన సత్యం ఏమిటంటే 'ప్రైమరీ కేర్'కు ప్రాధాన్యం ఇస్తే ఎన్నో ప్రమాదాలను నివారించవచ్చు.

యూనివర్సిటీకి తిరిగి వెళ్లిన తరువాత అమృత్‌తో కలిసి పేషెంట్ల హెల్త్‌కేర్‌కు సంబంధించి డిజిటల్ హెల్త్‌కేర్ రికార్డ్‌లను క్రియేట్ చేసే సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేశాడు. దీన్ని మహారాష్ట్రలోని గడ్చిరోలి గ్రామీణ ప్రాంతాలలో విజయవంతంగా ప్రయోగించారు.

ఈ విజయం వారిలోని ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

చదువులు పూర్తయిన తరువాత ఇండియాకు వచ్చారు మయాంక్, అమృత్.

గత విజయం ఇచ్చిన ఉత్సాహంతో రకరకాల అప్లికేషన్‌లను డెవలప్ చేయడం ప్రారంభించారు.

మన జనాభాలో అతి కొద్దిమందికి మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ ఉన్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా చాలా మందిలో 'మెడికల్ ఎడ్యుకేషన్' ఉండడం లేదు. దీనివల్ల వెళ్లాల్సిన దారిలో కాకుండా వేరే దారిలో వెళ్లి లేని సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. వర్క్‌ప్లేస్ ఇన్సూరెన్సులు పెరుగుతున్నాయి. అయితే వ్యక్తిగత (రిటైల్) ఇన్సూరెన్స్‌లు తగ్గాయి. దీనికి కారణం ఎవరిని సంప్రదించాలి? ఎలాంటి పాలసీలు తీసుకోవాలి... మొదలైన విషయాలపై అవగాహన లేకపోవడం... ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకొని పుణె కేంద్రంగా హెల్త్‌కేర్ అండ్ ఇన్సూటెక్ స్టార్టప్ 'లూప్'కు శ్రీకారం చుట్టారు మయాంక్, అమృత్‌సింగ్.

'లూప్' ద్వారా వైద్య విషయాలపై అవగాహనతో పాటు, ప్రైమరీ కేర్ (ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ)కు సంబంధించి డాక్టర్‌తో యాక్సెస్, ఫ్రీ కన్సల్టెషన్‌లు, ఆన్‌లైన్ యోగా సెషన్స్... మొదలైన ప్రయోజనాలు ఉన్నాయి.

కంపెనీలకు, ఇన్సూరెన్స్ ప్రొవైడర్‌లకు మధ్య 'లూప్' సంధానకర్తగా వ్యవహరిస్తోంది.

ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణె...మొదలైన పట్టణాలలో ఎన్నో కంపెనీలతో కలిసి పనిచేస్తోంది లూప్.

'మయాంక్, అమృత్‌లకు భారతీయ ఆరోగ్య వ్యవస్థపై మంచి అవగాహన ఉంది. అందుబాటులో ఉండే హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో లూప్ భవిష్యత్‌లో ఎంతోమందికి సహాయంగా నిలవనుంది' అంటున్నాడు గురుగ్రామ్‌కు చెందిన వెంచర్ క్యాపిటల్ ఫర్మ్ 'ఎలివేషన్ క్యాపిటల్' భాగస్వామి ఖందూజ.

ప్రస్తుతం ఉద్యోగుల హెల్త్-చెకప్‌కు ఉద్దేశించిన ఫిజికల్ 'లూప్-క్లీనిక్'లపై ట్రయల్స్ చేస్తున్నారు.

'లూప్'ను ఉపయోగిస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంది.

మయాంక్ (కో-ఫౌండర్ అండ్ సీఈఓ, లూప్), అమృత్ (కో-ఫౌండర్, లూప్)ల లక్ష్యం ఫలించింది అని చెప్పడానికి ఇది చాలు కదా!

అవును.. ఇది నిజమే!

● వాస్తవాల నుంచి మాత్రమే కాదు సినిమాల్లో నుంచి కూడా స్ఫూర్తి పొందడం అనేది జరుగుతుంటుంది. జర్మన్ మూకీ చిత్రం ఉమెన్ ఇన్ ది మూన్(1929) చరిత్ర సృష్టించింది. ఇందులో రాకెట్ లాంచ్ సీన్ ఉంది. దీని నుంచి స్ఫూర్తి పొంది రాకెట్ లాంచ్ సమయంలో



'నాసా' కౌంట్ డౌన్ సంప్రదాయాన్ని మొదలుపెట్టింది.

● స్కాటిష్ రీజినల్ ఎయిర్‌లైన్స్ వెస్ట్రే, పాప వెస్ట్రేల మధ్య షార్టెస్ట్ కమర్షియల్ ఫ్లైట్‌ను నడిపింది. ఈ రెండు దీవుల మధ్య దూరం 1.7 మైళ్లు!

● పదమూడవ శతాబ్దానికి చెందిన స్కాటిష్ తత్వవేత్త జాన్ డన్స్ స్కరస్ ఒక పొడవాటి టోపీ ధరించేవాడు. ఈ టోపి వల్లే ఆయనకు అంత జ్ఞానం వచ్చిందని చాలామంది నమ్మేవాళ్లు. ఆయన శిష్యులు కూడా 'డన్స్' టోపిని ధరించేవారు. అయితే కాలక్రమంలో ఈ టోపి ఆదరణ కోల్పోవడమే కాదు జోక్‌గా మారింది. జోకర్‌లు ఎక్కువగా ధరించేవారు. స్కూల్లో పనిష్‌మెంట్‌లలో ఉపయోగించేవారు!

భయపడే ముచ్చటే లేదు!

● గేమింగ్



సర్వైవల్ హారర్ గేమ్ 'రెసిడెంట్ ఇవిల్4' ఈనెల 24న విడుదల అవుతుంది. 2005లో వచ్చిన 'రెసిడెంట్ ఇవిల్4'కు ఇది రీమేక్. 'ఒరిజినల్ గేమ్‌కు వచ్చిన పాపులారిటీ వల్ల రీమేక్ అనేది కత్తి మీద సాము. అయినప్పటికీ అందరూ మెచ్చేలా సాంకేతిక మార్పులతో తీర్చిదిద్దాం' అంటున్నాడు గేమ్ ప్రొడ్యూసర్ యోషైకీ. డెవలప్‌మెంట్ టీమ్ మూడు భాగాలుగా విడిపోయి గ్రామం, కోట, ద్వీపం విభాగాలలో పనిచేసింది. హారర్ థీమ్‌ను దృష్టిలో పెట్టుకొని విజువల్స్‌ను జాగ్రత్తగా ఇంప్రూవ్ చేశారు. ఈ గేమ్‌లో ఆరు ఆప్షనల్ కంట్రోల్ స్కీమ్స్ ఉంటాయి. గేమ్‌కు సంబంధించిన క్యారెక్టర్ల ఫెషియల్ ఫీచర్స్‌ను నిజ జీవితంలోని వ్యక్తుల ఆధారంగా తీసుకున్నారు.

జానర్: సర్వైవల్ హారర్ మోడ్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

కీరవాణీ... మీరు టాప్ ఆఫ్ ది వరల్డ్

- రిచర్డ్ కార్పెంటర్



● రాజమౌళి, కీరవాణి



● రిచర్డ్ కార్పెంటర్

అమెరికన్ ప్రముఖ సంగీతదర్శకుడు, రచయిత, గాయకుడు రిచర్డ్ లిన్ కార్పెంటర్ ఇచ్చిన సర్‌ప్రైజ్ గిఫ్ట్‌కు కన్నీళ్లు పెట్టుకున్నారు సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు' పాటకు కీరవాణి ఆస్కార్ అవార్డును (రచయిత చంద్రబోస్‌ను కూడా అవార్డు వరించింది) అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆస్కార్ వేదిక మీద తాను రిచర్డ్ కార్పెంటర్ సాంగ్స్ వింటూ పెరిగానని చెబుతూ, ఆయన స్వరపరిచిన ప్రముఖ పాటల్లో ఒకటైన 'టాప్ ఆఫ్ ది వరల్డ్' స్టైల్‌లో తన భావాన్ని పాట రూపంలో వ్యక్తపరిచారు కీరవాణి. ఈ విషయంపై రిచర్డ్ కార్పెంటర్ సోషల్ మీడియా వేదికగా ''బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న మీకు (కీరవాణిని ఉద్దేశించి) హృదయపూర్వక శుభాకాంక్షలు'' అని పేర్కొన్నారు. అలాగే ''మీకు, మీకు కావల్సిన వారికి మా ఫ్యామిలీ నుంచి ఓ చిన్న సర్‌ప్రైజ్'' అంటూ కీరవాణి విజయాన్ని ప్రశంసిస్తూ 'టాప్ ఆఫ్ ది వరల్డ్' స్టయిల్‌లోనే తన కుమార్తెలతో శుభాకాంక్షల పాట పాడి, ''ఈ అవార్డుకు మీరు అర్హులు. టాప్ ఆఫ్ ది వరల్డ్‌పై మీరు నిలబడ్డారు'' అని ఓ వీడియోను షేర్ చేశారు రిచర్డ్ కార్పెంటర్. ''ఇది (కార్పెంటర్ వీడియోను ఉద్దేశిస్తూ...) నేను అస్సలు ఊహించలేదు. ఆనందభాష్పాలు ఆగడం లేదు. ఈ ప్రపంచం నుంచి నాకు అందిన అత్యద్భుతమైన బహుమతి ఇది'' అని పేర్కొన్నారు కీరవాణి.

మా అన్నయ్య కన్నీళ్లను ఆపుకోలేకపోయారు: రాజమౌళి

రిచర్డ్ కార్పెంటర్ షేర్ చేసిన వీడియోపై రాజమౌళి స్పందించారు. ''సార్ (రిచర్డ్‌ను ఉద్దేశించి).. ఆస్కార్ ప్రచారం మొత్తంలో నా సోదరుడు (కీరవాణిని ఉద్దేశించి) ఎలాంటి భావోద్వేగాలకు లోనవ్వలేదు. ఆస్కార్ అవార్డు గెలవడానికి ముందు, గెలిచిన తర్వాత కూడా ఆయన తన భావోద్వేగాలను బయటపెట్టలేదు. కానీ మీ వీడియోను చూసిన క్షణంలో మా అన్నయ్య కన్నీళ్లను అదుపు చేసుకోలేకపోయాడు. తన చెంపలపై ఆనందభాష్పాల ధార కారింది. మా కుటుంబానికి మర్చిపోలేని క్షణాలివి. చాలా థ్యాంక్స్'' అని పేర్కొన్నారు రాజమౌళి.

వేసవిలో నవ్వులు



● శ్రీనివాస్ రెడ్డి, హర్ష

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిషోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నూతన దర్శకుడు యలమంద చరణ్ తెరకెక్కించిన చిత్రం 'భువన విజయమ్'. లక్ష్మి సమర్పణలో కిరణ్, వీఎస్కే నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ మారుతి విడుదల చేసి, చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భువన విజయమ్'. క్యూరియాసిటీ పెంచే కథనంతో వినోదాత్మకంగా ఈ సినిమా సాగుతుంది. ఈ వేసవిలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఒకరు నెగటివ్‌గా కనిపించనున్నారు. ప్రేక్షకులు ఎప్పుడూ ఆమెను అలాంటి పాత్రలో చూడలేదు. ఇంకొకరు కన్నీళ్లు తెప్పించే పాత్రతో వచ్చారు.. అలాంటి పాత్రతో వచ్చినందుకు ఆనందభాష్పాలను ఆపుకోలేకపోయారామె. మరొకరు కథానాయికగా కనుమరుగై.. చెల్లెలిగా రిటర్న్ అవుతున్నారు. నటనకు ఒక్కసారి బ్రేక్ ఇచ్చాక మళ్లీ నటించాలంటే ఆ క్యారెక్టర్ ఎంతో బలమైనది అయ్యుంటేనే ఆ ఆర్టిస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. జయా బచ్చన్, షర్మిలా ఠాగూర్, జీవితలకు అలాంటి పాత్రలే దొరికాయి. అందుకే బ్రేక్‌లు తీశారు.. నటిగా మేకప్ వేసుకున్నారు. ఒక్కప్పటి ఈ స్టార్స్ రిటర్న్ కావడం అభిమానులకు ఆనందమే కదా. ఇక ఈ ముగ్గురి చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.



● జయా బచ్చన్

స్టార్ రిటర్న్స్

తొలిసారి నెగటివ్‌గా...

జయా బచ్చన్ కెరీర్ దాదాపు 60 ఏళ్లు. ఇన్నేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో నటిగా ఎన్నో అద్భుత పాత్రలు చేశారామె. కెరీర్ ఆరంభంలో 'గుడ్డి' (1971)లో చేసిన పాత్రతో 'గర్ల్ నెక్ట్స్ డోర్' ఇమేజ్ తెచ్చుకున్న జయ ఆ తర్వాత 'జవానీ దివానీ'లో గ్లామరస్ రోల్‌లో మెప్పించారు. అలాగే అనామిక (1973)లో కాస్త నెగటివ్ టచ్ ఉన్న పాత్ర చేసి, భేష్ అనిపించుకున్నారు. అయితే ఇన్నేళ్ల కెరీర్‌లో జయ పూర్తి స్థాయి నెగటివ్ క్యారెక్టర్ చేయలేదు. ఇప్పుడు చేస్తున్నారు. 'రాఖీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ'లో లేడీ విలన్‌గా కనిపించనున్నారామె. దాదాపు ఏడేళ్ల తర్వాత జయా బచ్చన్ ఒప్పుకున్న చిత్రం ఇది. కరణ్ జోహార్ స్వీయదర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జయా బచ్చన్‌తో కరణ్ నెగటివ్ క్యారెక్టర్ గురించి చెప్పగానే ''నేనా? నన్నే తీసుకోవాలని ఎందుకు అనుకున్నారు?' అని ఆమె అడిగారు... 'మీరే చేయాలి' అంటూ జయాని కన్విన్స్ చేయడానికి చాలా ప్రయత్నాలు చేశారు కరణ్. ఫైనల్‌గా 'ఓకే' అన్నారామె. అయితే ఈ పాత్రని అర్థం చేసుకుని, ఒక క్రూరమైన మనస్తత్వం ఉన్న వ్యక్తిలా నటించడానికి జయ కొన్నాళ్లు ఇబ్బందిపడ్డారట. ఆ తర్వాత పూర్తిగా ఆ పాత్రలోకి లీనం కాగలిగారని, నెగటివ్ క్యారెక్టర్‌ని ఆమె ఎంజాయ్ చేస్తున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ జంటగా రూపొందిన ఈ చిత్రం జులై 28న విడుదల కానుంది.



● షర్మిలా ఠాగూర్

పుష్కర కాలం తర్వాత...

పుష్కర కాలం తర్వాత షర్మిలా ఠాగూర్ ఓ సినిమా చేశారు. ఈ నెల 3న విడుదలైన 'గుల్‌మోహార్'లో ఆమె ఇంటి పెద్దగా లీడ్ రోల్ చేశారు. గుల్‌మోహార్ అనే తమ ఇంటిని అమ్మేసి, తాను వేరే రాష్ట్రానికి వెళతానని ఇంటి పెద్ద కుసుమ్ బాత్రా (షర్మిలా ఠాగూర్ పాత్ర) చెబుతారు. అప్పుడు ఆ కుటుంబ సభ్యుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. 'బ్రేక్ కే బాద్' (2010) సినిమా తర్వాత మళ్లీ మంచి పాత్రలు వచ్చేంతవరకూ బ్రేక్ తీసుకోవాలనుకున్నారు షర్మిలా. 'గుల్‌మోహార్'లో తన పాత్ర కీలకం కావడంతో పాటు మంచి ఎమోషన్స్ కనబరిచే చాన్స్ ఉన్నందున ఆమె అంగీకరించారు. ఈ సినిమా ప్రివ్యూ చూసి, షర్మిలా ఏడుపు ఆపుకోలేకపోయారు. ''పన్నెండేళ్ల తర్వాత ఒక మంచి పాత్రలో తెరపై కనిపించడంతో నన్ను నేను నియంత్రించుకోలేకపోయాను. ఈ సినిమాని మూడుసార్లు చూశాను. చూసిన ప్రతిసారీ ఏడ్చాను. అంతగా ఈ పాత్రతో కనెక్ట్ అయ్యాను'' అని షర్మిలా పేర్కొన్నారు.



● జీవిత

చెల్లెలిగా...

కథానాయికగా గర్ల్ నెక్ట్స్ డోర్ అనదగ్గ పాత్రల్లో కనిపించారు జీవిత. 'తలంబ్రాలు', 'ఆహుతి', 'అంకుశం' వంటి చిత్రాల్లో చేసిన పాత్రలతో మంచి నటి అనిపించుకున్నారామె. 'మగాడు' (1990) తర్వాత నటిగా వేరే సినిమాలు ఒప్పుకోలేదు. ఇప్పుడు రజనీకాంత్ అతిథి పాత్రలో ఆయన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్'లో నటించడానికి జీవిత ఒప్పుకున్నారు. ఇందులో ఆమెది రజనీ చెల్లెలి పాత్ర. ''నా కెరీర్‌లో రజనీ సార్‌తో సినిమా చేయలేదు. ఇప్పుడు కుదిరినందుకు హ్యాపీగా ఉంది. ఈ సినిమా ఒప్పుకోవడానికి కొంత టైమ్ తీసుకున్నాను. 'మీరు స్క్రీన్‌పై కనిపించి చాలా రోజులైంది కాబట్టి.. చేస్తే బాగుంటుంది' అని ఐశ్వర్య అనడం, నా ఫ్యామిలీ సపోర్ట్ వల్ల ఓకే చెప్పాను'' అని పేర్కొన్నారు జీవిత. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఆమె కనిపించనున్న చిత్రం ఇది. కాగా నటిగా ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ నిర్మాతగా 'గడ్డం గ్యాంగ్, దెయ్యం' వంటి చిత్రాలను నిర్మించారు. గత ఏడాది 'శేఖర్' చిత్రానికి దర్శకత్వం వహించారు జీవిత.

నిజం ఒక ధైర్యం



● నాగచైతన్య

'గాయపడిన మనసు ఆ మనిషిని ఎంత దూరం అయినా తీసుకుని వెళ్తుంది' అంటూ నాగచైతన్య చెప్పిన డైలాగ్‌తో 'కస్టడీ' సినిమా టీజర్ మొదలవుతుంది. నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా అరవింద్‌స్వామి, ప్రియమణి, శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం మే 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ''గాయపడిన మనసు ఆ మనిషిని ఎంత దూరం అయినా తీసుకుని వెళ్తుంది. అది ఇప్పుడు నన్ను తీసుకుని వచ్చింది ఒక యుద్ధానికి. ఇక్కడ చావు నన్ను వెంటాడుతుంది. అది ఎటునుంచి వస్తుందో ఎప్పుడు వస్తుందో ఎలా వస్తుందో నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా లేదు. ఎందుకంటే నా చేతిలో ఉన్న ఆయుధం ఒక నిజం. నిజం ఒక ధైర్యం. నిజం ఒక సైన్యం. యస్.. దట్ ట్రూత్ ఈజ్ ఇన్ మై కస్టడీ'' అని నాగచైతన్య పలికే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.



● మాళవిక, నాగశౌర్య, వివేక్, అవసరాల శ్రీనివాస్

విజయంపై నమ్మకంగా ఉన్నాం

- నాగశౌర్య

నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, దాసరి పద్మజ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నాగశౌర్య మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం మేం చాలా కష్టపడ్డాం. మా కష్టం థియేటర్స్‌లో తెలుస్తుంది. నా కెరీర్‌లో 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల గురించి ఎలా చెప్పుకున్నానో 'ఫలానా..' సినిమా గురించి అంతే బాగా చెప్పుకుంటాను. ఈ సినిమా విజయం పట్ల నమ్మకంగా ఉన్నాం'' అన్నారు. ''ఈ చిత్రంలోని పాత్రలు నిజజీవితంలో చూసినట్లుగా ఉంటాయి. ఎమోషనల్ మూవీ ఇది. నటనపై ఆధారపడ్డ సినిమా కాబట్టే సింక్ సౌండ్ ఉండాలని నిర్ణయించుకున్నాను. ఈ సినిమాలోని సంజయ్ పాత్రకు నాగశౌర్య బాగా సరిపోయాడు. ఏడు చాప్టర్లు ఉండే ఈ సినిమాలోని నాలుగో చాప్టర్ నాకు చాలా ఇష్టం. ఇంటర్వెల్‌కి ముందు వచ్చే ఈ చాప్టర్‌లో వచ్చే ఎమోషన్ ఇంతవరకు నేను తెలుగు సినిమాల్లో చూడలేదనేది నా అభిప్రాయం'' అన్నారు అవసరాల శ్రీనివాస్. ''నాగశౌర్య, మాళవికల సహజ నటన కోసం ఈ సినిమా చూడొచ్చు'' అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. ''ఇంత మంచి సినిమాలో మమ్మల్ని భాగం చేసిన విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారికి థ్యాంక్స్'' అన్నారు దాసరి ప్రసాద్.

విల్లాలో ఏం జరిగింది?



● తేజ, శ్రీను

విజయ్, శీతల్ భట్ జంటగా విగన్ క్రియేషన్స్ సమర్పణలో విద్యా గణేష్ నిర్మించిన చిత్రం 'విల్లా 369'. సురేష్ ప్రభు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి డా. రాకేష్ సహనిర్మాత. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన దర్శకుడు తేజ మాట్లాడుతూ – ''సురేష్ ప్రభు మంచి సబ్జెక్ట్‌ను ఎంచుకుని తీసిన సినిమా 'విల్లా 369'. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''ర్యాడీ రఫీ కెమెరా పనితనం, సంగీత దర్శకుడు మహావీర్ మ్యూజిక్ ఈ సినిమాకి అదనపు ఆకర్షణ. త్వరలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు విద్యా గణేష్. ''విల్లాలో ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు సురేష్ ప్రభు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	79	57,635
నిఫ్టీ ▲	13	16,986

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,679	▲	285
డోజోన్స్	32,200	▲	326
ఎఫ్‌టీఎస్ఈ 100	7,410	▲	66
డాక్స్	14,967	▲	232
షాంఘై	3,227	▽	36
నికాయ్	27,011	▽	219

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

టీసీఎస్‌కు షాక్!

- సీఈవో పదవికి రాజేశ్ గోపీనాథన్ గుడ్‌బై
- కొత్త సీఈవోగా కృతివాసన్


రాజేశ్ గోపీనాథన్ కృతివాసన్

న్యూఢిల్లీ: టీసీఎస్ ఎండీ, సీఈవో రాజేశ్ గోపీనాథన్ అనూహ్యంగా రాజీనామా ప్రకటించారు. దీంతో నూతన సీఈవోగా (డిజిగ్నేట్) బీఎఫ్ఎస్ఐ డివిజన్ గ్లోబల్ హెడ్‌గా ఉన్న కె.కృతివాసన్‌ను నియమించినట్టు కంపెనీ ప్రకటించింది. రాజీనామా ఇచ్చినప్పటికీ ఈ ఏడాది సెప్టెంబర్ 15 వరకు గోపీనాథన్ టీసీఎస్‌తోనే కొనసాగనున్నారు. ఈ కాలంలో కంపెనీ నిర్వహణ బాధ్యతలు సాఫీగా బదిలీ అయ్యేందుకు నూతన సారథికి సహకారం అందిస్తారని టీసీఎస్ ప్రకటించింది. కృతివాసన్‌కు టీసీఎస్‌తో 34 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉంది. 1989 నుంచి ఆయన టీసీఎస్‌తోనే కలసి పనిచేస్తున్నారు. తన కెరీర్‌లో కృతివాసన్ డెలివరీ, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ తదితర బాధ్యతల్లో పనిచేసినట్టు టీసీఎస్ తెలిపింది. టీసీఎస్ ఎండీ, సీఈవోగా ఉన్న ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూపు చైర్మన్‌గా పదోన్నతి పొందడంతో.. సీఎఫ్‌వోగా ఉన్న రాజేశ్ గోపీనాథన్ సంస్థ బాధ్యతలు చేపట్టారు. ఆరేళ్లుగా సంస్థకు ఎండీ, సీఈవోగా సేవలు అందించారు. టీసీఎస్‌లో 22 ఏళ్లుగా గోపీనాథన్ పనిచేస్తున్నారు. ''టీసీఎస్‌లో నా 22 ఏళ్ల ఉద్యోగ మజిలీని ఎంతో ఆస్వాదించాను. చంద్రతో సన్నిహితంగా కలసి పనిచేయడం పట్ల ఆనందంగా ఉంది. నా ఈ మొత్తం ప్రయాణానికి ఆయన మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఈ దిగ్గజ సంస్థకు గడిచిన ఆరేళ్లుగా నాయకత్వం వహించడం పట్ల సంతృప్తికరంగా ఉంది. ఈ కాలంలో అదనంగా 10 బిలియన్ డాలర్ల ఆదాయం, 70 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తోడయింది''అని గోపీనాథన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన వ్యక్తిగత ఆసక్తులకు సమయం కేటాయించేందుకు ఇదే సరైన సమయమని భావించి తప్పుకుంటున్నట్టు చెప్పారు.

భారత్‌లో ట్రూకాలర్ కార్యాలయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాలర్ ఐడీ వెరిఫికేషన్ ప్లాట్‌ఫామ్ ట్రూకాలర్ బెంగళూరులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. స్వీడన్‌కు వెలుపల ప్రత్యేకంగా కేంద్రాన్ని నెలకొల్పడం ఇదే తొలిసారి అని కంపెనీ ప్రకటించింది. అలాగే సంస్థకు ఇది రెండవ అతి పెద్ద సెంటర్ కూడా. 30,443 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆఫీసులో 250 మంది సిబ్బంది వరకు పనిచేయడానికి ఏర్పాట్లు ఉన్నాయి. కొన్ని ఫీచర్లను తొలిసారిగా ఇక్కడి కస్టమర్లకు అందించడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సేవలను విస్తరించడానికి ట్రూకాలర్ ఈ సౌకర్యాన్ని ప్రాథమిక కేంద్రంగా ఉపయోగించాలని యోచిస్తోంది. ట్రూకాలర్‌కు 33.8 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. వీరిలో భారత్ నుంచి 24.6 కోట్ల మంది ఉండడం విశేషం.

పతంజలి ప్రమోటర్ల వాటాలు సీజ్

- 25 శాతం ప్రజల వాటా నిబంధనలో వైఫల్యం
- బీఎస్ఈ, ఎన్ఎస్ఈ చర్య
- ఎలాంటి ప్రభావం పడదన్న పతంజలి ఫుడ్స్



న్యూఢిల్లీ: ప్రజల వాటా కనీసం 25 శాతం ఉండాలన్న నిబంధన అమలులో విఫలమైనందుకు పతంజలి ఫుడ్స్ ప్రమోటర్ల వాటాలను ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్తంభింప (ఫ్రీజ్) చేశాయి. ఈ చర్య కంపెనీ పనితీరుపై ఎలాంటి ప్రభావం చూపించదని పతంజలి ఫుడ్స్ పేర్కొంది. పతంజలి ఆయుర్వేద్ సహా 21 ప్రమోటర్ సంస్థల వాటాలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఫ్రీజ్ చేసినట్టు పతంజలి అంతకుముందు ప్రకటించింది. 'డిస్‌క్లోజర్' నిబంధనల కింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తాజా విషయాన్ని తెలియజేసింది. కనీస ప్రజల వాటా నిబంధన అమలుకు కట్టుబడి ఉన్నట్టు ప్రమోటర్ల నుంచి తమకు సమాచారం అందినట్టు పతంజలి ఆయుర్వేద్ తెలిపింది. ప్రజల వాటాను పెంచేందుకు మెరుగైనది ఏదనే విషయమై వారు చర్చిస్తున్నట్టు ప్రకటించింది. వచ్చే కొన్ని నెలల్లో ఈ నిబంధనను అమలు చేయనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం పతంజలి ఫుడ్స్‌లో ప్రమోటర్లకు 80.82 శాతం వాటా ఉంది. నిబంధనల ప్రకారం 75% మించకూడదు. అంటే మరో 5.82% వాటా విక్రయించాల్సి ఉంటుంది.

నేపథ్యం..: రుచి సోయా ఇండస్ట్రీస్ (పతంజలి ఫుడ్స్ పూర్వపు పేరు)ని దివాలా పరిష్కార ప్రక్రియ కింద 2019 సెప్టెంబర్‌లో పతంజలి గ్రూప్ సొంతం చేసుకుంది. దీంతో సంస్థలో ప్రమోటర్లు, ప్రమోటర్ల సంస్థలకు 98.87 శాతం వాటా లభించింది. 2022 మార్చిలో ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌కు పతంజలి ఫుడ్స్ వచ్చింది. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరును రూ. 648 చొప్పున 6.61 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో ప్రజల వాటా 19.18 శాతానికి పెరిగింది. నిబంధనల ప్రకారం 2022 డిసెంబర్ 18 నాటికి ప్రజల వాటా 25%కి చేర్చాల్సి ఉంది.

మరో ఎఫ్‌పీవో: బాబా రామ్‌దేవ్

ఏప్రిల్‌లో మరో విడత ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) చేపట్టనున్నట్టు పతంజలి ఫుడ్స్ ప్రకటించింది. తద్వారా ప్రజల వాటా కనీసం 25% ఉండాలన్న నిబంధనను అమలు చేస్తామని తెలిపింది. పతంజలి గ్రూప్ అధినేత బాబా రామ్‌దేవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ఇన్వెస్టర్లు ఆందోళన చెందడానికి ఎటువంటి కారణం లేదన్నారు. పతంజలి ఫుడ్స్ కార్యకలాపాలు, ఆర్థిక పనితీరుపై ఎక్స్ఛేంజీల చర్య ప్రభావం చూపించదని భరోసా ఇచ్చారు. తాము 6% వాటాలను తగ్గించుకుంటామని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడమే జాప్యానికి కారణమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిశాక ఏప్రిల్‌లో ఎఫ్‌పీవో చేపడతామన్నారు.

మారుతీ సుజుకీ ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్



హైదరాబాద్: దేశీయ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన ఎస్‌యూవీ ఆల్ న్యూ గ్రాండ్ విటారాతో ''ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్''ను నిర్వహించింది. సుమారు 300 మందికి పైగా కస్టమర్లు ర్యాలీలో పాల్గొని ఆల్ న్యూ గ్రాండ్ విటారా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నెక్సా డీలర్లు పాల్గొన్నారు. సుజుకీ పేటెంట్ కలిగి ఆల్‌గ్రిప్ సెలెక్ట్ ట్రిమ్ ధర రూ.16.89 లక్షలు ఉంది. ఈ వేరియంట్ లీటరుకు 19.38 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,341	▲	432
బంగారం (99.5 స్వచ్ఛత)	58,107	▲	436
వెండి (కిలో)	67,311	▲	450

అయిదు రోజుల నష్టాలకు చెక్!

- కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు
- ఇంట్రాడేలో తీవ్ర ఊగిసలాట



ముంబై: అయిదురోజుల వరుస నష్టాల తర్వాత స్టాక్ సూచీలు గురువారం లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయంగా నెలకొన్న మిశ్రమ సంకేతాల నేపథ్యంలో సూచీలు ట్రేడింగ్‌లో అధిక సమయం నష్టాల్లోనే కదలాడాయి. అయితే చివర్లో బ్యాంకింగ్, ఇంధన, ఫైనాన్స్ షేర్లకు కనిష్టాల వద్ద కొనుగోళ్లు లభించడంతో అయిదు రోజుల తర్వాత నష్టాల నుంచి గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 57,511 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 729 పాయింట్లు పరిధిలో 57,159 వద్ద కనిష్టాన్ని 57,887 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 79 పాయింట్లు పెరిగి 57,635 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16,995 వద్ద లాభంతో మొదలైంది. రోజంతా నిఫ్టీ 212 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి 13 పాయింట్ల స్వల్ప లాభంతో 16,986 వద్ద నిలిచింది. మెటల్, ఐటీ, ప్రైవేట్ రంగ బ్యాంక్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.282 కోట్ల షేర్లను అమ్మేశారు. మొత్తం ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ. 8800 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,501 కోట్ల షేర్లను కొన్నారు. అంతర్జాతీయ బ్యాంకింగ్ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ఆసియా నష్టపోయాయి. స్విస్ సెంట్రల్ బ్యాంక్ నుంచి భారీ మొత్తంలో రుణాన్ని తీసుకుంటామని క్రెడిట్ సూసీ బ్యాంక్ తెలపడంతో యూరప్ మార్కెట్లు భారీ పతనం నుంచి తేరుకుని స్వల్ప నష్టంతో ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

'సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూసీ బ్యాంక్ సంక్షోభ ప్రభావం మరిన్ని బ్యాంకులకు విస్తరించవచ్చనే భయాలతో ఇన్వెస్టర్లు పొజిషన్లను హోల్డ్ చేసేందుకు ఆసక్తి చూపలేదు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) 50 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల పెంపు నిర్ణయానికి మార్కెట్ వర్గాలు స్పందిస్తాయనే అంశంపై తదుపరి ట్రేడింగ్ ఉండొచ్చు' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ షేర్లు ఐదుశాతం అప్పర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి. అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ, అదానీ పోర్ట్స్ ఒక శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ అరశాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ మూడుశాతం, ఎన్‌డీటీవీ రెండుశాతం, అదానీ పవర్ ఒకటిన్నర శాతం, అదానీ విల్మార్ ఒకశాతం నష్టపోయాయి.

క్రెడిట్ సూసీకి 'స్విస్ బ్యాంక్' భరోసా

- 54 బిలియన్ డాలర్ల రుణానికి ఓకే
- బ్యాంకు షేర్లు రయ్



న్యూఢిల్లీ: ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న క్రెడిట్ సూసీకి స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంకు అండగా నిల్చింది. వ్యవస్థాగతంగా కీలకమైన బ్యాంకుపై ఇన్వెస్టర్లు, డిపాజిటర్లలో నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు, దానిపై నమ్మకాన్ని కలిగించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా 54 బిలియన్ డాలర్ల మేర రుణాన్ని అందించేందుకు అంగీకరించింది. క్రెడిట్ సూసీ గురువారం ఈ విషయం వెల్లడించింది. దీంతో బ్యాంకు షేరు ఒక దశలో ఏకంగా 33% ఎగిసి 2.17 స్విస్ ఫ్రాంకులకు (1 స్విస్ ఫ్రాంకు సుమారు రూ. 89) పెరిగింది. అటు యూరప్ బ్యాంకింగ్ షేర్లు కూడా ఒక మోస్తరుగా పెరిగాయి. మరింతగా పెట్టుబడులు పెట్టేందుకు సౌదీ ఇన్వెస్టరు నిరాకరించారన్న వార్తలతో క్రెడిట్ సూసీ షేరు బుధవారం 30% కుప్పకూలిన సంగతి తెలిసిందే. అమెరికాలో వారం రోజుల వ్యవధిలో రెండు బ్యాంకులు (ఎస్‌వీబీ, సిగ్నేచర్) మూతబడటం, క్రెడిట్ సూసీ ఆర్థిక పరిస్థితిపై నీలినీడలు కమ్ముకోవడం తదితర పరిణామాలతో అంతర్జాతీయంగా బ్యాంకింగ్ సంక్షోభం ముంచుకొస్తోందన్న ఆందోళన నెలకొంది. అయితే, ఈ భయాలను తొలగించేందుకు, అంతర్జాతీయంగా కీలక బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న క్రెడిట్ సూసీని నిలబెట్టేందుకు స్విస్ నేషనల్ బ్యాంక్ రంగంలోకి దిగింది. మూలధనం, లిక్విడిటీపరమైన నిబంధనలకు అనుగుణంగా క్రెడిట్ సూసీ ఉంటే బ్యాంక్‌కు అవసరమైన తోడ్పాటు అందిస్తామని ప్రకటించింది.

ఈసీబీ అర శాతం వడ్డీరేటు పెంపు

ఫ్రాంక్‌ఫర్ట్: యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) గురువారం భారీగా అరశాతం వడ్డీ రేటును పెంచింది. అమెరికాలో రెండు బ్యాంకుల పతనం, క్రెడిట్ సూసీలో ఇబ్బందులు, గ్లోబల్ బ్యాంకింగ్ వ్యవస్థపై అధిక రేట్ల ప్రభావం గురించి భయాందోళనల నేపథ్యంలో ప్రస్తుతానికి ఈసీబీ వడ్డీరేట్లను పెంచకపోవచ్చన్న అంచనాలకు భిన్నంగా ఈసీబీ తాజా నిర్ణయం తీసుకుంది. దీనితో కీలక రుణ రేటు 3.5 శాతానికి చేరింది. తాజా నిర్ణయంతో తీవ్రంగా పెరుగుతున్న ధరల పెరుగుదలే తక్షణ కర్తవ్యమని సంకేతాలు ఇచ్చింది. ద్రవ్యోల్బణం 2 శాతం లక్ష్యంకాగా, ఇది 8.5 శాతానికి చేరుకోవడంతో పలు దఫాల్లో ఈసీబీ రేటు పెంపు నిర్ణయాలను తీసుకుంటూ వస్తోంది.

సన్‌రైజర్స్ జెర్సీ ఆవిష్కరణ

ఐపీఎల్-2023కి సంబంధించి హైదరాబాద్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ సందడి మొదలు పెట్టింది. తాజా సీజన్ కోసం రూపొందించిన కొత్త జెర్సీని గురువారం ఆవిష్కరించింది. గత ఏడాదితో పోలిస్తే స్వల్ప మార్పులతో ఈ జెర్సీని సిద్ధం చేసింది. మరో వైపు మూడు సీజన్ల విరామం తర్వాత హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులకు ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తోంది. 2019 ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగిన తర్వాత కరోనా కారణంగా మళ్లీ నగరంలో మ్యాచ్‌లు జరగలేదు. ఈ నేపథ్యంలో హోం టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. హైదరాబాద్‌లో జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు (ఏప్రిల్ 2న రాజస్తాన్‌తో, ఏప్రిల్ 9న పంజాబ్‌తో) టీమ్ ఫ్రాంచైజీ ఫ్యాన్స్ కోసం టికెట్లను అమ్మకానికి ఉంచింది. రూ. 781 మొదలు రూ. 11,719 వరకు వేర్వేరు ధరల్లో టికెట్లు అందుబాటులో ఉన్నాయి.



నిఖత్ జోరు

ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్‌కు



న్యూఢిల్లీ: వరల్డ్ ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. తన పంచ్ పవర్ చూపిస్తూ ఆమె రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన తొలి రౌండ్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ 50 కేజీల కేటగిరీలో రిఫరీ స్టాప్స్ కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా అనాఖనిమ్ ఇస్మాయిలోవా (అజర్‌బైజాన్)ను చిత్తు చేసింది. నిఖత్ పంచ్‌లను తట్టుకోలేక అనాఖనిమ్ చేతులెత్తేయడంతో రిఫరీ జోక్యం చేసుకొని బౌట్‌ను నిలిపేశారు. రెండో రౌండ్‌లో రామేసా బౌలర్ (అల్జీరియా)తో నిఖత్ తలపడుతుంది. ఇతర భారత బాక్సర్లలో సాక్షి చౌదరి, నుపుర్ షెరాన్, ప్రీతి కూడా తొలి రౌండ్‌లలో విజయాలు సాధించి ముందంజ వేశారు. సాక్షి (52 కేజీలు) 5-0 తేడాతో మారియా జోస్ (కొలంబియా)పై, నుపుర్ (81 ప్లస్ కేటగిరీ) 5-0 స్కోరుతో అబోలా జాక్‌మన్ (గయానా)పై ఘన విజయం సాధించారు. మరో వైపు 54 కేజీల విభాగంలో ప్రీతి కూడా ఆర్ఎస్‌సీ ద్వారా గెలుపొందింది. ఆమె జోరు ముందు హనా లకోటర్ (హంగేరీ) నిలవలేకపోయింది. నేడు జరిగే పోటీల్లో భారత బాక్సర్లు జాస్మీన్ లంబోరియా, శశి చోప్రా, శ్రుతి యాదవ్ బరిలోకి దిగుతారు.

గుజరాత్ సంచలన విజయం


గుజరాత్ జట్టు సంబరం

- 11 పరుగులతో ఓడిన ఢిల్లీ
- ఉమెన్ ప్రీమియర్ లీగ్

ముంబై: స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడంలో తడబడిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య పరాజయాన్ని మూటగట్టుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. లారా వోల్‌వార్ట్ (45 బంతుల్లో 57; 6 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లీ గార్డనర్ (33 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలతో చెలరేగగా... హర్లీన్ డియోల్ (33 బంతుల్లో 31; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. వోల్‌వార్ట్, గార్డనర్ మూడో వికెట్‌కు 53 బంతుల్లోనే 81 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. జెస్ జొనాసెన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఢిల్లీ 18.4 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. మరిజాన్ కాప్ (29 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, అరుంధతి రెడ్డి (17 బంతుల్లో 25; 4 ఫోర్లు), అలైస్ కాప్సీ (11 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కొద్దిగా పోరాడారు. ప్రధాన బ్యాటర్లు షఫాలీ వర్మ (8), కెప్టెన్ మెగ్ లానింగ్ (18), జెమీమా రోడ్రిగ్స్ (1) విఫలం కావడం ఢిల్లీని దెబ్బ తీసింది. కిమ్ గార్త్, గార్డ్‌నర్, తనూజ కన్వర్ తలా 2 వికెట్లు పడగొట్టారు.

క్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ సూపర్ 1000 టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో భారత జోడి పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం 50 నిమిషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా 21-14, 24-22తో ప్రపంచ మాజీ నంబర్ వన్ జపాన్ జోడి యుకీ ఫుకుషిమా - సయాకా హిరోటాను ఓడించింది. పురుషుల డబుల్స్‌లో మాత్రం భారత్ టాప్ జోడి, ఆరో సీడ్ సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి అనూహ్యంగా వెనుదిరిగారు. ప్రిక్వార్టర్ పోరులో సాత్విక్-చిరాగ్‌పై 10-21, 21-17, 21-19తో లియాంగ్ వి కెంగ్ - వాంగ్ చాంగ్ (చైనా) గెలుపొందారు. పురుషుల సింగిల్స్ విభాగంలోనూ భారత్‌కు పూర్తి నిరాశ ఎదురైంది. బరిలో ఉన్న ముగ్గురు ఆటగాళ్లు ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. అండర్సన్ అంటాన్సెన్ (డెన్మార్క్) 21-13, 21-15 స్కోరుతో లక్ష్యసేన్‌పై, మూడో సీడ్ ఆంథోనీ గిన్‌టింగ్ (ఇండోనేసియా) 22-20, 15-21, 21-17తో హెచ్ఎస్ ప్రణయ్‌పై, కొడాయ్ నరోకా(జపాన్) 21-17, 21-15తో కిడాంబి శ్రీకాంత్‌పై విజయం సాధించారు.



వన్డే సమరానికి సై

- నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి మ్యాచ్
- కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా
- ఆత్మవిశ్వాసంతో ఆసీస్
- మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాధారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య ఏ ఫార్మాట్‌లో పోరు అయినా ఆసక్తిని రేపుతుంది. కానీ బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఉన్న ప్రాధాన్యత కారణంగా టెస్టు మ్యాచ్‌లపై ఇటీవలి వరకు అందరి దృష్టి నిలవగా, త్వరలో జరగబోయే ఐపీఎల్‌పై కూడా చర్చ షురూ కావడంతో ఈ వన్డే సిరీస్‌పై హడావిడి కాస్త తక్కువగా కనిపిస్తోంది. పైగా వరల్డ్ కప్ సూపర్ లీగ్‌లో కూడా ఈ సిరీస్ భాగం కాదు. అయితే ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వరల్డ్ కప్ కోసం రిహార్సల్‌గా ఆసీస్ ఈ సిరీస్‌ను చూస్తుండగా... భారత్ కూడా మెగా టోర్నీకి తమ అత్యుత్తమ వన్డే టీమ్‌ను ఎంచుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో మూడు వన్డేల్లో ఫలితంకంటే వ్యక్తిగత ప్రదర్శనలే కీలకం.



ముంబై: టెస్టు సమరం తర్వాత భారత్, ఆస్ట్రేలియా వన్డేల్లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య నేడు వాంఖెడే మైదానంలో తొలి వన్డే జరుగుతుంది. ఈ ఫార్మాట్‌లో వరుస విజయాలతో టీమిండియా నిలకడ ప్రదర్శించగా...దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత కంగారూ బృందం వన్డే బరిలోకి దిగుతోంది. బలాబలాల దృష్ట్యా ఇరు జట్లు సమంగా కనిపిస్తుండగా, అంతిమ విజేత ఎవరో చూడాలి. మరో వైపు వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి వన్డేకు దూరం కావడంతో హార్దిక్ పాండ్యా తొలి సారి వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపడుతున్నాడు. భారత్‌కు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన 27వ ఆటగాడిగా పాండ్యా నిలుస్తాడు.

పటిదార్‌కు అవకాశం!

భారత జట్టు ఇటీవలి ఫామ్ చూస్తే తుది జట్టు విషయంలో ఎలాంటి సమస్య లేదు. అద్భుతమైన ఆటతో గిల్ తన ఓపెనింగ్ స్థానాన్ని ఖరారు చేసుకోగా, రోహిత్ గైర్హాజరులో కిషన్‌కు మళ్లీ టీమ్‌లో చోటు ఖాయం. వీరిద్దరు శుభారంభం అందిస్తే జట్టు భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. గత ఏడు వన్డేల్లో 3 సెంచరీలు బాదిన కోహ్లి ఆట గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన 75 సెంచరీల జాబితాలో మరిన్ని చేర్చుకునేందుకు ఇది అతనికి మరో అవకాశం. మిడిలార్డర్‌లో మెరుగైన రికార్డు ఉన్న రాహుల్ కూడా సత్తా చాటాల్సి ఉంది. అయితే నాలుగో స్థానంలో రెగ్యులర్‌గా ఆడే శ్రేయస్ గాయం కారణంగా దూరం కావడంతో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరం. సూర్యకుమార్ ఈ స్థానం కోసం అసలైన పోటీదారే అయినా ఆడిన 20 వన్డేల్లో అతని పేలవ రికార్డు సందేహాలు రేకెత్తిస్తోంది. కొత్త ఆటగాడు రజత్ పటిదార్‌నుంచి అతనికి పోటీ ఎదురవుతోంది. ఆల్‌రౌండర్లుగా హార్దిక్, జడేజా తమ స్థాయి ఆటను ప్రదర్శిస్తే తిరుగుండదు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా షమీ, సిరాజ్ ఉంటే బ్యాటింగ్ బలం కోసం శార్దుల్‌ను ఎంపిక చేయవచ్చు. ఏకైక స్పిన్నర్ స్థానంకోసం అక్షర్, సుందర్ మధ్య పోటీ ఉంది.

మ్యాక్స్‌వెల్‌పై దృష్టి...



కమిన్స్, హాజల్‌వుడ్‌తో పాటు జాయ్ రిచర్డ్సన్ లాంటి పేసర్లు దూరమైనా ఆస్ట్రేలియా జట్టుకు ఎలాంటి ఇబ్బంది లేదు. కావాల్సినన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. వరుసగా ఆల్‌రౌండర్లలో జట్టు నిండి ఉంది. గాయం నుంచి కోలుకొని చాలా రోజుల తర్వాత మ్యాక్స్‌వెల్ బరిలోకి దిగుతుండటం జట్టు బలాన్ని పెంచింది. ఫించ్ రిటైర్మెంట్ తర్వాత ఆడుతున్న తొలి సిరీస్‌లో అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు హెడ్ ఉవ్విళ్లూరుతున్నాడు. టెస్టుల్లో చెత్త ప్రదర్శన చూపిన వార్నర్ ఇక్కడైనా రాణించడం కీలకం. ఎప్పటిలాగే స్మిత్, లబుషేన్ బ్యాటింగ్ జట్టుకు కీలకం కానుంది. మిచెల్ మార్ష్, స్టొయినిస్, సీన్ అబాట్, అస్టన్ అగర్...ఈ నలుగురు ఆల్‌రౌండర్లు తుది జట్టులోని రెండు స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఎవరికి అవకాశం దక్కినా వారు టీమ్ విలువ పెంచగల సమర్థులు. ప్రధాన పేసర్‌గా స్టార్క్ ముందుండి నడిపించనుండగా యువ ఆటగాడు ఎలిస్‌కు కూడా అవకాశం ఖా యం. లెగ్‌స్పిన్నర్ జంపా భారత బ్యాట ర్లను ఇబ్బంది పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించగలడు.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ (కెప్టెన్), గిల్, కిషన్, కోహ్లి, సూర్యకుమార్ / రజత్ పటిదార్, రాహుల్, జడేజా, సుందర్, శార్దుల్, సిరాజ్, షమీ.

ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), వార్నర్, హెడ్, లబుషేన్, మార్ష్/ స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, క్యారీ, గ్రీన్, స్టార్క్, జంపా, ఎలిస్.

పిచ్, వాతావరణం

మొదటి నుంచీ వాంఖెడేమైదానం బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. ఛేదన ఇంకా సులువు కాబట్టి గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. ఇరు జట్ల మధ్య ఈ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్ (2020)లో ఆసీస్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో వార్నర్, ఫించ్ మెరుపు సెంచరీలు చేశారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ముగ్గురికి ధ్రువీకరణ పత్రాలు

ప్రగతిభవన్‌లో కేసీఆర్‌ను కలిసిన నవీన్‌రావు, దేశపతి, చల్లా



సీఎం కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన చల్లా వెంకట్రామిరెడ్డి, దేశపతి, నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు అభ్యర్థులు కుర్మయ్యగారి నవీన్‌రావు, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ముగ్గురు అభ్యర్థులు గురువారం అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలు అందుకున్నారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితోపాటు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ముగ్గురు నేతలు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్సీలు నవీన్ రావు, గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం ఈ నెల 29న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక కోసం ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల కాగా అదేరోజు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. ఈ నెల 9న బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా నవీన్‌రావు, దేశపతి శ్రీనివాస్ చల్లా వెంకట్రామిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికాగా, బీఆర్‌ఎస్‌కు ఆ ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. దీంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

గెలుపుబాటలో ఏవీఎన్ రెడ్డి!

- 19వ రౌండ్ ముగిసేసరికి 1,312 ఓట్ల ఆధిక్యం
- కొనసాగుతున్న 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు



సాక్షి, హైదరాబాద్‌: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత కూడా కొనసాగుతోంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా 19 రౌండ్లు ముగిసే సరికి 18 మంది ఎలిమినేట్ అయ్యారు. బరిలో మరో ముగ్గురు మిగిలారు. కడపటి వార్తలందే సరికి, సమీప ప్రత్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిపై బీజేపీ బలపరిచిన ఏవీఎన్‌రెడ్డి 1,312 ఓట్ల ఆధిక్యంతో ఉన్నారు. ఏవీఎన్‌రెడ్డికి 9,259 ఓట్లు రాగా, చెన్నకేశవరెడ్డికి 7,947 ఓట్లు పోలయ్యాయి. మాణిక్‌రెడ్డికి 5,405, హర్షవర్ధన్‌రెడ్డికి 2,479 ఓట్లు లభించాయి. తుది ఫలితం వెల్లడికి ఇంకా సమయం పట్టనుంది.

మల్టిపుల్ ఎంట్రీ గందరగోళం

ఉన్నతవిద్య సదస్సులో నీపా వీసీ సుధాంశు భూషణ్



సదస్సులో మాట్లాడుతున్న సుధాంశు భూషణ్. చిత్రంలో ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: ఉన్నత విద్యాసంస్థల్లో తీసుకొచ్చిన మల్టీపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానం గందరగోళంగా ఉందని జాతీయ విద్యాప్రణాళిక, పాలన సంస్థ(నీపా) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుధాంశు భూషణ్ అన్నారు. మూడేళ్ల డిగ్రీ కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచడంపై మరింత స్పష్టత ఇవ్వాలని సూచించారు. ఉన్నతవిద్యలో సంస్కరణలు, సవాళ్లపై వివిధ రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లతో నీపా హైదరాబాద్‌లో రెండురోజుల సదస్సు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గురువారం తొలిరోజు సదస్సులో భూషణ్ కీలకోపన్యాసం చేశారు. ఉన్నతవిద్యలో నాణ్యతాప్రమాణాల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

తెలంగాణలో ప్రగతిశీల నిర్ణయాలు: లింబాద్రి

ఉన్నతవిద్యలో తెలంగాణ రాష్ట్రం ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటోందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. రాష్ట్రంలో బకెట్ విధానం, క్రెడిట్ పాలసీ వంటి సంస్కరణలు తెచ్చామని చెప్పారు. జాతీయ విద్యావిధానంపై అందరి అభిప్రాయాలతో పుస్తకం విడుదల చేయాలని నీపా డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ మిశ్రా సూచించారు. ఉన్నతవిద్యలో డేటా సైన్స్, కట్టింగ్ ఎడ్జ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులు ప్రవేశపెట్టినట్టు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులకోసం రైతుల ఆందోళన

- వ్యాపారి ఇంటి ముందు ధర్నా

ఖలీల్‌వాడి: ధాన్యం డబ్బులకోసం నిజామాబాద్ నగరంలో వడ్ల వ్యాపారి గంప శ్రీనివాస్ ఇంటి ముందు గురువారం రైతులు ధర్నాకు దిగారు. భీమ్‌గల్ మండలం కుప్పకంటి, జగిర్యాల, పెద్దం గంటి తండాకు చెందిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో వడ్ల వ్యాపారి దగ్గరలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావడంతో రైతులు కూడా అక్కడికి చేరుకుని ఎస్సై శ్రావణ్‌కుమార్‌కు తమ సమస్య విన్నవించారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 15న డబ్బులు చెల్లిస్తానని వ్యాపారి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఎస్సై రైతులను సముదాయించి.. ఫిర్యాదు చేస్తే శ్రీనివాస్‌పై కేసు నమోదు చేస్తామని తెలిపారు. అయితే కేసు నమోదు చేస్తే డబ్బులు రావని, ఇప్పటికే అప్పుల్లో ఉన్నామని, శ్రీనివాస్ నుంచి రావాల్సిన రూ.1.70 కోట్ల డబ్బులు ఇప్పించాలని రైతులు కోరారు. అక్కడి నుంచి మళ్లీ వ్యాపారి ఇంటికి చేరుకొని రైతులు మరోసారి ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు వ్యాపారి ఇంటి వద్ద బందోబస్తు చేపట్టారు. 15 నెలల క్రితం శ్రీనివాస్‌కి ధాన్యం విక్రయించామని, అప్పటి నుంచి డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని ఆరోపించారు. దీంతో పోలీసులు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రంలో మళ్లీ కరోనా ఉధృతి

రెండో వారాల్లోనే రెట్టింపు కేసులు

- కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక...
- గత వారం ఏకంగా 267 కేసులు నమోదు
- ఆందోళన వద్దు: ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో గత వారంలో కరోనా కేసులు గణనీయంగా పెరిగాయని కేంద్రప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణలో గత వారంలో 132 కరోనా కేసులు నమోదు కాగా, మార్చి 15తో ముగిసిన వారంలో ఆ సంఖ్య 267కి పెరిగిందని వెల్లడించింది. ఫిబ్రవరి 15 నుంచి కరోనా కేసుల్లో పెరుగుదల కనిపిస్తోందని పేర్కొంది. ఫిబ్రవరి 15–21 మధ్య తెలంగాణలో 44 కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 22–28 మధ్య 95 కేసులు, మార్చి 1–8 మధ్య 132 కేసులు, మార్చి 9–15 మధ్య 267 కేసులు నమోదయ్యాయని కేంద్రం తెలిపింది. దేశంలో ఎక్కువ కేసులు నమోదవుతున్న జిల్లాల్లో హైదరాబాద్ కూడా ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్రానికి లేఖ రాసింది. అవసరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణకు సూచించింది. కేసులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

ఇన్‌ఫ్లుయెంజా కూడా...

కోవిడ్ కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో ఇన్‌ఫ్లుఎంజా వంటి అనారోగ్యం కూడా ఉన్నట్లు తెలిపింది. అన్ని ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా ఇన్‌ఫెక్షన్ వ్యాప్తికి సంబంధించిన కేసులను గుర్తించాలని కోరింది. అంతర్జాతీయ ప్రయాణీకుల నిర్దేశిత నమూనాల కోసం జెనోమిక్ సీక్వెన్సింగ్ చేయాలని కోరింది. ముఖ్యంగా రద్దీ ప్రదేశాలు, కిక్కిరిసిన గదుల్లో కోవిడ్ జాగ్రత్తలు పాటించాలని సూచించింది. కాగా, తెలంగాణలో గురువారం 27 కరోనా కేసులు నమోదయ్యాయి. అంతకుముందు రోజు బుధవారం ఏకంగా 54 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించింది.

ఆందోళన చెందాల్సిన అవసరం లేనేలేదు

మారిన పరిస్థితుల రీత్యా కరోనా కేసుల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. ఇతర వైరల్ జ్వరాలు, ఇన్‌ఫ్లుయెంజా కేసులు కూడా పెరుగుతున్నాయి. వీటన్నింటి లక్షణాలు ఒకే రకంగా ఉంటాయి. లక్షణాలకు తగినట్లుగా వైద్యం తీసుకుంటే సరిపోతుంది. ఎక్కడా కూడా ఆసుపత్రుల్లో చేరికలు వంటివి ఏమీ లేవు. కాబట్టి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ప్రత్యేక జాగ్రత్తలు కూడా తీసుకోవాల్సినపనిలేదు.

– డాక్టర్ శ్రీనివాసరావు,ప్రజారోగ్య సంచాలకులు





Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.